తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 11.08.2025 | సంపుటి : 12 సంచిక : 23 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




# ముంపు ప్రాంతాల్లో ముఖ్యమంత్రి పర్యటన

## బాధితులకు భరోసా


హైదరాబాద్ నగరంలో భారీ వర్షాలకు తీవ్రంగా ప్రభావితమైన ముంపు ప్రాంతాల్లోపర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**అమీర్‌పేట్, బుద్ధనగర్, మైత్రివనం, బాల్కంపేట ప్రాంతాల్లో వరద ముంపుతో ప్రభావిత కాలనీలను పరిశీలించిన సీఎం**

**తక్షణ సహాయక చర్యలకు అధికారులకు ఆదేశం**

**ముఖ్యమంత్రికి తమ సమస్యలు వివరించిన బాధితులు**

**హైదరాబాద్(జనంసాక్షి):** నగరంలో భారీ వర్షాల కారణంగా వరదలతో ముంచెత్తుతున్న ప్రాంతాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇటీవల తక్కువ సమయంలో విపరీతమైన వర్షం కురవడం, పలుచోట్ల వరదలు ముంచెత్తుతున్న ప్రాంతాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన ముఖ్యమంత్రి అలాంటి ప్రాంతాల్లో శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అమీర్‌పేట్, బుద్ధనగర్, మైత్రివనం, బాల్కంపేట తదితర ప్రాంతాల్లో వరద ముంపుతో ప్రభావిత కాలనీలను ముఖ్యమంత్రి ఆదివారం ఆకస్మిక సందర్శించి పరిశీలించారు. బుద్ధనగర్‌లో వరద నీటి డ్రెయిన్ సిస్టమ్‌ను పరిశీలించి అక్కడే అధికారులకు తగిన సూచనలు చేశారు. బాల్కంపేట ముంపు ప్రభావిత ప్రాంతంలో తలెత్తుతున్న సమస్యలను హైడ్రా కమిషనర్, ఇతర అధికారులను అడిగి తెలుసుకున్నారు. బుద్ధనగర్ ప్రాంతంలో కాలనీ రోడ్డు కంటే డ్రైనేజీ కాలువ ఎక్కువ ఎత్తులో ఉండటంతో ఇరుకుగా మారి వరద తీవ్రత పెరుగుతోందని గమనించిన ముఖ్యమంత్రి వెంటనే తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆ కాలనీకి పక్కనే గంగూబాయి బస్తీకుంటను మిగతా 2లో..

## వరద సమస్యను పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నాం


జీహెచ్ఎంసీ అధికారులతో మంత్రి పొన్నం సమీక్ష

12



# హౌడీ మోడీ ఏమైందీ?

## గాలిబుడగలా తేలిపోయిన మోడీ,ట్రంప్ దోస్తానా

**బలోపేతం కాని ద్వైపాక్షిక స్నేహ సంబంధాలు • ఇప్పటికే భారత ఆర్థిక వ్యవస్థపై అమెరికా భారీ దెబ్బ**

భారత్‌పై అమెరికా సుంకాలు మోపడం దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు రాజకీయాలనూ తీవ్ర ప్రభావితం చేస్తోంది. ఒకవైపు పన్నుల భారం పెరుగుతుండగా వాటిని దీటుగా ఎదుర్కొంటామని మోడీ.. రాబోయే రోజుల్లో మరింత తీవ్రతరం చేస్తామని ట్రంప్.. వెరసి ఇరుదేశాల దౌత్యం డొల్లతనమేనని తేలిపోయింది. హౌడీ మోడీ, నమస్తే ట్రంప్, అబ్కీ బార్ ట్రంప్ సర్కార్ వంటి ప్రత్యక్ష ఎన్నికల ప్రచారం చేసినప్పటికీ వారిద్దరి ఫ్రెండ్‌షిప్ గాలిబుడగలా మారిపోయిందని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. మోడీ వ్యక్తిగత ఇమేజ్ పెంచుకోవడానికి తప్ప దేశ ఆర్థిక ప్రయోజనాలకు ఈ కార్యక్రమాలేవీ ఉపయోగపడలేదు సరికదా మరింత నష్టం తెచ్చిపెట్టాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రధాని నరేంద్ర మోడీ సందేశమిచ్చినప్పటికీ, ఈ వ్యూహం వల్ల వాణిజ్య సంబంధాలు తగ్గి రెండు వైపులా నష్టం కలిగించవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

- సుంకాల వల్ల దేశ జీడీపీపై 0.4%-%0.8శాతం ప్రభావం
- సరఫరా వ్యవస్థలో విచ్ఛిన్నం..
- ఎగుమతులూ 40%-%50 శాతం డౌన్!
- ఎగుమతిదారులు, పరిశ్రమలతో సంప్రదింపులు జరుపుతున్నామన్న కేంద్రం
- వాణిజ్య చర్చల కోసం ఆగస్ట్ 25న భారత్‌కు రానున్న అమెరికా బృందం

**జనంసాక్షి ప్రత్యేక ప్రతినిధి :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశంపై విధించిన 50% సుంకాలు (టారిఫ్‌లు) భారత ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ సుంకాలు రష్యా నుంచి చమురు కొనుగోళ్లకు ప్రతీకారంగా భావిస్తున్నారు. పెంచిన సుంకాల వల్ల భారత ఎగుమతులు 40-50% తగ్గే అవకాశం ఉండగా.. దాదాపు 45.4 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్ల వచ్చని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ ద్వారా తెలుస్తోంది. దీనివల్ల మిగతా 2లో..

## నిండుకుండలా నాగార్జునసాగర్..

**ప్రాజెక్టు 8 గేట్ల ద్వారా నీటి విడుదల**



కృష్ణా పరివాహక ప్రాంత ప్రాజెక్టులకు మళ్లీ వరద తాకిడి పెరిగింది. ఎగువ నుంచి వస్తున్న వరదతో శ్రీశైలం జలాశయం నిండగా.. అక్కడి నుంచి లక్ష క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో నాగార్జునసాగర్ నిండుకుండను తలపిస్తోంది. 8 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 1.09 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తోంది.

## పోస్టల్ సేవల్లో సర్వర్ ప్రాబ్లమ్స్

**మొరాయిస్తున్న ఏపీటీ 2.0 యాప్**

- దేశవ్యాప్తంగా పదేపదే స్తంభిస్తున్న కార్యకలాపాలు
- డెలివరీ, ఔట్‌గోయింగ్‌లకు నిత్యం ఇబ్బందులే..
- ప్రైవేటు కొరియర్లవైపు వినియోగదారుల మొగ్గు
- నత్తనడకన సాంకేతిక సమస్యల పరిష్కారం



తపాలా సేవలను సాంకేతికంగా విస్తరించాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ (ఏపీటీ 2.0) మొరాయిస్తోంది. డిజిటల్ సేవలను ఇంటింటికీ చేరుద్దామని కేంద్ర ప్రభుత్వం సంకల్పించినా సాంకేతిక సమస్యల వల్ల లక్ష్యం నీరుగారుతోంది. దీంతో ప్రజలు, వ్యాపార వాణిజ్య సంస్థల నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం సాగే కార్యకలాపాలకూ ఇది ఆటంకంగా మారడంతో కొందరు ప్రైవేటు సేవలపైపే మొగ్గుతున్నారు. దేశవ్యాప్తంగా ఈ ప్రభావం కనిపిస్తుండగా.. గ్రామీణస్థాయి పోస్టాఫీసుల్లోనూ సర్వర్లు డౌన్కై డెలివరీలు సైతం నిలిచిపోతున్నాయి. సేవలన్నీ ఆన్‌లైన్‌మయం చేసినప్పటికీ ఈ పోస్టల్ సిస్టం తరచూ ఇబ్బందులు పెడుతోందని పోస్టల్ ఉద్యోగులు, ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వార్త 2 లో



## ప్రజల ఆరోగ్యానికి కేంద్రం పెద్దపీట

**ఆయుష్మాన్ భారత్‌ను తెలంగాణలో ప్రవేశపెట్టాలి: కిషన్‌రెడ్డి**


**హైదరాబాద్(జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. ఉప్పల్‌లో 'భారతీయ జనౌషధ పరియోజన' పథకం ద్వారా ఉప్పల్ ఇండస్ట్రియల్ ప్రాంతంలో లోర్వెన్ ఫార్మా అండ్ సర్జికల్స్ సంస్థ ఏర్పాటు చేసిన మిగతా 2లో..

# రాయలసీమ ఎత్తిపోతలను ఆపండి

## లేకుంటే శ్రీశైలం ప్రాజెక్టు 25 రోజుల్లో ఖాళీ అవుతుంది

- రోజుకు 11 టిఎంసిలు తరలిస్తే నల్లగొండ ఖమ్మం జిల్లాల రైతాంగానికి తీవ్ర నష్టం
- బనకచర్లను ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోము
- గిరిజనులపై ఏమాత్రం ప్రేమ ఉన్నా పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించండి
- జవహర్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి

**ఖమ్మం ప్రతినిధి/మధిర(జనంసాక్షి):** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలకు 9 చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించిన కాంగ్రెస్ కార్యకర్తలకు నా సెల్యూట్ శ్రీశైలం ఎగువ భాగాన రోజుకు 11 టిఎంసిలు తరలిస్తున్న పోతిరెడ్డిపాడు ఎత్తిపోతలను వెంటనే నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబును కోరుతున్నానని భట్టి అన్నారు. ఆదివారం ఆయన మంత్రులు ఉత్తమ్,కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వాకిటి శ్రీహరి తో కలిసి మధిర మండలం వంగవీటిలో 600 కోట్లతో నిర్మించబోతున్న జవహర్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. నాగార్జున సాగర్ ఎడమ కాలవ ద్వారా రోజుకు మిగతా 2లో..





## తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టును కట్టి తీరుతాం

- గత పాలకుల అవినీతి, అసమర్థత వల్లే కాళేశ్వరం కూలిపోయిందని కమిషన్ స్పష్టం చేసింది
- ప్రాజెక్టు నివేదికపై ఎలాంటి రాజకీయాలు లేవు
- 3 బ్యారేజీల్లో నీటిని నిల్వ ఉంచొద్దని ఎన్‌డీఎస్‌ఏ స్పష్టంగా చెప్పింది
- ములుగు జిల్లాలో పర్యటనలో మంత్రి ఉత్తమ్
- దేవాదుల పంపుహౌస్ పనులపై సమీక్ష

వార్త 2 లో

## 'మేక్ ఇన్ ఇండియా'తోనే ఆపరేషన్ సిందూర్ లక్ష్యం నెరవేరింది

- మన అద్భుతమైన సాంకేతికతతో పాకిస్తాన్ తోక ముడిచింది
- బెంగళూరులో మెట్రో మూడో ఫేజ్ పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన





**బెంగుళూరు(జనంసాక్షి):** పాకిస్థాన్‌ను మట్టికరిపించిన 'ఆపరేషన్ సిందూర్ విజయం వెనుక 'మేక్ ఇన్ ఇండియా', మన సాంకేతికత దాగి ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సరికొత్త భారత్‌ను ప్రపంచం మొదటిసారి చూసిందన్నారు. రూ. 15,610 కోట్ల వ్యయంతో బెంగళూరులో మెట్రో మూడో ఫేజ్ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ప్రధాని మోదీ ప్రసంగించారు. నవ భారతానికి చిహ్నంగా బెంగళూరు ఎదుగుతోందన్నారు. "ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచం తొలిసారి సరికొత్త భారత్‌ను చూసింది. మన బలగాలు పాకిస్థాన్ భూభాగంలోని ఉగ్ర స్థావరాలను లక్ష్యంగా చేసుకుని.. కొన్ని గంటల్లోనే ఆ దేశాన్ని మోకరిల్లేలా చేశాయి. ఈ విజయానికి మన టెక్నాలజీ, రక్షణా రంగంలో 'మేక్ ఇన్ ఇండియా' శక్తి దోహదపడ్డాయి" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోందని తెలిపారు. మిగతా 2లో..

## భారత్ అభివృద్ధిపై ట్రంప్ అక్కసు

- అసూయతో రగిలిపోతున్నారు
- రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సెటైర్లు వేశారు. భారత్ ఎదుగుదలను చూసి ట్రంప్ అసూయతో రగిలిపోతున్నారని పరోక్షంగా వ్యాఖ్యానించారు .అందుకే టారిఫ్‌ల పేరుతో బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. భారత్ 'సూపర్ పవర్'కానుంది. అన్ని రంగాల్లో మిగతా 2లో..



## పుతిన్‌తో ట్రంప్ భేటీలో .. జెలెన్‌స్కీ

**ఆహ్వానించనున్న అమెరికా అధ్యక్షుడు**

**వాషింగ్టన్(జనంసాక్షి):** రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ముగింపు ప్రయత్నాల్లో భాగంగా ఈ నెల 15న అమెరికాలోని అలాస్కాలో దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ కానున్నారు. ఈ భేటీకి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని కూడా ఆహ్వానించడానికి ట్రంప్ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని వైట్‌హౌస్ పరిశీలిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. వాస్తవానికి అలాస్కాలో పుతిన్, జెలెన్‌స్కీతో త్రైపాక్షిక భేటీ నిర్వహించాలని ముందే ట్రంప్ భావించారు. ఇటీవల అమెరికా ప్రత్యేక రాయబారి మిగతా 2లో..



## జమ్మూకశ్మీర్‌లో టెన్షన్ టెన్షన్

**ఉగ్రవాదులను చుట్టుముట్టిన సైన్యం • కిష్త్వార్‌లో భారీ ఆపరేషన్**

వార్త 9 లో



## భాజపాలో చేరిన గువ్వల బాలరాజు

**కండువా కప్పి ఆహ్వానించిన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు**

**హైదరాబాద్(జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు భాజపాలో చేరారు. ఆదివారం నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షుడు రామచందర్‌రావు భాజపా కండువా కప్పి బాలరాజును పార్టీలోకి ఆహ్వానించారు. భాజపా పట్ల ప్రజల్లో పెరుగు తున్న ఆదరణ, ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై బాలరాజు పార్టీలోకి రావడం హర్షణీయమన్నారు. తెలంగాణలో భాజపా బలోపేతానికి ఆయన సేవలు వినియోగించుకుంటామన్నారు. ఎంపీ లక్ష్మణ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పలువురు సీనియర్ నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యానికి కేంద్రం పెద్దపీట

తెలంగాణ మార్కెటింగ్ కమ్ డిస్ట్రిబ్యూషన్ వేర్ హౌస్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కలిసి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో ఆయుష్మాన్ భారత్ విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి వెళ్లిపోయిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అయినా ఆయుష్మాన్ భారత్‌ను తెలంగాణలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని జనౌషధ కేంద్రాలకు మెడికల్ డిపోగా ఉప్పల్‌లో ప్రధాన మంత్రి భారతీయ జనౌషధ పరియోజన తెలంగాణ మార్కెటింగ్ కమ్ డిస్ట్రిబ్యూషన్ వేర్ హౌస్‌ను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. మోదీ ప్రభుత్వం 70సంవత్సరాలు నిండిన వృద్ధులకు.. ఆస్తితో, పెన్షన్‌తో సంబంధం లేకుండా రూ. ఐదు లక్షల వరకు భారతదేశంలో ఏ రాష్ట్రంలోనైనా ఏ నగరంలోనైనా కోరుకున్న హాస్పిటల్‌లో వైద్యం చేయించుకునే విధంగా ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశ పెట్టిందని కిషన్‌రెడ్డి చెప్పారు. మార్కెట్‌లో ఉన్న మెడిసిన్ ధరలతో పోల్చితే.. జనౌషధ కేంద్రాలలో 50 శాతం నుంచి 90 శాతం వరకు తక్కువ ధర ఉంటుందన్నారు.

## తెలంగాణలో నేడు భారీ వర్షాలు..

### 13 జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో ఇవాళ భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ తెలిపింది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, రాజన్న సిరిసిల్ల, సిద్ధిపేట, నాగర్ కర్నూల్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని, ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. హైదరాబాద్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వెల్లడించింది.





# ముప్పు ప్రాంతాల్లో ముఖ్యమంత్రి పర్యటన

సందర్శించి ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. బస్తీకుంటను కొంతమంది పూడ్చేసి పార్కింగ్ కోసం వినియోగిస్తున్నారని స్థానికులు ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంతంలో ప్రత్యేక ట్రంక్ లైన్ ఏర్పాటు చేసి వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, అందుకు వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశిం చారు. ఇటీవల పలు సందర్భాల్లో వరద నీరు నిలిచిన మైత్రీవనం వద్ద పరిస్థితిని పరిశీలించారు. స్థానికుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అమీర్ పేట బుద్ధనగర్‌లో జశ్వంత్ అనే బాలుడితో ముఖ్యమం త్రి వివరాలు ఆరా తీశారు. బాలుడిని వెంట తీసుకుని ఆ ప్రాంతాన్ని కలియతిరిగారు. తాను 7 వ తరగతి చదువుతున్నానని, వరద నీరు ఇంట్లోకి వచ్చి పుస్తకాలు తడిసిపోయాయని ఆ బాలుడు ముఖ్యమంత్రికి వివరిం చారు. భవిష్యత్తులో వరద పరిస్థితులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపిస్తానని ముఖ్యమంత్రి బాలుడికి ధైర్యం చెప్పారు. ఆయా ప్రాంతాలను పరిశీలించిన తర్వాత ముఖ్యమంత్రి తీసుకోవలసిన చర్యలపై సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.

## తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టును కట్టి తీరుతాం

ఏటూరునాగారం(జనంసాక్షి):

డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ములుగు జిల్లాలో పర్యటిం చారు. ఈ సందర్భంగా దేవాదుల పం పుహౌస్ పరిశీలించి. పను లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డి ప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ.. తమ ప్రభు త్వా నికి దేవాదుల అత్యంత ముఖ్యమైన ప్రాజెక్టు అని చెప్పారు. దీని ద్వారా దాదాపు 6 లక్షల ఎక రాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ ప్రాజెక్టుకు భూసేకరణ కోసం రూ.67 కోట్లు అవసరమవుతుందని చెప్పారు. పెండింగ్ బిల్లులు కూడా త్వరగా మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లోని ముంపు ప్రాంతాలకు పరిహారం ఇవ్వడానికి సిద్ధమన్నారు. భూసేకరణపై జిల్లాల కలెక్టర్లు త్వరగా చర్యలు చేపట్టాలని సూచించారు. "కాళేశ్వరం కమిషన్ నివేదిక చూసి నిర్ఘాంత పోయాం. గత పాలకుల అవినీతి, అసమర్థత వల్లే కూలిపోయిందని కమిషన్ చెప్పింది. కాళేశ్వరం డిజైన్ చేసింది వారే.. కూలిపోయింది వారి హయాంలోనే. కాళేశ్వరం నివేదికపై ఎలాంటి రాజకీయాలు లేవు. నీటిని 3 బ్యారేజీల్లో నిల్వ ఉంచొద్దని ఎన్‌డీఎస్‌ఏ స్పష్టంగా చెప్పింది. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టును కట్టి తీరుతాం"అని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.



# రాయలసీమ ఎత్తిపోతలను ఆపండి

ఒక టీఎంసీ విడుదల చేస్తేనే ఇన్ని లక్షల ఎకరాలు సాగు అవుతుంది, పోతిరెడ్డిపాడు ద్వారా రోజుకు 11 టీఎంసీలు తరలించకపోతే ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల రైతంగానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా రోజుకు 11 టిఎంసిలు తరలించడంతో శ్రీశైలం ప్రాజెక్టు కేవలం 25 రోజుల్లో ఖాళీ అవుతుందన్నారు. బనకచర్ల అడ్డుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఒకవైపు కేంద్రంతో మరోవైపు న్యాయస్థానాల్లో పోరాటం చేస్తున్నందుకు రాష్ట్ర ప్రజల పక్షాన వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నారని డిప్యూటీ సీఎం తెలిపారు. సీఎం, ఉత్తమ్ కుమార్ రెడ్డి నిటారుగా నిలబడడంతోనే బనకచర్ల, శ్రీశైలం లిఫ్ట్ ఆగిపోయాయి అన్నారు. ఎడమ కాలువ రైతుల పక్షాన వారిద్దరికీ ధన్యవాదాలు అని డిప్యూటీ సీఎం తెలిపారు. నీటి పోరాటంలో సీఎం రేవంత్ రెడ్డి ఉత్తంకుమార్ రెడ్డి నిలబడి కలబడతాం అన్నారు.భద్రాచలం డివిజన్లోని గిరిజనులు నివసించే ఏడు మండలాలను పక్కకు పెట్టాలని నాడు సోనియాగాంధీకి విజ్ఞప్తి చేయగా చట్టంలోంచి ఆ ఏడు మండలాలను మినహాయించారని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. ఆ తర్వాత కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి, రాష్ట్రంలో టిఆర్ఎస్ కలిసి దొంగ చాటుగా ఆర్డినెన్స్ తెచ్చాయి అన్నారు. ఆర్డినెన్స్ ఇవ్వడం ద్వారా గిరిజనులకు సంబంధించిన రెండు లక్షల ఎకరాలు పోలవరానికి ధారాధత్తం చేశారని డిప్యూటీ సీఎం ఆరోపించారు. గిరిజనులపై ఏమాత్రం ప్రేమ ఉన్న ఏపీ సీఎం పోలవరం ఎత్తు తగ్గించి రెండు లక్షల ఎకరాలను కాపాడాలి అని డిప్యూటీ డిమాండ్ చేశారు. గోదావరి ఎగువగ భాగాన మా ప్రాజెక్టులు పూర్తి అయిన తర్వాత, నికర జలాలు, వరద జలాల వాటా తేలిన తర్వాతే బనకచర్ల ప్రస్తావన తీసుకురావాలని డిప్యూటీ సీఎం అన్నారు. 2018 ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో మధిర నుంచి తాను, భద్రాచలం నుంచి పొడేం వీరయ్య ఇద్దరమే గెలిచామని ఆ సమయంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త వారే ఒక ఎమ్మెల్యేగా భావించి కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించారు.

మధిర ప్రాంతానికి నీళ్లు ఇవ్వడాన్ని అదృష్టంగా భావిస్తున్నా: భట్టి

వంగవీడు: కొన్ని దశాబ్దాలుగా మధిర ప్రాంత ప్రజలు సాగునీటి కోసం ఎన్నో కష్టాలు పడ్డారని, పాలకులను వేడుకున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ ప్రాంత ప్రజల అవసరాలు తీర్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గ పరిధిలోని వంగవీడులో రూ.630.30 కోట్లతో జవహార్ ఎత్తిపోతల పథకానికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్‌రావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో భట్టి మాట్లాడారు. "పదేళ్లు భారత రాష్ట్ర సమితి నీటి ప్రాజెక్టుల గురించి పట్టించుకోలేదు. జవహార్ ప్రాజెక్టు కోసం చాలా ఏళ్లుగా మాట్లాడుతూనే ఉన్నా. అసెంబ్లీలో గళమెత్తినా గత ప్రభుత్వం దాని గురించి ఆలోచన చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని కోరా. ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అన్ని అనుమతులు ఇచ్చారు. వారికి నా ధన్యవాదాలు తెలిపారు.



## 'భారత్ అభివృద్ధిపై ట్రంప్ అక్కసు

విశ్వవిజేతగా నిలుస్తోంది. అలాంటి భారత్ ఎదుగుదలను ఎవరూ ఆపలేరు. భారత్ అభివృద్ధిపై జరుగుతున్న చర్చను చూసి కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. భారత్ ఎదుగుదల వాళ్లకు ఇష్టం లేదు.అందుకే ప్రపంచ దేశాల్లో మేడిన్ ఇండియా ఉత్పత్తుల కొనుగోళ్లు జరగకుండా కుట్ర చేస్తున్నారు. మేడిన్ ఇండియా ఉత్పత్తులు చాలా ఖరీదైనవనే ప్రచారం చేస్తున్నారు. ఆ ప్రచారం వల్ల కొనుగోళ్లు ఆపొచ్చని అనుకుంటున్నారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. నేను మీకు మాటిస్తున్నా.. ప్రపంచంలోని ఏ శక్తి భారత్ సూపర్ పవర్ అవ్వకుండా ఆపలేదని స్పష్టం చేశారు.ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం కొనసాగుతోంది. ఈ యుద్ధానికి రష్యాకు భారత్ పరోక్షంగా సహకరిస్తోందని ట్రంప్ వరుస ఆరోపణలు గుప్పిస్తున్నారు. భారత్.. రష్యా నుంచి చమురు కొనుగోళ్ల విషయంలో భారత్ వెనక్కి తగ్గాలని హెచ్చరించారు. కాదంటే సుంకాల పెంపు ఉంటుందన్న ట్రంప్ పనిలోపనిగా.. భారత దిగుమతులపై 25 శాతం టారిఫ్ విధించారు. అదనంగా పెనాల్టీ విధించారు.అంతేకాదు,రష్యాతో తన ఒప్పందాలను భారత్ నిలిపివేయాలని బెదిరించారు. ఇరు దేశాల మధ్య వ్యాపార,వాణిజ్య ఒప్పందాలు ఇలాగే కొనసాగితే మరింత సుంకాల పెంపు ఉంటుందని అన్నారు. ఫలితంగా భారత ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతుందని అన్నారు. ఈ క్రమంలో ట్రంప్ చర్యలను ఉద్దేశిస్తూ రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. ట్రంప్ చర్యలకు ధీటుగా బదులిచ్చారు.

## పుతిన్‌తో ట్రంప్ భేటీలో .. జెలెన్‌స్కీ

స్టీవ్ విట్‌కాఫ్ మాస్కో పర్యటన సమయంలోనూ ఇదే విషయాన్ని ప్రతిపాదించారు. దీనిపై క్రెమ్లిన్ నుంచి ఎలాంటి స్పందనా రాకపోవడంతో.. తొలుత పుతిన్‌తో ద్వైపాక్షిక భేటీ జరిపి కాల్పుల విరమణ ఒప్పందానికి ఒప్పించాలని యోచించారు. ఈ నేపథ్యంలో భేటీకి జెలెన్‌స్కీని ఆహ్వానించడంపై ట్రంప్ పునరాలోచిస్తున్నట్లు సమాచారం. శాంతి చర్చల్లో కీవ్‌ను కూడా భాగం చేయాలని యూకే, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, పోలాండ్, ఫిన్లాండ్ వంటి యూరోపియన్ దేశాలు అగ్రరాజ్యానికి విజ్ఞప్తి చేయడం కూడా ఒక కారణంగా తెలుస్తోంది.రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ముగింపు ప్రయత్నాల్లో భాగంగా ఈ నెల 15వ తేదీన అమెరికాలోని అలాస్కాలో పుతిన్‌తో భేటీ అవ్వనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. పుతిన్‌తో సమావేశంలో యుద్ధాన్ని ముగించడంపై చర్చలు జరపనున్నామని ట్రంప్ తెలిపారు. శాంతి ఒప్పందంలో భాగంగా భూభాగాల మార్పిడి ఉంటుందని ఆయన వెల్లడించారు. మరో వైపు భూభాగాల మార్పిడిని అంగీకరించేది లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో అలాస్కా సమావేశంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు పాల్గొంటారా లేదా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

# హౌడీ మోడీ ఏమైంది?

భారత జీడీపీపై 0.4-0.8శాతం ప్రభావం చూపనుంది. ఎగుమతులూ తీవ్రంగా దెబ్బతింటాయి. భారత ఉత్పత్తుల ధరలు అమెరికాలో పెరగడంతో వినియోగదారుల ఖర్చు పెరుగుతుంది, దీనివల్ల అమెరికాలో ద్రవ్యోల్బణం (ప్రస్తుతం 2.7%) మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అయితే ప్రతీకార సుంకాలు కాదు, చర్చల ద్వారా పరిష్కారం ఆలోచించాలని నిపుణులు సూచిస్తున్న దరిమిలా ఈ నెల 25న

### ఆర్థిక నిపుణుల హెచ్చరికలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 25% నుంచి 50% వరకు సుంకాలు విధిస్తామని ప్రకటించడం భారత ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సుంకాలు ప్రధానంగా ఆటోమొబైల్, ఆటో విడిభాగాలు, స్టీల్, స్మార్ట్‌ఫోన్లు, అల్యూమినియం, సోలార్ పరికరాలు, మెరైన్ ఉత్పత్తులు, వజ్రాలు, నగలు, వ్యవసాయ ఉత్పత్తులు వంటి రంగాలను ప్రభావితం చేస్తాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సరఫరా వ్యవస్థలో తక్షణ విచ్ఛిన్నం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రధాని నరేంద్ర మోడీ స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం వల్ల పరిశ్రమలను కాపాడుకోవచ్చని అంటున్నా అవి నష్టాన్ని నివారించలేవని నిపుణులు భావిస్తున్నారు. అమెరికాకు ఎగుమతులు తగ్గించే వ్యూహాన్ని భారత్ పాటించినా ఇది ఇరుదేశాలకూ నష్టం కలిగిస్తుందని చెబుతున్నారు.

### మోడీ రెంటికీ చెడ్డ రేవడి..!

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ తన స్పష్టమైన వైఖరిని వెల్లడిరచగా.. మోడీ మాత్రం విమర్శల పాలయ్యారు. విదేశీ రాజకీయాల్లో ప్రత్యక్ష జోక్యం దౌత్య సంబంధాలకు నష్టం చేకూరుస్తుందనే హెచ్చరికలు ఖాతరు చేయకుండా ట్రంప్‌కు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ వ్యవహారం అగ్రరాజ్యంతో మరింత చేటుచేసిందనే వాదనలున్నాయి. అమెరికా ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యత అని, వాణిజ్య లోటును తగ్గించేందుకు భారత్‌తో కఠిన వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాలని, అవసరమైతే ఎవరితోనైనా వాణిజ్య విషయాల్లో కఠినంగా ఉంటామని ట్రంప్ ఎన్నికలకు ముందు కుండబద్దలు కొట్టారు. అయినప్పటికీ తటస్థంగా ఉండాల్సినచోట ఒకవైపే ప్రచారం చేసి ఇప్పుడు మోడీ అభాసు పాలయ్యారని ప్రతిపక్షాలు ఆరోపిసున్నాయి. అమెరికాలో ఎవరు గెలిచినా వాణిజ్య ఒప్పందాలను బలోపేతం చేసుకోవాల్సిందిపోయి ఇప్పుడు ఎరక్కపోయి ఇరుక్కుపోయినట్టుగా మోడీ మారారని ఎద్దేవా చేస్తున్నాయి. ప్రస్తుతం స్వదేశీ విధానంతో నష్టాన్ని తగ్గించేందుకు యత్నిస్తున్నప్పటికీ దౌత్యపరంగా ట్రంప్‌తో సంబంధాలను నిర్వహించడంలో ప్రధాని మోడీ విఫలమయ్యారన్నది వాస్తవం. భవిష్యత్తులోనూ ఇరువురి సంబంధాలు ఎలా సాగుతాయనేది ప్రశ్నార్థకంగానే మారిందని అభిప్రాయపడుతున్నారు.

### సరఫరా వ్యవస్థ విచ్ఛిన్నం

– అహ్లూవాలియా, ఎకనామిస్ట్

ట్రంప్ నిర్ణయంతో తక్షణరీతిలో సరఫరా వ్యవస్థ విచ్ఛిన్నత కానుందని ఫౌండేషన్ ఫర్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ వ్యవస్థాపక డైరెక్టర్ రాహుల్ అహ్లూవాలియా స్పందించారు. 25 శాతం సుంకాలతో తమపై ఎక్కువగా ప్రభావం పడుతుందని టాటా మోటార్స్, భారత్ ఫోర్జ్ కంపెనీ వర్గాలు విశ్లేషించాయి.

### ఇది ఆర్థిక బ్లాక్‌మెయిల్ : రాహుల్

సుంకాలు ఆర్థిక బ్లాక్ మెయిల్ వంటివి. మోడీ ధైర్యంగా స్పందించాల్సిందే. లేకపోతే ఇదివరకు ట్రంప్ ఎన్నిసార్లు ప్రకటించుకున్నా అవి అబద్ధమని చెప్పలేకపోయారు. ఇప్పుడు కూడా స్పందించకపోతే బలహీన స్థితిలో పడ్డారని భావించాల్సి వస్తుంది. ఏదో రహస్యం ఉందని అనుమానాలు కూడా వస్తున్నాయి.


### సుంకాల ప్రభావాన్ని తట్టుకోగలం

– పియూష్ గోయల్, కేంద్ర వాణిజ్య మంత్రి

పార్లమెంటులో సుంకాల ప్రభావాన్ని పరిశీలిస్తున్నాం. ఎ గుమతిదారులు, పరిశ్రమలతో సంప్రదింపులు జరుపుతున్నాం. భారత్ గతంలో అణు పరీక్షల సమయంలో ఆంక్షలను ఎదుర్కొన్నప్పటికీ, ఇప్పుడు స్వయం సమృద్ధిగల ఆర్థిక శక్తిగా ఉంది. సుంకాల ప్రభావాన్ని తట్టుకోగలమని ప్రభుత్వం ధీమాగా ఉంది.

# పోస్టల్ సేవల్లో సర్వర్ ప్రాబ్లమ్స్

- మొరాయిస్తున్న ఏపీటీ 2.0 యాప్
- దేశవ్యాప్తంగా పదేపదే స్తంభిస్తున్న కార్యకలాపాలు
- డెలివరీ, ఔట్‌గోయింగ్‌లకు నిత్యం ఇబ్బందులే..
- ప్రైవేటు కొరియర్లవైపు వినియోగదారుల మొగ్గు
- నత్తనడకన సాంకేతిక సమస్యల పరిష్కారం



హైదరాబాద్, ఆగస్ట్ 10 (జనంసాక్షి) :

ఇటీవలే ప్రవేశపెట్టిన ఏపీటీ 2.0 సిస్టమ్‌లో సర్వర్ వైఫల్యం కారణంగా దేశవ్యాప్తంగా 1.5 లక్షల పోస్టాఫీసుల్లో కార్యకలాపాలు స్తంభించాయి. ఈ సంక్షోభం వల్ల సామాన్య ప్రజలు, వ్యాపార సంస్థలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఆగస్ట్ మొదటివారం నుంచీ స్పీడ్ పోస్ట్, రిజిస్టర్డ్ పోస్ట్, పార్శిల్ బుకింగ్, కన్సైన్‌మెంట్ ట్రాకింగ్, ఎలక్ట్రానిక్ మనీ ఆర్డర్‌లు పూర్తిగా నిలిచిపోయాయి. రక్షాబంధన్ బహుమతులు, చట్టపరమైన పత్రాలు, ఇన్‌వాయిస్‌లు వంటి సమయానుగుణ సేవలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. హైదరాబాద్ (ఫలక్‌నుమా, జీపీఓ అబిడ్స్), చెన్నై సెంట్రల్,తాంబరం, ఢల్లీ (35పైగా కార్యాలయాలు), మిజోరాం యూనివర్శిటీ, బారూయిపూర్, జాదవ్‌పూర్ యూనివర్శిటీలో ప్రధాన ఆటంకాలు నమోదయ్యాయని ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ పోస్టల్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎన్‌పీవో) వెల్లడిరచింది. దీనివల్ల న్యాయ సంస్థలు, ఈ-కామర్స్ వ్యాపారాలు ఒప్పందాలు, నశ్వరమైన వస్తువులు చేరకపోవడంతో ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నాయని, ప్రజలు ప్రైవేట్ కొరియర్ సేవల వైపు మళ్లుతున్నారని పేర్కొంది.

### కొత్త వ్యవస్థలో లోపాలు

ఏపీటీ 2.0లో సాంకేతిక వైఫల్యాలు, అంతర్గత డాక్యుమెంట్లు కొత్త వ్యవస్థలోని వ్యవస్థాగత లోపాలను వెల్లడిస్తున్నాయి. క్యూఆర్ చెల్లింపులు, యూపీఐ ఇంటిగ్రేషన్‌లు, పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ ప్రీమియం సేకరణలు సాధారణ సమయంలో ప్రతిబింబించడం లేదు. ఆదాయ ట్రాకింగ్‌లోనూ గందరగోళం కనబడుతోంది. సబ్‌స్టిట్యూట్ సిబ్బంది కోసం లీవ్ అప్లికేషన్‌లు ప్రాసెస్ చేయలేకపోవడం, బ్యాగ్, లేబుల్ సిస్టమ్ లోపాల వల్ల పార్శిల్ డిస్పాచ్ లోపాలు, సంస్థాగత డెలివరీలను అడ్డుకునే తప్పనిసరి మొబైల్ నంబర్ ఫీల్డ్‌లు కార్యకలాపాల లోపాలుగా మారాయి. అయితే ఈ సమస్యలను పరిష్కరించడానికి రాత్రి 11 గంటల వరకు సిబ్బంది పనిచేస్తుండగా.. అపరిష్కృత బగ్‌ల వల్ల తీవ్ర ఒత్తిడి పడుతోంది. వారిలో శిక్షణా లోపాలు కూడా ఉన్నట్టు తెలుస్తోంది.

### వినియోగదారుల్లో ఆగ్రహం

క్యాష్ డిపాజిట్లు, లెటర్ల డెలివరీలు, ఔట్‌గోయింగ్‌లు, ఆర్‌డీలు ఇత్యాది కార్యకలాపాలన్నీ గ్రామీణస్థాయి వరకు జరుగుతున్నాయి. వీటన్నింటినీ ఆన్‌లైన్ ద్వారానే క్లియర్ చేయాల్సి ఉంటుంది. అయితే ఒకేరోజులో గంటల తరబడి కొత్త యాప్ మొరాయిస్తుందని, సర్వర్ డౌన్ కావడం వల్ల సమయం అంతావృథా అవుతోందని పలువురు పోస్ట్‌మెన్లు చెబుతున్నారు. సమస్యను వారి జోన్‌వారీ వాట్సప్ గ్రూపుల్లో షేర్ చేయడం, వాటిని ఏదొక సమయంలో పరిష్కరించడం చేస్తున్నప్పటికీ సేవలకు ఆటంకం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో ఎఫ్ఎన్‌పీవో 40కిపైగా కీలక బగ్‌ల జాబితాను అందించినప్పటికీ అవి పరిష్కారం నోచుకోలేదు. దీంతో తపాలా కార్యకలాపాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. హైదరాబాద్ వంటి నగరాలతో పాటు గ్రామీణ స్థాయి వరకూ ఇదే పరిస్థితి నెలకొన్నట్టు తెలుస్తోంది.

# 'మేక్ ఇన్ ఇండియా'తోనే ఆపరేషన్ సిందూర్ లక్ష్యం నెరవేరింది



2014కు ముందు కేవలం ఐదు నగరాలకే పరిమితమైన మెట్రో సేవలు.. నేడు 24 నగరాలకు విస్తరించాయన్నారు. బెంగళూరు మెట్రో కోసం కేంద్రం కంటే రాష్ట్ర ప్రభుత్వమే ఎక్కువ ఖర్చు చేస్తోందని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. బెంగళూరులో మెట్రో మూడో ఫేజ్ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఈమేరకు మాట్లాడారు. "ఒప్పందం ప్రకారం మెట్రో ప్రాజెక్టుకు కేంద్రం, రాష్ట్రం సమానంగా నిధులు సమకూర్చాల్సి ఉంది. అయినప్పటికీ.. రాష్ట్రం ఎక్కువ ఖర్చు చేస్తోంది" అని తెలిపారు. అభివృద్ధి విషయంలో మహారాష్ట్ర, గుజరాత్‌ల మాదిరే కర్ణాటకకూ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. బెంగళూరు పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ అంతకుముందు బెంగళూరు-బెళగావి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు. అక్కడి నుంచే వర్చువల్‌గా అమృత్‌సర్-కాట్రా, నాగ్‌పుర్-పుణె వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు జెండా ఊపారు. బెంగళూరు-బెళగావి వందేభారత్ రైలులో ప్రయాణించి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా.. నగరంలోని ఆర్‌వీరోడ్డు-బొమ్మసంద్ర మధ్య ఎల్లో లైన్ (19.15 కిలోమీటర్లు) మార్గాన్ని ప్రారంభించారు. అంతకుముందు ప్రధాని నరేంద్ర మోదీ బెంగళూరులో పర్యటించారు. బెంగళూరు - బెళగావి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు. అక్కడి నుంచే వర్చువల్‌గా అమృత్‌సర్ - కాట్రా , నాగ్‌పూర్ - పుణె వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు జెండా ఊపారు. బెంగళూరు-బెళగావి వందేభారత్ రైలులో ప్రయాణించి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా.. నగరంలోని ఆర్‌వీరోడ్డు- బొమ్మసంద్ర మధ్య ఎల్లో లైన్( 19.15 కిలోమీటర్లు) మార్గాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ బెంగళూరు మెట్రో ఎల్లో లైన్ ప్రారంభించడంపై కర్ణాటక కాంగ్రెస్ నేతలు భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు. తాము కష్టపడి రూపొందించిన అర్బన్ మొబిలిటీ ప్రాజెక్ట్‌కు భాజపా క్రెడిట్ తీసుకుంటోందని ఆ రాష్ట్ర మంత్రి ప్రియాంక్ ఖర్గే ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తగిన నిధులు మంజూరు చేయకపోవడం వల్లే ఈ ప్రాజెక్టు ఆలస్యమయ్యిందని దుయ్యబట్టారు. ఇప్పటిదాకా ఓట్ల చోరీ చేసి అధికారంలోకి వచ్చిన భాజపా.. ఇప్పుడు క్రెడిట్ చోరీ చేస్తోందని మండిపడ్డారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం అప్పట్లో భారీగా ఖర్చు చేసి ప్రారంభించిన ఈ మెట్రో ప్రాజెక్టుకు భాజపా అధికారంలోకి వచ్చాక నిధుల కేటాయింపు తగ్గిందని ఆరోపించారు. దానివల్ల ప్రభుత్వంపై అధిక భారం పడడంతో అప్పులు కూడా చేయాల్సి వచ్చిం దన్నారు.

**ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు చెక్ పెట్టాం: ఆర్మీచీఫ్ ఉపేంద్ర ద్వివేది**

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారతీయ వాయుసేన పాకిస్థాన్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను, మరో పెద్ద విమానాన్ని నేలకూల్చిందని ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ శనివారం ప్రకటించిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది ఆపరేషన్ సిందూర్‌పై ఇటీవల ఐఐటీ మద్రాస్‌లో మాట్లాడిన వీడియో వైరల్‌గా మారింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సైన్యం దాయాది దేశంతో చెస్ ఆడిందని అన్నారు. శత్రువు తదుపరి కదలికలు ఏమిటో కూడా ఆ సమయంలో తమకు తెలియదని.. ఈ పరిస్థితిని గ్రేజోన్ అంటారని అన్నారు. అయినప్పటికీ సమయానుకూలంగా స్పందిస్తూ.. ఆ దేశానికి చెక్ పెట్టామని పేర్కొన్నారు.ఈ ఆపరేషన్‌ను ప్రభుత్వం, భారత సైన్యం ఎంతో వ్యూహాత్మకంగా అమలు చేశాయని ద్వివేది తెలిపారు. మన పౌరులను బలి తీసుకున్న ఉగ్రవాదులను అంతం చేయాలని త్రివిధ దళాలు కోరినప్పుడు.. ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైన్యానికి స్వేచ్ఛ ఇచ్చారని వెల్లడించారు. దీంతో తాము ఉగ్ర స్థావరాలను సమర్థవంతంగా ధ్వంసం చేశామన్నారు. ఆపరేషన్ అనంతరం పాకిస్థాన్ సైన్యాధ్యక్షుడు జనరల్ మునీర్‌ను ఆ దేశ 'ఫీల్డ్ మార్షల్'గా నియమించడాన్ని ద్వివేది ఎద్దేవా చేశారు.

# నాంపల్లిలో తుది మెరుగులు దిద్దుకుంటున్న హెచ్‌ఎంఆర్‌ఎల్ బహుళ అంతస్తుల పార్కింగ్

- కాంప్లెక్స్ దేశంలోనే మొట్ట మొదటి అత్యంత ఆధునిక ఆటోమేటెడ్ పార్కింగ్ ప్రాజెక్ట్
- 10 పార్కింగ్ అంతస్తులు, ఆకర్షణీయమైన సినిమా థియేటర్‌లు
- పనుల ప్రగతిని పరిశీలించిన హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : హైదరాబాద్‌లో పార్కింగ్ కష్టాలను తీర్చే దిశగా హైదరాబాద్ మెట్రో రైల్ ఒక అద్భుతమైన ప్రాజెక్టుకు తుది మెరుగులు దిద్దుతోందిజ ప్రపంచంలోనే అరుదుగా ఉండే పూర్తిస్థాయి ఆటోమేటెడ్ బహుళ అంతస్తుల పార్కింగ్ వ్యవస్థను హైదరాబాద్ నడిబొడ్డున నాంపల్లిలో నిర్మించామని హైదరాబాద్ మెట్రో రైల్ ఎండి ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. నాంపల్లి లో జరుగుతున్న ఈ ప్రాజెక్టును ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల నుండి తుది అనుమతులు లభించిన వెంటనే త్వరలోనే ఇది ప్రజలకు అందుబాటులోకి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టును ప్రపంచ శ్రేణి ప్రాజెక్టుగా అమలులోకి తేవాలని చేసిన ఆదేశాల మేరకు, ఈ ప్రాజెక్టును అత్యంత ఆకర్షణీయంగా రూపొందిస్తున్నామని ఎండీ తెలిపారు. హెచ్‌ఎంఆర్‌ఎల్ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టును పీపీపీ విధానంలో 'నోవమ్' సంస్థ చేత నిర్మింపచేసినట్టు ఆయన తెలిపారు. ఇది జర్మనీకి చెందిన అత్యాధునిక 'పాలిస' సాంకేతికతతో పూర్తి ఆటోమేటెడ్ పజిల్ పార్కింగ్ సిస్టమ్‌గా నిర్మించబడిందని ఆయన చెప్పారు. నాంపల్లి మల్టీ లెవెల్ పార్కింగ్ ప్రాజెక్ట్ ప్రపంచంలోనే అత్యంత ఆధునికమైన పార్కింగ్ కాంప్లెక్సులలో ఒకటని, భారతదేశంలో ఇదే మొట్టమొదటిదని ఎండీ వెల్లడించారు. హెచ్‌ఎంఆర్‌ఎల్ రెండువేల చదరపు గజాల స్థలాన్ని 50 సంవత్సరాల కన్సెషన్ కు ఇవ్వగా, ప్రాజెక్టు దెవలపర్లు డాక్టర్ హరికిషన్ రెడ్డి, శ్రీమతి భావనా రెడ్డి వారి సొంత పెట్టుబడి 102 కోట్ల రూపాయలతో ఈ ప్రాజెక్టును నిర్మించారని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మొత్తం 15 అంతస్తులు కలిగిన ఈ పార్కింగ్ ప్రాంగణంలో 3 బేస్‌మెంట్లు, 7 పైఅంతస్తులు కలిపి మొత్తం 10 పార్కింగ్ అంతస్తులు ఉంటాయని, వీటితో పాటు 5 వాణిజ్య పరమైన కార్యకలాపాల కోసం కేటాయించినట్టు ఆయన తెలిపారు. చక్కటి వసతులున్న రెండు సినీథియేటర్లు కూడా ఈ కాంప్లెక్స్ లో ఉన్నాయని, 11వ అంతస్తులో నగర వీక్షణకు ఒక గ్యాలరీ ఉంటుందని ఆయన చెప్పారు. ఈ మల్టీ పార్కింగ్ అంతస్తులలో మొత్తం 250 కార్లు, 200 ద్విచక్ర వాహనాల పార్కింగ్ చేయవచ్చని చెప్పారు. పూర్తిస్థాయిలో సెన్సార్ల సహాయంతో మానవ ప్రమేయం లేకుండా జరిగే ఈ ఆటోమేటెడ్ పజిల్ పార్కింగ్ విధానం చాలా ఆసక్తికరంగా ఉంటుందని ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. ఇది ఎస్‌యూవీలు, సెడాన్‌లు, చిన్న కార్లను వాటి పరిమాణం ఆధారంగా స్వయంచాలకంగా వేరు చేసి, వాటివాటికి కేటాయించిన అంతస్తుల్లో పార్క్ చేస్తుందని ఆయన చెప్పారు. ఢిల్లీ, ముంబై నగరాలలో ఉన్న కొద్దిపాటి మెకానికల్ పార్కింగ్ కాంప్లెక్సుల వలే కాక, ఇక్కడ ప్యాలెట్ లేకుండా ఉండటం వల్ల పార్కింగ్ అత్యంత సౌలభ్యంగా ఉంటుందన్నారు. వాహనాలు లోపలికి, బయటకు వచ్చే టెర్మినళ్లు విశాలంగా ఉండి, స్మార్ట్‌గా పని చేస్తాయని తెలిపారు. వృద్ధులు, మహిళలు, వికలాంగులకు అనుకూలంగా ఉండేలా ఫ్లాట్ టెర్మినల్స్ ఉంటాయని, వాహనాలను ఎటువంటి కోణంలో విడిచి పెట్టి వెళ్లినా, 360 డిగ్రీలు తిరిగగలిగే ప్యాలిస్ టేబుల్ స్వయంగా దానిని సరైన విధానంలో పెట్టి పార్కింగ్ చేస్తుందని ఆయన వెల్లడించారు. ఈ పార్కింగ్ ప్రక్రియ వినియోగదారుడికి ఒక వినూత్నమైన అనుభవాన్ని ఇస్తుందన్నారు. ప్రవేశద్వారంలో క్యూఆర్ కోడ్ ఉన్న టికెట్ (స్మార్ట్ కార్డ్) సూచనలతో ఇన్/అవుట్ టెర్మినల్‌కు చేరుకున్నవెంటనే, కార్డును స్వైప్ చేస్తే టెర్మినల్ గేట్ తెరుచుకుంటుంది. డ్రైవర్ టర్న్‌టేబుల్ మీద కారును నిలిపివేసి హ్యాండ్ బ్రేక్స్ వేసి, ఇంజిన్ ఆఫ్ చేసి, బయటకు వస్తే సరిపోతుంది. టెర్మినల్ బయట కార్డును స్వైప్ చేయగానే పార్కింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. సిస్టమ్ తనంతట తానే కారును స్కాన్ చేసి, ఎస్‌యూవీ/సెడాన్‌గా వర్గీకరించి, తగిన అంతస్తులో పార్క్ చేస్తుంది. వినియోగదారుడు ఫీజు చెల్లించే కౌంటర్ లో రుసుము ఇచ్చిన తర్వాత, సూచించిన ఐ/ఓ టెర్మినల్ వద్దకు వెళ్లి కార్డును స్వైప్ చేయగానే, పార్కింగ్ ప్లాట్ ఫామ్ నుండి వాహనం వినియోగదారుని వద్దకు చేరుకుంటుంది. ఈ ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్ నగర ప్రజలకు ప్రపంచ స్థాయి పార్కింగ్ అనుభవం అందించనున్నామని ఆయన వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ పార్కింగ్ సమస్యలకు ఒక చక్కటి పరిష్కారం అందించడమే కాకుండా, సాంకేతికత, వినియోగదారుల అనుభవం, భద్రత, మరియు సౌలభ్యం పరంగా దేశంలో ఒక కొత్త ప్రమాణాన్ని స్థాపించబోతోందని ఆయన చెప్పారు.

# అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

- అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- గత ప్రభుత్వం హామీలే తప్ప అభివృద్ధి చేయలేదు
- మంత్రి వివేక్ వెంకటస్వామి



మంచిర్యాల ప్రతినిధి ఆగస్టు 10 (జనంసాక్షి) : కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసం పేద ప్రజల అభ్యున్నతి లక్ష్యంగా పనిచేస్తుందని అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని కార్మిక శాఖ మాత్యులు వివేక్ వెంకట స్వామి పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల పాలనలో కనీస అవసరాలు తీర్చడంలో కూడా విఫలమైందని హామీలు ఇవ్వడమే తప్ప ఆచరణలో అమలు చేయాలని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలలో ఇచ్చిన ప్రతి ఒక్క అంశాన్ని దశల వారీగా అమలుచేస్తూ ప్రజా సంక్షేమం కోసమే నిరంతరం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 17లక్షల రేషన్ కార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 12వేల కోట్ల ఖర్చుతో చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గానికి పెద్ద మొత్తంలో నిధులు తీసుకువచ్చి త్రాగునీటి సమస్య పరిష్కరిస్తానని పేర్కొన్నారు .100 కోట్ల రూపాయలతో అమృత్ పథకం కింద త్రాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. మందమర్రిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల కాలంలో సింగరేణిలో ఒక బొగ్గు గని తీసుకురాలేదని ఆరోపించారు.

# హాస్యనటులు మానసికోల్లాసాన్ని అందిస్తారు

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త





హైదరాబాద్ (జనంసాక్షి) : హాస్య నటులు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తారని, వారి సేవలు సమాజానికి ఎంతో అవసరమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదు కొరకు నాట్య నీరాజనం ప్రముఖ హాస్య నటుడు పద్మశ్రీ రేలంగి, పద్మనాభం జయంతి పురస్కరిం చుకుని తెలంగాణ సారస్వత పరిషత్తు బొగ్గులకుంటలో జరిగిన కళా నిలయం కళా సంస్కృతిక సేవా సంస్థ హాత్సోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 1990లో ఆక్టింగ్ చేసిన వాళ్ళకి అలాగే డాన్స్ స్టూడెంట్స్ అలాగే టీచర్స్‌కు అవార్డ్ ప్రదానం చేశారు. రేలంగి ఎక్స్లెన్స్ అవార్డ్‌ను సందీప్‌కు, పద్మనాభం ఎక్స్లెన్స్ అవార్డ్‌ను సాయి రామ్‌కు ఉప్పల శ్రీనివాస్ గుప్త అందజేశారు.

# అర్బన్ లివింగ్‌పై నగరవాసుల ఆసక్తి

**త్రిదస రియాల్టీ వెంచర్స్ చైర్మన్ వంశీ**





హైదరాబాద్ (జనంసాక్షి) : నగరంలో నివసిస్తున్న వారు తమ నివాసల పట్ల ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారని అర్బన్ లివింగ్‌పై ఆసక్తి కనబరుస్తున్నారని త్రిదస రియాల్టీ వెంచర్స్ చైర్మన్ వంశీ తెలిపారు. నల్లగండ్ల సమీపంలోని లక్ష్మీ విహార్ కాలనీలో రూపుదిద్దుకుంటున్న త్రిదస రైజ్ నివాస ప్రాజెక్ట్ బ్రోచర్‌ను ఆయన ఆదివారం బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో చాలా మంది సిటీ సెంటర్‌గా లేకపోయినా కూడా నగర శివారులో అయినా కూడా కనెక్టివిటీ, హాస్పిటల్స్, కాలేజీలు, మాల్స్‌కు దగ్గరగా నివాసాలు ఉండాలని కోరుకుంటున్నారని వారి అభిరుచికి తగ్గట్లుగా నే ప్రస్తుతం తమ నిర్మాణ శైలి, అక్కడి వసతులు ఉంటాయని ఆయన తెలిపారు. 17 అంతస్తుల్లో ఉండే ఈ ప్రాజెక్ట్ 7 టవర్లు, 952 అపార్ట్‌మెంట్లతో నిర్మితమవుతున్నదని 2028 డిసెంబర్ వరకు వినియోగదారులకు వీటిని అందిస్తామని వెల్లడించారు. ప్రశాంతమైన వాతావరణంతో పాటు కాలుష్యరహితమైన ప్రాంతాలపట్ల నగరవాసులు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో త్రిదస ఎండి శివాజీ తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదం ఇద్దరు యువకులు మృతి

గణపురం, ఆగస్టు10( జనం సాక్షి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన గణపురం మండలంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. భూపాల్ పల్లి కాల్ మార్క్ కాలనీకి చెందిన దాసరి జగదీష్( 21) మరో యువకుడు జగదీష్( 22) గణపురం నుంచి భూపాల్‌పల్లికి వెళ్తుండగా మండలంలోని కోటకాల్వ వద్ద బైకు అదుపుతప్పి పడిపోయారు. బైక్ పై మితి మీరినా వేగంతో వెళ్లడం వలన ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగ మరో వ్యక్తి హాస్పిటల్ తరలిస్తుండగా మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# పంచకట్టు ఫంక్షన్‌లో వినూత్న ఆలోచన


- రిటర్న్ గిఫ్టుగా మొక్కల పంపిణీ
- హర్షం వ్యక్తం చేసిన పర్యావరణ ప్రేమికులు



లక్షెట్టిపేట, ఆగస్టు 10 (జనంసాక్షి) : లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఆర్యవైశ్య భవన్ లో ఆదివారం జరిగిన పంచ కట్టు ఫంక్షన్ లో పర్యావరణ పరిరక్షణ కోసం నిర్వాహకులు రిటర్న్ గిఫ్ట్ గా మొక్కలు పంపిణీ చేయడంతో ఫంక్షన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతేకాకుండా పర్యావరణ ప్రేమికులు హర్షం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే ఆదివారం స్థానిక వైశ్య భవన్ లో పట్టణానికి చెందిన వ్యాపారి చిటికేసి జయప్రకాష్, స్నేహాల దంపతుల కుమారులు గణనాథ్ ,మణినాథ్, ల పంచకట్టు ఫంక్షన్ చేశారు. మామూలుగా అందరూ రిటన్ గిఫ్టులుగా వివిధ రకాల వస్తువులను అందజేస్తారు. మామూలుగా ప్రకృతి ప్రేమికులైన వీరు వీరి ఇద్దరు పిల్లలు కవలలు కావడంతో ఫంక్షన్ కు వచ్చిన మహిళలకు ఒక్కొక్కరికి రెండేసి మొక్కలను అందజేశారు. పర్యావరణ పరిరక్షణ కోసమే ఈ మొక్కలను అందజేసినట్లు వారు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని దీని వలన పర్యావరణ సమతుల్యం ఏర్పడుతుందని అన్నారు.

# కాటారంలో బెట్టింగుల జోరు

- కుటుంబాలు విచ్చిన్నం



కాటారం, ఆగస్టు 10 (జనంసాక్షి) : కాటారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న చిరు ఉద్యోగులు బెట్టింగ్ యాప్ లకు అలవాటు పడి కుటుంబాలు విచ్చినవుతున్నాయి. అసలు బెట్టింగ్ యాప్ ఎందుకు వచ్చాయో, తెలియదు కానీ ఈ ప్రజలు ఈ కుటుంబాలు దీని పరిస్థితిలో అల్లాడుతున్నాయి. కుటుంబం తండ్రి తల్లి కొడుకు ఉద్యోగం వచ్చిందని ఆనందపడే రోజులని అనిత లోనే ఒక ఘోరమైన సమస్య విని కుటుంబాలు విచ్చిన్నం అవుతున్నాయి. విద్యార్థులు చదువుకొని ఉన్నత స్థాయికి వచ్చి ఉద్యోగ వచ్చిందని స్థాయిలో ప్రైవేటు బ్యాంకు వివిధ సెక్టర్లో స్థిర పడ్డ తర్వాత అనవసరమైన బెట్టింగ్ లో పోయి ఆర్థికంగా నష్టపోతున్నారు. కుటుంబాలు ఏమి తోచలేక ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయి. ప్రైవేట్ సెక్టర్లో ఉద్యోగం వచ్చిందని ఆనందపడ్డ రోజులు అనిత కాలంలోనే ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ బెట్టింగ్ యాప్ కు పరిష్కారం దొరికే వరకు ఎందరో అనమాకులు బలవుతున్నారు. వారి వలన కుటుంబాలు చిన్నబిన్న అవుతున్నాయి. వచ్చిన ఉద్యోగాన్ని పూర్తిగా పనిచేయక తెలిసి తెలియక ఉద్యోగాన్ని బెట్టింగ్ యాప్లకు ఉపయోగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు లోపం తెలిసి తెలియని విధానమ ఎమో కానీ ఈ ప్రాంతంలో చాలామంది కుటుంబాలు ఇబ్బందులు గురవుతున్నాయి . ప్రభుత్వం వెంటనే స్పందించి ఒక అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత కుటుంబాల ఇబ్బందులకు గురిచేస్తున్న ఈ బెట్టింగ్ యాప్ త్వరలోనే ముగించాలని కోరుకుంటున్నారు.

# కవితతో హెచ్‌ఎంఎస్ నాయకుల భేటీ



శ్రీరాంపూర్ (జనంసాక్షి) : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నివాసంలో హెచ్‌ఎంఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ యూనియన్ నాయకులతో కలిసి సమావేశం కావడం జరిగిందని యూనియన్ అధ్యక్షుడు తిప్పరపు సారయ్య తెలిపారు. సింగరేణి పరిరక్షణ,కార్మిక హక్కులు,ఇన్కమ్ టాక్స్, మెడికల్ బోర్డు పాత పద్ధతిలో కొనసాగించుట, కాంట్రాక్టు కార్మికులకు,భూ నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాల కల్పించుట కొరకు పలు కార్మిక సమస్యలపై కలిసి పోరాడడానికి సమావేశంలో నిర్ణయించారని, జాగృతి కార్యకర్తలంతా హెచ్‌ఎంఎస్ యూనియన్ లో చేరి పనిచేయడానికి అంగీకరించడం జరిగిందని తెలిపారు. హెచ్‌ఎంఎస్ యూనియనుని, జాగృతి సంస్థను బలోపేతం చేసి భవిష్యత్తులో పోరాటాలు చేయడానికి నిర్ణయించడం జరిగిందని,ఈ మేరకు ఒక స్టీరింగ్ కమిటీని నియమించడం జరిగిందని, స్టీరింగ్ కమిటీలో హెచ్‌ఎంఎస్ సింగరేణి విభాగం అధ్యక్షులు తిప్పారపు సారయ్య, పత్యం రాజబాబు,శాంతి స్వరూప్ హెచ్‌ఎంఎస్ యూనియన్ నుండి నియమించబడగా జాగృతి సంస్థ నుండి వెంకటేష్,నవీన్ నేత,రత్నాకర్ రెడ్డి లతో స్టీరింగ్ కమిటీ నియమించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో హెచ్‌ఎంఎస్ నాయకులు అనిల్ రెడ్డి, పొనగంటి అశోకు,ఏరియా కమిటీల ముఖ్య నాయకులు, జైపూర్ పవర్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు విక్రమ్, ప్రదీప్ రెడ్డి జాగృతి కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ట్రాన్స్‌జెండర్లకు ఉచిత విద్య

- అందరికీ సమాన అవకాశాల కల్పన ప్రణాళిక అమలు
- వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి వెల్లడి



హైదరాబాద్, ఆగస్టు 10 (జనంసాక్షి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో సమాన అవకాశాల కల్పన ప్రణాళికలో భాగంగా తెలంగాణలోని ట్రాన్స్‌జెండర్లందరికీ ఉచితంగా డిగ్రీ కోర్సులను అందించనున్నట్లు వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి వెల్లడించారు. సమ్మిళిత విద్యలో ఇది ఒక అద్భుతమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు. ట్రాన్సజెండర్లకు ఇలాంటి అవకాశం కల్పించిన మొదటి విశ్వవిద్యాలయంగా నిలవనుందని పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఈ వినూత్న పథకం కింద, 10o2 (ఇంటర్మీడియట్ లేదా తత్సమాన) విద్యార్హత కలిగిన ఏ ట్రాన్స్‌జెండర్ అయినా వర్సిటీ అందించే డిగ్రీ కోర్సుల్లో దేనిలోనైనా చేరవచ్చున్నారు. నామమాత్రపు రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 500 లు మాత్రమే చెల్లిస్తే సరిపోతుందన్నారు. కాగా అన్ని ట్యూషన్ ఫీజులను మినహాయించాలని విశ్వవిద్యాలయం నిర్ణయించిందని వెల్లడించారు. ట్యూషన్ ఫీజు మినహాయింపుతో పాటు, ట్రాన్స్‌జెండర్ విద్యార్థులకు ఉచితంగా కోర్సు మెటీరియల్ అందించనున్నామని, అలాగే తరగతులకు హాజరు అయినా ఇతర మాధ్యమాల ద్వారా అభ్యసనం కొనసాగించినా ఎలాంటి ఫీజు వసూలు చేయమని వివరించారు. తద్వారా వారికి చదువుకోవడానికి అన్ని సాధనాలు ఉచితంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా ఏ అధ్యయన కేంద్రం లో అయినా అడ్మిషన్ పొందొచ్చని, తరగతులకు కూడా అక్కడే హాజరు కావొచ్చని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశం కల్పించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని, ఇప్పటికే ఈ విశ్వవిద్యాలయం జైలు శిక్ష పడ్డ ఖైదీలకు మరియు దేశ సేవలో నిరంతరం నిమగ్నమయ్యే సైనిక సిబ్బందికి ఉచిత విద్యను అందిస్తూ సామాజిక భాధ్యతను నెరవేరుస్తున్న విషయాన్ని ప్రొ. చక్రపాణి గుర్తు చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని గోండు, కోయ, చెంచు తదితర వెనకబడిన తెగలకు చెందిన అడవిబిడ్డలకు ఉన్నత విద్యను ఉచితంగా అందించే కార్యక్రమాన్ని ఇప్పటికే ప్రకటించినట్లు వెల్లడించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
11 ఆగస్టు 2025

## బహుముఖ ప్రజ్ఞాశాలి పి.జె. సుధాకర్

ప్రముఖ విద్యావేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, విద్యారంగంలో అత్యధిక డిగ్రీలు సాధించి సరికొత్త చరిత్రని సృష్టించిన పట్నాల జాన్ ( పి.జె ) సుధాకర్ ఈ నెల 6 నాడు అనారోగ్యంతో 68 ఏళ్ల వయసులో మరణించ డం కడు విషాదకరం. ఆయన సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సి.బి.ఐ), ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పి.ఐ.బి), ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్, పబ్లికేషన్స్ డివిజన్ మరియు రక్షణ మంత్రిత్వ శాఖ వంటి అనేక సంస్థలలో నిరుపమాన సేవలు అందించారు. ఆయన అనేక భారతీయ విశ్వవిద్యాలయాలలో విజిటింగ్ ప్రొఫెసర్గా పనిచేశారు. ఆయన చదువుపై ఉన్న మక్కువతో 120 డిగ్రీలను సాధించి సరికొత్త చరిత్రని సృష్టించడం అనన్య సామాన్యం.

పి.జె. సుధాకర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలంలో గల పెదగాడి గ్రామంలోని నిరుపేద దళిత వ్యవసాయ కూలీలైన మోషేసు, కాంతమ్మ అనే దంపతులకు 1957 డిసెంబర్ 1 నాడు జన్మించారు. నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన ఆయన అనునిత్యం అనేక కష్టాలని అధిగమించారు. పి.జె. సుధాకర్ ఉన్నత పాఠశాల తర్వాత తీవ్ర పేదరికం కారణంగా తన చదువుకి మధ్యలోనే మంగళం పలికారు. ఆ క్రమంలోనే ఆయన తన బతుకు సమరాన్ని సాగించే నిమిత్తం విశాఖ పట్నం జిల్లాలోని రేడగడి అనే మారుమూల గ్రామంలో గల ఒక హొటల్లో వెయిటర్ గాను, పొలాల్లో పశువుల కాపరి గాను మరియు వ్యవసాయ కూలీ గాను పని చేశారు. 20 సంవత్సరాల వయస్సులో ఆయన సిబిఐ (సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్) లో జూనియర్ అసిస్టెంట్గా చేరాడు. అప్పటి నుండి ఆయన కరస్పాండెన్స్ కోర్సులు, ఓపెన్ విశ్వవిద్యాలయాల ద్వారా సంవత్సరానికి పది డిగ్రీలు పొందాడు. 1980 లో ఆయన న్యాయశాస్త్రంలో మొదటి డిగ్రీని పొందాడు. మొదటగా సిబిఐలో చిరు ఉద్యోగంలో చేరిన డాక్టర్ పి.జె. సుధాకర్ 1987 లో దేశంలోనే ప్రతిష్టాత్మకమైన సివిల్ సర్వీసెస్కు ఎంపికై ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐ.ఐ.ఎస్) కోసం ఎంపికయ్యారు.

డాక్టర్ పి.జె. సుధాకర్ 2009లో రాజా రామ్ మోహన్ రాయ్ మిషన్ నేషనల్ అవార్డును అందుకున్నాడు. ఆయన 2010 లో హైదరాబాద్లోని చైతన్య ఆర్ట్ థియేటర్స్ నుండి లైఫ్ టర్మ్ అచీవ్మెంట్ అవార్డును స్వీకరించారు. రావూరి భరద్వాజ గారికి జ్ఞానపీఠ్ పురస్కారం రావడానికి డాక్టర్ పి.జె. సుధాకర్ అనేక విధాలుగా కృషి చేసి విజయం సాధించారు. భారత రాష్ట్రపతి పదవికి పోటీ చేసే నిమిత్తం ఆయన 2012 జూలై 29 నాడు నామినేషన్ పత్రాలను సమర్పించి అత్యధిక విద్యార్థతా పత్రాలు ఉన్న వ్యక్తిగా ఆయన కొనియాడబడ్డారు.

డాక్టర్ పి.జె. సుధాకర్ ఒకపక్క ఉన్నతస్థాయిలో ఉద్యోగాలు సాధించి సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తూనే మరోపక్క సమాంతరంగా 120 డిగ్రీలను సాధించడం తద్వారా విద్యావ్యవస్థలో నవచరిత్రని సృష్టించారు అని సగర్వంగా చెప్పవచ్చు. ప్రజా సంబంధాలు, సామాజిక సేవ, నేర శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, చట్టం, రాజకీయ శాస్త్రం, చరిత్ర, అంతర్జాతీయ సంబంధాలు, మానవ హక్కుల చట్టం మరియు వైద్య చట్టాలు వంటి అంశాలతో పాటు అనేక ఇతర రంగాలలో 120 డిగ్రీలను సాధించి ప్రపంచంలోనే సరికొత్త చరిత్రని సృష్టించారు. ఒక్క ఇంజనీరింగ్ మినహా దాదాపు మిగిలిన అన్ని విద్యా రంగాలలోను ఆయన డిగ్రీలు సాధించడం గమనార్హం. ఆయన 2014 ఆగస్టు 31 నాడు బెంగళూరులోని నేషనల్ స్కూల్ ఆఫ్ లా నుండి 104 వ డిగ్రీ స్నాతకోత్సవ వేళ సాక్ష్యాత్తు నాటి భారత ప్రధాన న్యాయమూర్తి నుండి పొందడం ఆయన జీవితంలో మరచిపోలేని ఘట్టంగా చెప్పవచ్చు. అనేకంగా రికార్డులు సాధించిన ఆయన అవివాహితుడుగానే ఉండిపోయారు.

గొప్ప సామాజిక సంస్కర్తలు అయిన రాజా రామ్మోహన్ రాయ్, మదర్ థెరిసాలచే ప్రేరణ పొందిన డాక్టర్ పి.జె. సుధాకర్ సామాజిక దురాచారాల నిర్మూలన కోసం కృషిచేశారు. పిల్లలు, మహిళలు, సమాజం లోని బలహీన వర్గాలైన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు మరియు మైనారిటీల సంక్షేమం కోసం ఆయన నిరవధికంగా కృషిచేశారు. గ్రామీణ అక్షరాస్యత కోసం తీవ్రంగా కృషి చేశారు. యువత భవిత కోసం ప్రేరణాత్మక ఉపన్యాసాలు ఇచ్చారు. ఆ రకంగా ఆయన సమాజంలోని వివిధ వర్గాల నుండి లక్షలాది మంది యువతను సామాజిక మార్పు కోసం కృషి చేశారు.వంద మంది మనస్తత్వవేత్తల బృందంగా కార్యకలాపాలు నిర్వహించే జాతీయ మానసిక ఆరోగ్య ఉద్యమ వ్యవస్థాపక అధ్యక్షుడు గాను డాక్టర్ పి.జె. సుధాకర్ కృషిచేసి సమాజంలో నైతిక విలువలు మరియు నైతిక ప్రమాణాలను ప్రోత్సహించారు. ఆయా సామాజిక సమస్యలపై వర్క్షాప్లను ఆయన నిర్వహించారు. మానవ హక్కులను పరిరక్షిస్తూనే గొంతులేని వారి గొంతుకగా తన చివరి క్షణం వరకు ఆయన కృషి చేశారు. బాల కార్మికుడి నుండి ఒదిగి ఎదిగి ఉన్నత ఉద్యోగాలతో పాటు అత్యధిక డిగ్రీలను సాధించి గిన్నిస్ రికార్డుని సాధించి అనేక రంగాలలో తనదైన ముద్ర వేసి బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు గడించిన డాక్టర్ పి.జె. సుధాకర్ జీవితం భావితరాలకు తప్పకుండా ఆదర్శం కాగలదు అని ఘంటాపథంగా చెప్పవచ్చు.



జె.జె.సి.పి.బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

# అంగన్ వాడీల బలోపేతానికి కొత్త పథకం




తెలంగాణ రాష్ట్రంలోని అంగన్ వాడీ కేంద్రాలు పేద,మధ్య తరగతి ప్రజలకు అక్షరం,పౌష్టికాహారం అందించే వనరులకు నిలయా (మూలా)లు.వీటిని నిర్లక్ష్యం చేయరాదు.గర్భిణులు,బాలింతలు, ఐదేళ్ల లోపు చిన్నారులకు ఉచితంగా అక్షరాలు, పోషకాలతో ఆరోగ్య మహాభాగ్యాన్ని పొందవచ్చు. ఈ కేంద్రాల్లోని లోటు పాట్లను సవరించి మరింత బలోపేతం చేయాలని మన ప్రభుత్వం దృష్టి సారించింది. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం కోసం ఖాళీగా ఉన్న అంగన్ వాడీ టీచర్లు, హెల్పర్ల పోస్టులు వెంటనే భర్తీ చేయాలని భావిస్తోంది. దాదాపు 20 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో టీచర్లు,హెల్పర్లు లేకపోవడంతో కొన్నిచోట్ల రోజువారి నిర్వహణ, పూర్వ ప్రాథమిక విద్యా బోధన, పోషకాహారం అందించడం కష్టంగా మారుతుంది. మౌలిక వసతులు భవనాలు, నీటిసౌకర్యం, మరుగు దొడ్లు, సిబ్బంది లేకపోవడంతో ఏజెన్సీలల్లో, ఇతర ప్రాంతాల్లో ఉన్న కొన్ని అంగన్వాడీ కేంద్రాలు నెలలోచాలా రోజులు తీయలేని పరిస్థితులు ఉన్నాయి. 65ఏళ్లు నిండిన వారిని ఉద్యోగ విరమణ చేయిస్తున్న ప్రభుత్వం నియామకాలు జరగకపోవడంతో ఖాళీలు పెరిగిపోతు న్నాయి. ఇలా అంగన్వాడీ కేంద్రాల్లో 14,236 పోస్టుల ఖాళీలను భర్తీ చేసేందుకు శిశు సంక్షేమ శాఖ ఆమోదించినా.. నోటిఫికేషన్ల జారీకి సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా ఆ సమస్యలను అధిగమించి పోస్టుల భర్తీకి చర్యలు తీసు కోవాలని నిర్ణయించారు. ఇప్పటివరకు గుర్తించిన ఖాళీలల్లో 6,399 టీచర్ పోస్టులు, 7,834 హెల్పర్ పోస్టు ఉన్నా యి. మన రాష్ట్రంలో 35,700 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కొక్క కేంద్రంలో టీచర్తో పాటు హెల్పర్ తప్పనిసరి ఉండాలి. గతంలో ఈ పోస్టులకు ఎంపికైన వారు పలువురు రాజీనామా చేయడం, ఇప్పటికే పని చేస్తున్నవారిలో కొందరు సూపర్వైజర్లుగా పదోన్నతులు రావడంతో, 65 ఏళ్లు నిండిన టీచర్లు,సహాయకులు ఉద్యోగ విరమణ చేశారు.ఇందువల్ల సిబ్బంది కొరత నెలకొంది.

ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలోపు పిల్లల సంరక్షణ కోసం అంగన్వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. వీటిలో లబ్ధిదారులకు పోషకాహారం అందివ్వడంతో పాటు ఐదేళ్లలోపు చిన్నారులకు అక్షరాలు నేర్పు చున్నారు.వీటిపై భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ లబ్ధిదారుల చేరికలు తక్కవ ఉండటంతో పాట వారి హాజరులో వ్యత్యాలు ఉన్నాయి.ఈ కేంద్రాలకు ట్యాబులు అందిస్తూ ఆన్ లైన్ అనుసంధానం చేయడం, నియామకాలు,మౌలిక వసతులు ఏర్పరిచి అందరికీ అంగన్వాడీ సేవలతో లబ్ధిదారుల హాజరు పెంచాలని ప్రభుత్వం బాస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సమస్యలు1, ఆవాసాలకు అంగన్వాడీల దూరంగా ఉండటం. 2,చేరికలు తక్కువగా ఉన్న కేంద్రాలు. 3,గ్రామాల్లో, నగరాల వేరువేరు సమస్యలను పరిశీలించి వసతులకు నిధులు పెంచుతూ భవన నిర్మాణాలు, నియమకాలు, నీటి సౌకర్యం, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించే విధంగా ప్రణాళికలతో ముందుకు వెళ్లుతోంది.పట్టణాల్లో, గ్రామాల్లో పిల్లలు అంగన్వాడీ కేంద్రాలకు వచ్చేలా ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంది. అందులో భాగంగా ఈ పంద్రాగస్టు నాటికి మరో కొత్త పథకం రాబోతోంది.. పౌష్టికాహార లోపంతో బాధ పడుతున్న చిన్నారుల కోసం రూ.100 కోట్లు వెచ్చించాలని ఈ ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తుంది. ఈ స్కీమును మహిళ శిశు సంక్షేమ శాఖ ప్రతిపాదన సిద్ధం చేసింది. గతంలో 2021లో నిర్వహించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్హెచ్ఎఫ్ఎస్-5) ప్రాతిపదికన ఈ పథకాన్ని రూపొందించినట్లు అధికారులు తెలిపారు. కరోనా సమయంలో రాష్ట్రంలో చిన్నారులు అత్యధిక మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారని, ఈ సర్వే తేల్చి చెప్పింది. పర్యవేక్షణ పెంచి,అంగన్వాడీలకు పిల్లల్ని రాబట్టే కార్యక్రమం చేస్తున్నప్పటికీ.. పూర్తిస్థాయిలో ఆ సమస్యకు పరిష్కారం దొరకడం లేదు. ఈ నేపథ్యంలో ఎన్ హెచ్ ఎఫ్ లోని డేటా ఆధారంగా కొత్త పథకానికి రూపకల్పన చేశారు. ముఖ్యంగా రాష్ట్రలో కొంతమంది పిల్లలు (ఐదేళ్ల లోపు) ఎదుగుదల ఆగి పోవడం, వయసుకు తగ్గ బరువు ఎత్తు లేకపోవడం, ఎనీమియా (రక్తహీనత)తో బాధపడటం తదితర లక్షణాలు, రుగ్మతులను గుర్తించారు. ఈ నేపథ్యంలో లి"ప్రస్తుతం అంగన్వాడీల్లో అందించే ఆహార పదార్థాలకు తోడు మరిన్ని పోషక విలువలు ఉండే పౌష్టికాహారాన్నిలి" అందించనున్నారు.. ఇప్పటిదాకా అంగన్వాడీల్లో మధ్యాహ్న భోజనం మాత్రమే అందించే వెసులుబాటు ఉంది. ఇప్పుడు ఉదయం పూట బలవర్ధకమైన టిఫిన్ కూడా అందించాలని నిర్ణయించారు. బొంబాయి రవ్వతో చేసిన ఉప్మా ఎగ్ బిర్యానీ తదితర వంటకాలను కొత్త మెనూలో చేర్చనున్నారు. ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలకు నెలకు 16 గుడ్లు. మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలకు నెలకు 30గుడ్లు.కౌమార దశలోనే అమ్మాయిలకు తృణ ధాన్యాలు, పల్లీలతో చేసిన చిక్కీలను రోజుకు ఒకటి చొప్పున నెలకు 30 చిక్కీలను అందించనున్నారు. మూడేళ్లలోపు చిన్నారులు అంగన్వాడీలకు వచ్చే పరిస్థితి ఉండదు కాబట్టి, వారికి నేరుగా ఆయా ఆహార పదార్థాలను ఇంటికి పంపణి చేయనున్నారు.ఈ పథకానికి పోషణ,పౌష్టిక,,పుష్టి తెలంగాణ పేర్లు పరిశీలిస్తున్నారు.

అలాగే దేశంలో సమీకృత మాతా శిశు అభివృద్ధి (ఐసీడీఎస్) పథకాలను మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రారంభించారని, ఆమె జయంతి రోజైనా నవంబర్ 19 నాటికి రాష్ట్రంలో 1000 అంగ న్వాడీలను కొత్తగా నిర్మించి ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 35,781 అంగన్వాడి సెంటర్ ఉండగా, వీటిలో 11,845 సొంత భవనాల్లోనూ, 12,298 అద్దె బిల్డింగ్ లోనూ, మరో 11,638 ఎలాంటి అద్దె లేని భవనాల్లోనూ కొనసాగుతున్నాయి.జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే( ఎన్ హెచ్ ఎఫ్ -5) సర్వే ప్రకారం రాష్ట్రంలో పౌష్టికాహార లోపంతో బాధ పడుతున్న పిల్లల పరిస్థితి..1, ఎదుగుదల సరిగా లేని పిల్లలు (ఐదేళ్లలో లోపు)- 33.1 శాతం. 2,బలహీనంగా ఉన్న పిల్లలు (ఐదేళ్లలోపు)- 21.7 శాతం.3, వయసుకు తగ్గ ఎత్తు లేకపోవడం (ఐదేళ్లలోపు)- 31.8శాతం.4, ఎనీ మియాతో బాధపడుతున్న వారు (ఆరు నెలల నుంచి 59 నెలల వరక- 70శాతం.5, ఎనిమీతో బాధపడుతున్న మహిళలు (15 నుంచి 49 ఏళ్ళు)- 57.6శాతం.6, ఎనీమియాతో బాధపడుతున్న కౌమార దశలోని బాలికలు(15 నుంచి 49 ఏళ్ళు)- 64.7శాతం. 7.శిశువు పుట్టగానే ముర్రుపాలు పట్టగలుగుతున్న బాలింతలు37.1 శాతం.8, అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఆరు నెలల పిల్లల వరకు పాలు ఇవ్వగలుగుతున్న తల్లులు 68.2శాతం.ఇలా..పై సర్వే ఆధారంగా ఉన్న పరిస్థితులను అధిగమించి అంగన్ వాడీ సెంటర్లను బలోపేతం చేసినప్పుడే.. చిన్నారులతో పాటు, అక్కడికి గర్భిణులు, బాలింతలు, పోషకాహార లబ్ధిదారులందరు వస్తారు.

అలా పిల్లల హాజరు శాతం పెరిగి రేపటి తరం ఆరోగ్య వంతులైన సమాజం ఏర్పడుతోంది. ఆరోగ్యకరమైన పిల్లలతోనే ఆరోగ్యవంతమైన రాష్ట్రం,దేశం ఆవిర్భవిస్తుంది. శారీరక, మానసిక ఆరోగ్య అభివృద్ధే లక్ష్యంగా పాలకులు, పాలితులు, టీచర్లు, హెల్పర్లు వారి బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించాలి.అంగన్ వాడీ కేంద్రాలల్లో లబ్ధిదారులైన పేద, మధ్యతరగతి వారికి ఉచితంగా అక్షరం,ఆరోగ్యం అందించే లక్ష్యం నెరవేర్చి వారి జీవితాల్లో వెలుగులు నింపాలి..



మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు
వరంగల్ 9573666650

## ఫిలాసఫీ అనేది ఒక మహానదియా?
# అతుకుల బొంతనా?



చినుకు చినుకు కలిసి పిల్ల కాలువలవుతాయి. పిల్ల కాలువలు కలిసి వాగులై ప్రవహిస్తాయి. చిన్న చిన్న వాగులు కలిసి పెద్ద వాగులవుతాయి. వాగులు కాలువలు కలిసి నదులలుతాయి. తోవలో పెద్ద నది వస్తే అందులో కలిసి ఉపనదిగా పేరు మారుతుంది. నదులు అలా ఇలా అనినిటిని కలుపుకొని ప్రవహించి మహా నదిగా మారి సముద్రంలో కలుస్తుంది. నదిలోని నీళ్లు ఆ నదివి కావు. ఎక్కడెక్కడో కొండల్లో అడవుల్లో పడిన చినుకులు కాలువలై వాగులై ప్రహించే నీరే నది!

అలాగే రాజుల ధనాగారం, తత్వ వేత్తల భావాలు, ఆయుర్వేద వైద్యం ఎక్కడెక్కడో ఏ కొండ కోణల్లోంచో కలుపుకొని సంపన్నమైనవే. లక్షల కోట్ల ప్రభుత్వంలో ప్రయివేటురంగంలో రాశి పడుతున్న సంపదంతా ప్రజలనుండి సేకరించినదే. తత్వవేత్తలు కూడా అంతే. వారొక బ్యాంకు వంటి వారు. అందులోని డబ్బంతా వారిది కాదు. మానవ సమాజం కూడ బెట్టిన సంపద అది.

ఆదిమ కాలంలో మన పూర్వీకులకు కొన్ని భావాలు కలిగాయి. కొన్ని సమూహాలుగా ఏర్పడ్డారు. వారి సైజు, ప్రత్యేకతను బట్టి గణ, తెగ, తండా అని పిలిచారు. అనేక గణ తెగలు ,,కలిసి జనపదాలయ్యాయి. జన పదాలు కలిసి మహా జన పదాలయ్యాయి. జన పదాలు, మహాజనపదాల కాలంలో రాజ్యాలు ఏర్పడ్డాయి. ఆ దశలో బుద్ధుడు, జైన వర్ధమాన మహా వీరుడు పుట్టారు. హరప్పా, సింధు నాగరికత, జనవదాల కాలంలో ఆవిర్భవించింది. బుద్ధుని కాలం కాలం నాటికి 16 మహాజనపదాల రాజ్యాలు ఏర్పడి కొన సాగుతున్నాయి.

రాజులు రాజ్య విస్తరణ కోసమో? రాజ్య రక్షణ కోసమో దండెత్తి రారాజులు, చక్రవర్తులయ్యాకు. చిన్న రాజులు గెలిచిన రాజులకు సామంత రాజులు కావడం వల్ల రాజులకు రాజు కననక రారాజు, చక్రవర్తి ఇని పిలువ బడ్డారు. గణ తెగల నుండి పిల్ల కాలువలుగా వాగులుగా సాగిన భావాలు ఆలోచనలు, ఒక రూపం తీసుకున్నాయి. హరప్పా సింధు నాగరికత కాలం నాటి రాతలు అర్థం కావడం లేదు. అటు తరువాత వెయ్యేళ్లకు స్థిరపడిన ఆర్యులనే గణ తెగల భావాలు, ఆలోచనలు క్రమంగా వేదాలు అని పిలువ బడ్డాయి. చార్వాకులు, లోకాయతులు అపుడే ఆవిర్భవించారు.

మహాజనపదాలు, రాజ్యాల కాలంలో ఉపనిషత్తులు, బుద్ధుని బోధనలు, జైన ముని బోధనలు, అసిత కేశ, అన్విక్షకి తదితరులెందరో తమ తమ భావాలను ప్రచారం చేసారు. కాల క్రమంలో అనేక భావాల కలయికను వైదిక మతంగా పేర్కొన్నారు. మిగతా వారిని వారు అవైదికులు అన్నారు. మరి కొంత కాలానికి వారిని నాస్తికులు, ఆస్తికులు అని పిలిచారు. అనేక భావాలను ఇలా రెండు వర్గాలుగా పేర్కొన్నారు. అవి రెండు కావు. అనేక వాగులు, ఉప నదులు, నదులు కలిసి వున్నాయి. ఈ రెంటికి వెలుపల బౌద్ధం అజ్ఞేయ వాదంగా పిలువబడింది. దేవుడు, ఉన్నడో లేడో చరిచ అక్కర లేదు. అన్నారు. ఇలా మూడు శిబిరాలు కొనసాగుతూ వచ్చాయి. అవైదిక మతంగా ప్రారంభమైన శైవం, ఆయుర్వేదం, క్రమంగా వైదిక మతంగా కలుపుకోబడింది.

అనేక వనవాసీ వనమూలికల వైద్య అనుభవాల కలయికతో మహానదిలా ఆయుర్వేదం రూపొందింది. శరీర శాస్త్ర అనుభవాలనుండి యోగ ధ్యానం శాఖలు ఏర్పడ్డాయి. వీటిని నాస్తికులు, ఆస్తికులు , అజ్ఞేయ వాదులు మూడు పక్షాలూ స్వీకరించి కలుపుకున్నాయి. ఆధునిక పాశ్చాత్య భావనలు పిల్ల కాలవలు కలిసి వాగుల్లో కలిసి, వాగులు కలసి నదులై ఉపనదులై మహా నదులై వర్గీకరించ బడుతూ వస్తున్నాయి. మహానదుల్లో కలిసాక కాలువలు, వాగులుగా సాగిన ఆలోచనా ధారలు, గురితు పట్ట లేనంతగా ఉనికిని కోల్పోతాయి. నదుల పుట్టుక, వాగుల, కాలువల పుట్టుకలను మూలంలోకి వెళ్లి వెతికి పట్టుకుంటే ఏవి ఎలా రూపొందుతూ వచ్చాయో తెలుస్తుంది.

ప్రపంచంలో మార్క్స్, ఎంగెల్స్, మార్క్సిజం, వామ పక్ష సిద్ధాంతాలు అనేక ఆలోచనలను చర్చించి కలుపు కొంటూ, నిరాకరిస్తూ విమర్శనాత్మకంగా తీసుకుంటూ వచ్చారు. పలు శాస్త్రాలను, ఆనాడు అరిస్టాటిల్ మహా నదిలా విస్తరించాడు. అదే విధంగా ఆధునిక కాలాన పలు శాస్త్రాలను కలుపు కుంటూ మార్క్స్ ఎంగెల్సు మహా నదిగా, ఒక పెద్ద అంతర్జాతీయ బ్యాంకుగా, విస్తరించారు. వాటిలో ఎవరి డిపాజిట్ ఎంతుందో చూస్తే , ఆసక్తి కరంగా ఉంటుంది. ఎవరి డిపాజిట్ వారికిచ్చేస్తే బ్యాంకేమీ దివాలా తీయదు. ఆ కాలాన సాగిన భావాలు ఎవరు ఎలా ముందుకు తెచ్చారు? అవి ఎలా రిసోర్సుగా, డిపాజిట్ గా జమ పడ్డాయి. ఎలా అ మేరకు కలుపుకున్నారు? ఎలా మార్చి తమ స్వభావంలోకి ఎలా చెప్పుకొచ్చారు. మరింత అర్థమవుతాయి.


వాటి ఆధారంగా వీరు కొన్ని తమదైన కొన్ని సిద్ధాంతాలను, కార్య క్రమాలను ప్రతిపాదించారు. వాటి వెనక గల రిసోర్సుగా ఉన్నవారు నిజానికి చెప్పిందేమిటో తెలుసుకుంటే మనవైన ఆలోచనలు, కార్య క్రమాలు స్వయంగా నిర్ణయించుకోవచ్చు. అంతదాక వారిని అనుసరించడమో వ్యతిరేకించడమో అనే అనివార్యతకు లోనవుతారు. తనదైన నిర్ణయాలకు రావడానికి, వారు చదివిందంతా చదవడం అనివార్యమవుతుంది. మార్క్సుకు ముందుగా ఎందరో కృషి చేసారు. అందులో ప్రౌధాన్ ఒకరు. ప్రౌధాన్ గురించి ఈ వ్యాసం కొంచెం తెలుసుకుందాం.

ప్రౌధాన్ పూర్తి పేరు పియర్ దోసెఫ్ ప్రౌధాన్. ఫ్రెంచి తత్వవేత్త. 15 జనవరి 1809 లో జన్మించారు. 19 జనవరి 1865 లో మరణించారు. 57 ఏళ్ల జీవితంలో అనేక రంగాలను ప్రభావితం చేసారు. రాజకీయ ఆర్థిక వేత్త. రాజ్య రహిత సామ్య వాదం గురించిన రచనలకు ప్రసిద్ధి. " వాటీడ్ ప్రాపర్టీ ", ది ఫిలాసఫీ ఆఫ్ పావర్టీ" అనే గ్రంథాలు సుప్రసిద్ధం. కార్మిక వర్గం, పరస్పర సహకారం ఆవశ్యత గుర్తించి సమాఖ్య వాదం గురించి కృషి చేసాడు. ఆస్తి అంటే ఏమిటి ? అనే పుస్తకాన్ని 1840 లో రాసాడు. "ఫిలాసఫీ ఆఫ్ పావర్టీ"పుస్తకాన్ని 1846 లో రాసాడు. కార్మిక వర్గ దృక్పథంవైపు రావడానికి ప్రైధాన్ మార్క్సును ప్రభావితం చేసాడు. అలామార్క్సు ఎంగెల్సు 1848 లో కమ్యూనిస్టు మావిఫెస్టోకు ప్రౌధాన్ రచనలు సిద్ధాంతాలు పునాది వేసాయి. రూసో ప్రజాస్వామ్య యుతంగా సోషలిజాన్ని ప్రతిపాదించాడు.

బుద్ధుడు ఆలోచనలకు ప్రౌధాన్ ఆలోచనలకు దగ్గరి సంబంధం ఉంది. ప్రౌధాన్ ఆస్తిని దొంగతనం అనేనాడు. బుద్ధుడు ఇతరుల ఆస్తిని తీసుకోవడం దొంగతనమే అని చెప్పాడు. అష్టాంగ మార్గం , పంచశీల ద్వారా మనిషి తనకు తాను మలుచు కోవడం ద్వారా రాజ్య ప్రమేయం లేకుండా పరస్పర సహకారం పరోపకారంతో జీవించడాన్ని చెప్పాడు. ప్రౌధాన్ కూడా అలాగే భావించాడు. 1848 ఫిబ్రవరిలో ఫ్రెంచి విప్లవం జరిగింది. బ్లాంకిస్టులు దానికి నాయకత్వం హించారు. ఫ్రెంచి విప్లవంపై ప్రౌధాన్ ప్రభావం చాలా వుంది. ఆయన చెప్పిన సోషలిస్టు భావాలు, ఆర్థిక అసమానతలు తగ్గింపు మొదలైనవి ఫ్రెంచి సోషలిజంగా ప్రసిద్ధి చెందాయి. ఇండియాలో రామ్మనోహర్ లోహియా, జార్జి ఫెర్నాండేజ్ మధు దండాలతే, మధులిమీయే, రాజ్ నారాయణ్, రాం నరేశ్ యాదవ్, ములాయం సింగ్ లోక్ నాయక్ జయ ప్రకాశ్ నారాయణ్, లాలూ ప్రసాద్ యాదవ్, జనతా పార్టీ, జనతా దళ్ మొదలైన వారిలోని సోషలిస్టు, సామ్యవాద భావాలకు ఫ్రెంచి సోషలిజం, ప్రౌధాన్, రూసో భావనలు, సిద్ధాంతాలు రాజకీయ సమాజిక రంగాలలో మౌలిక భూమికగా పని చేసాయి. ఈ విషయం భారతీయ సామాజిక శాస్త్ర వేత్తలు సరిగా చెప్పడం లేదు. శాంతియుత విప్లవ పరిణామం అంతిమంగా పేదల, కార్మికుల శ్రేయస్సే . అది సహజంగా కుల వ్యవస్థలోని శూద్రులు అతి శూద్రుల శ్రేయస్సే గద!


ప్రౌధాన్ ధనికుల సంపదంతా పేదల నుంచి దొంగతనం చేసిన దొంగ సొత్తు అన్నాడు. మార్క్సు దాన్ని విశ్లేషించాడు. అట్లా శ్రమశక్తిని దోచే దొంగల రహస్యం విప్పి చెప్పాడు. ఆ దొంగలు మెల్ల మెల్లగ పెట్టుబడి దారులెట్లయిన్రో రాసాడు.. ఆ దొంగ సొత్తును పెట్టుబడి సంచయం అన్నాడు. పెట్టుబడి , శ్రమశక్తి, ఆ కష్టం నుంచి అదనపు విలువ పుట్టిందని, అది కూడేసుకుంటే దాన్ని పరాయీకరణ అన్నాడు.. అట్లా దొంగల దొంగసొత్తుకు సిద్ధాంతాల ప్రతిపత్తి సమకూర్చాడు. ఆఖరుకు ఆ దొంగ సొత్తు తోనే పెత్తనం చేసే పెట్టబడి దారుడు రాజ్యంగా మారాడు. దొంగ సొత్తును శ్రమశక్తి యొక్క అదనపు విలువ, పరాయీకరణ,

తరువాయి రేపటి సంచికలో...



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# భావ ప్రకటనా స్వేచ్ఛపై నిషేధం



## పుస్తకాలు అంటే అంత భయం ఎందుకో!?

జమ్మూ కాశ్మీర్లో ఇటీవల 25 పుస్తకాలపై లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా విధించిన నిషేధం భావ ప్రకటనా స్వేచ్ఛపై తీవ్రమైన దాడిగా పరిగణించబడుతోంది. ఈ నిర్ణయం కేవలం పుస్తకాలను నిషేధించడం మాత్రమే కాదు. ప్రజాస్వామ్య విలువలను, సమాజంలో బహుళత్వ ఆలోచనలను అణచివేసే ప్రయత్నంగా కనిపిస్తోంది. చరిత్ర, సామాజిక సమస్యలు, సాహిత్యంపై చర్చను నిరోధించే ఈ చర్య, భిన్నాభిప్రాయాలను సహించ లేని నిరంకుశ ధోరణిగా స్పష్టంగా కనిపిస్తుంది. ఈ వ్యాసం ఈ నిషేధం యొక్క పరిణామాలను, దాని వెనుక ఉన్న రాజకీయ ఉద్దేశాలను,వాటి ప్రభావాన్ని విశ్లేషణాత్మకంగా పరిశీలిస్తుంది.

**నిషేధం యొక్క నేపథ్యం:**

జమ్మూ కాశ్మీర్లో ఆగస్టు 5, 2025న మొత్తం 25 పుస్తకాలపై నిషేధం విధిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ జాబితాలో ప్రపంచ ప్రఖ్యాత రచయితల పేర్లు ఉన్నాయి. వారిలో ఎ.జి. నూరాని, అరుంధతి రాయ్, అనురాధా బాసిన్, సుమత్రా బోస్ వంటి ప్రముఖ రచయితల పుస్తకాలు ఉన్నాయి. ఈ రచనలు ఎక్కువగా జమ్మూ కాశ్మీర్ చరిత్ర, సమకా లీన రాజకీయ సమస్యలు, సామాజిక సంఘర్షణలపై కేంద్రీకృతమై ఉన్నాయి. ఈ నిషేధం వెనుక ఉన్న అధికారిక వాదన ఏమిటంటే, ఈ పుస్తకాలు "సమాజంలో అశాంతిని రేకెత్తిస్తాయి" లేదా "విద్వేషాన్ని ప్రోత్సహిస్తాయి." అయితే, ఈ వాదనలకు ప్రభుత్వం స్పష్టమైన ఆధారాలు చూపించలేదు. కేవలం ఈ నిషేధం రాజకీయ ఉద్దేశాలపై ఆధారపడినట్లుగా కనిపిస్తుంది .

**భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి:**

భావ ప్రకటనా స్వేచ్ఛ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(a) ద్వారా హామీ ఇవ్వబడిన ప్రాథమిక హక్కు. ఈ హక్కు ప్రజలకు తమ అభిప్రాయాలను వ్యక్తీకరించే, చర్చల్లో పాల్గొనే, సమాచారాన్ని పొందే స్వేచ్ఛను కల్పిస్తుంది. పుస్తక నిషేధం ఈ హక్కును సూటిగా ఉల్లంఘిస్తుంది. రచయితలు తమ రచనల ద్వారా చరిత్రను, సమాజాన్ని విశ్లేషించే ప్రయత్నం చేస్తారు. వారు అందుకు సంబంధించిన గణాంకాలు, సంఘటనలు, అలాగే తమ అభిప్రాయాలను సమర్థించే ఆధారాలతో వాస్తవాలను పాఠకుల ముందుంచుతారు. ఈ రచనలను నిషేధించడం అంటే, ప్రజలు తమకు తాముగా వివేచనతో నిర్ణయాలు తీసుకునే అవకాశాన్ని నిరాకరించడమే అవుతుంది.ఈ చర్య స్పష్టంగా రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించటమే అవుతుంది.

చరిత్ర లేదా సామాజిక సమస్యలపై భిన్నాభిప్రాయాలు ఉండటం సహజం. ఒక సమాజంలో అందరూ ఒకే విధమైన ఆలోచనలు కలిగి ఉండాలని ఆశించడం అసాధ్యం. అనవసరం కూడా... భిన్నాభిప్రాయాలు అనేవి సమాజాన్ని సమృద్ధం చేస్తాయి. చర్చల ద్వారా సత్యాన్ని ఆవిష్కరించే అవకాశాన్ని కల్పిస్తాయి. అయితే, నిషేధం ద్వారా ఈ చర్చను అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఒక పుస్తకం ప్రజలకు నచ్చితే అది సమాజంలో స్థానం సంపాదిస్తుందిబీ నచ్చకపోతే అది సహజంగానే మరుగున పడుతుంది. ఈ ప్రక్రియను ప్రజలే/ పాఠకులే నిర్ణయించుకోవాలి, పాలకులు కాదు.

**రాజకీయ ఉద్దేశాలు:**

ఈ నిషేధం వెనుక రాజకీయ ఉద్దేశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 2019లో జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర హోదాను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం, అప్పటి నుండి ఈ ప్రాంతంలో భిన్నాభిప్రాయాలను అణచివేయడానికి అనేక చర్యలు చేపట్టింది. మనోజ్ సిన్హా, బిజెపి నాయకుడిగా, కేంద్ర ప్రభుత్వ అజెండాకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ పుస్తకాల నిషేధం కూడా అదే ధోరణిలో భాగమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ రచనలు కాశ్మీర్ చరిత్రను, సంఘర్షణలను విమర్శనాత్మక దృక్కోణంతో చర్చిస్తాయి. ఈ సాహిత్యంలోని భావాలు,లేదా సమాచారం అధికారులకు అసౌకర్యంగా ఉండవచ్చు.అంత మాత్రం చేత కాశ్మీర్ ప్రజల ఆకాంక్షలను, వారి గొంతును అణచివేయడం ద్వారా, అధికారులు ఒకే రకమైన ఆలోచనా విధానాన్ని ప్రజలపై/పాఠకులపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని విమర్శకులు ఆరోపిస్తున్నారు.


**చారిత్రక సారూప్యతలు:**

తమ భావాలకు నచ్చని పుస్తకాలను ప్రభుత్వాలు నిషేధాలు విధించటం కొత్తవి కావు. బ్రిటీష్ కాలంలో భారత స్వాతంత్ర్యోద్యమ సాహిత్యం, రామకృష్ణ రావు లాంటి రచయితల రచనలు, "మాకొద్దీ తెల్లదొరతనం" వంటి గీతాలు నిషేధానికి గురయ్యాయి. అయితే, ఈ నిషేధాలు చివరికి విఫలమయ్యాయి. ఈ రచనలు ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించాయి. స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిల్చాయి. నిషేధం ద్వారా ఆలోచనలను అణచివేయడం అనేది సూర్యోదయాన్ని అరచేత్తో ఆపడానికి ప్రయత్నించినట్లే. చరిత్రను ఎప్పటికీ ఎవరూ అణచివేయ లేరు. ఎంత అణచి వేస్తే అది మరింత బలంగా ఉద్భృతంగా పెల్లుబుకుతుంది.

**సామాజిక పరిణామాలు:**

ఈ నిషేధం కేవలం జమ్మూ కాశ్మీర్కే పరిమితం కాదు. ఇది దేశ వ్యాప్తంగా భావ ప్రకటనా స్వేచ్ఛ, సాహిత్యం, అలాగే సాంస్కృతిక రంగాలపై ప్రభావాన్ని చూపుతుంది. ప్రస్తుతం దేశంలో చరిత్రను, సంస్కృతిని ఒకే దృక్కోణంతో చూడాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కవులు, రచయితలు, కళాకారులు స్వేచ్ఛా ప్రియులు. ఇలాంటి మేధావుల భావాలను, అభిప్రాయాలను అధికారం,విద్వేష భావజాలంతో నిషేధాలతో ఎంతో కాలం అణచివేయలేరు. కనుక పరిపాలకులు శాంతి,సహన భావాలతో, సమాజంలో బహుళత్వ ఆలోచనలను, భావాలను ప్రోత్సహించాలి. పుస్తకాలపై ప్రజాస్వామికంగా చర్చను స్వేచ్ఛగా జరగనివ్వాలి. అనవసరంగా ప్రభుత్వాలు పుస్తకాలను నిషేధింస్తే ప్రజల్లో ఆ పుస్తకం చదవాలనే ఆసక్తిని పెంచడం అవుతుంది. ఆ నిషేధ పుస్తకాలు ఆ తర్వాత కాలంలో మరింత పాపులర్ అవుతాయి. మార్కెటింగ్ ఎక్కువ జరుగుతుంది. కనుక ప్రభుత్వం ఆ పుస్తకాలను నిషేధించటం ద్వారా వాటి ప్రాధాన్యతను పరోక్షంగా పెంచినట్లే అవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాజంలో చర్చ, విమర్శ, మరియు సృజనాత్మకతను అణచివేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలహీనపర్చటమే అవుతుంది.

జమ్మూ కాశ్మీర్లో 25 పుస్తకాలపై విధించిన నిషేధం కేవలం ఒక అడ్మినిస్ట్రేటివ్ నిర్ణయం కాదు. ఇది భావ ప్రకటనా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలు, మరియు సామాజిక బహుళత్వంపై దాడిగా భావించాలి. ఈ చర్య రచయితలను, మేధావులను, సామాన్య పౌరులను ఆందోళనకు గురి చేస్తోంది. లెఫ్టినెంట్ గవర్నర్ ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి. పుస్తకాలు ఆలోచనల వాహకాలుబీ వాటిని నిషేధించడం అంటే సమాజాన్ని జ్ఞానం నుండి, సత్యం నుండి దూరం చేయడమే అవుతుంది. ప్రజాస్వామ్య సమాజంలో భిన్నాభిప్రాయాలు, చర్చలు, విమర్శలు సజీవంగా ఉండాలి. చరిత్రను దాచడం, వక్రీకరించటం ద్వారా దానిని మార్చ లేము. సత్యాన్ని ఎక్కువ కాలం మరుగు పర్చటం సాధ్యం కాదు.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# నేర్చుకున్న జ్ఞానాన్ని ఆచరణలో పెట్టాలి

- వృత్తిపరమైన సంబంధాలు ఏర్పరచుకోవాలి
- కృషి విజన్‌తో ఏ అవరోధమైనా అధిగమించవచ్చు
- టెలికమ్యూనికేషన్ కంపెనీ రీజినల్ లీడర్ టాలెంట్ అక్విజిషన్ పద్మజా శ్రీరామ్




**నర్సాపూర్, ఆగస్టు 10 (జనం సాక్షి) :** ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు ఎల్లప్పుడు నేర్చుకునే మనస్తత్వం కలిగి ఉండి ప్రపంచాన్ని అన్వేషించాలని తమకోసం కలలు కనాలని నేర్చుకున్న జ్ఞానాన్ని ఆచరణలో పెట్టాలని టెలి కమ్యూనికేషన్ రీజినల్ లీడర్ పద్మజా శ్రీరామ్ అన్నారు. ఆదివారం నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో 2025 సంవత్సరంలో ఇంజినీరింగ్ లో బీటెక్ ఎంబీఏ ఎంటెక్ కోర్సులు పూర్తి చేసి పట్టాల ప్రధాన కార్యక్రమం తో పాటు విద్యార్థులకు నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై ఈ సందర్భంగా పద్మజా శ్రీరామ్ మాట్లాడుతూ లింక్డెలన్ వంటి వేదికల ద్వారా వృత్తిపరమైన సంబంధాలు ఏర్పరచుకోవాలని శ్రీకాంత్ బొల్ల కథ ద్వారా కృషి మరియు విజయంతో ఏ అవరో దానైనా అధిగమించవచ్చని ఆమె విద్యార్థులకు గుర్తు చేశారు. విద్యార్థులు కష్టపడి పనిచేసే వారి ఆశయాలను సాధించాలని ఆమె అన్నారు. అనంతరం విష్ణు విద్యాసంస్థల సొసైటీ సెక్రటరీ ఆదిత్య విస్సం మాట్లాడుతూ విష్ణు విద్యా సంస్థల చైర్మన్ విష్ణు రాజు ఎల్లప్పుడు విద్యార్థులకు మరింత అత్యుత్తమ విద్యను అందించడంపై క్యాంపస్ ప్లేస్మెంట్లో అత్యుత్తమ అవకాశాలను సృష్టించడంపై చైర్మన్ విష్ణు రాజు ఎల్లప్పుడు ఆలోచిస్తూనే ఉంటారని ఆయన గుర్తు చేశారు విద్యార్థుల్లో విజయానికి మించి ప్రవర్తన ముఖ్యమని ఆయన విద్యార్థులకు సూచించారు విద్యార్థులకు కొత్త టెక్నాలజీలపై అవగాహన కలిగి నేర్చుకునే మనస్తత్వం కలిగి ఉండాలని ఆయన విద్యార్థులకు సలహా ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ సంజయ్ ధూబే మాట్లాడుతూ. జీవితంలో పెద్ద లక్ష్యాలు పెట్టుకోవాలని టెక్నాలజీ మార్పులకు తగ్గట్టుగా విద్యార్థులు మారాలన్నారు ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు అకాడమిక్ ఇండస్ట్రీస్ రిలేషన్స్ డైరెక్టర్ పరుచూరి సతీష్ చంద్ర ప్లేస్మెంట్ అధికారి డాక్టర్ జె బంగార్రాజు కళాశాల మేనేజర్ బాపిరాజు ఏవో సురేష్ కళాశాల సిబ్బంది విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నత్తి మల్లేష్ మరిన్ని ఉన్నత పదవులు పొందాలి

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు



**తూప్రాన్, ఆగస్టు 10 (జనం సాక్షి) :** రాష్ట్ర సర్పంచ్ల ఫోరం ఉపాధ్యక్షులు నత్తి మల్లేష్ ముదిరాజు మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని దేవుని కోరుకుంటున్నట్లు మెదక్ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. నత్తి మల్లేష్ జన్మదిన సందర్భంగా ఆయనకు సార్వత్ సన్మానించిన అనంతరం మాట్లాడారు ఆయన నుంచి ఆశీర్వదించారు. ప్రజలలో మంచి పేరున్న నాయకుడు మల్లేష్ అని కాలకల్ గ్రామంలో పేరు ఉందని ఆయన చేసిన మంచి పనులే ఆయనను మరిన్ని ఉన్నత పదవులు అలంకరిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు చంద్రశేఖర్ ముదిరాజ్ బిజెపి నాయకులు పాల్గొన్నారు. అనంతరం బిజెపి ఎమ్మెల్యే ఈటల రాజేందర్ జన్మదిన సందర్భంగా శాలువతో సన్మానించారు.

## భారీ వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమతంగా ఉండాలి

- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్‌నగర్, ఆగస్టు 10 (జనం సాక్షి) :** హయత్‌నగర్ డివిజన్ రంగ నాయకుల గుట్ట లోని వరద నీటి కాలువలో చెత్తాచెదారం చేరడంతో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వర్షపు నీరు వరద నీటి కాలువ లోకి వెళ్లకుండా రోడ్లపై నిలిచి కాలనీ వాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డికి సమాచారం అందడంతో సంబంధిత జిహెచ్ఎంసి సిబ్బందితో కలిసి రంగనాయకుల గుట్ట పరిసర ప్రాంతాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వరద నీటి కాలువలో ఉన్న చెత్త, చెదారాన్ని వెంటనే శుభ్రం చేయాలని మరల కాలనీవాసులకు ఎలాంటి వరద నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వారు అధికారులకు తెలిపారు. నగరంలో మరో రెండు మూడు రోజులు భారీ నుంచి, అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలపడంతో లోతట్టు ప్రాంతాల ప్రజల అప్రమత్తంగా ఉండాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ హేము నాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్, బిజెపి డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, రంగనాయకుల గుట్ట బిజెపి నాయకులు మొగులయ్య, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ కోసం పనిచేసే వారికే సముచిత స్థానం

- మైలార్‌దేవ్ పల్లి డివిజన్ 2వ అధ్యక్షులు సూరెడ్డి వినయ్ రెడ్డి

**రాజేంద్రనగర్, ఆగస్టు 10 (జనం సాక్షి) :** మైలార్‌దేవ్‌పల్లి-2వ డివిజన్ అధ్యక్షులు సూరెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం డివిజన్ కార్యవర్గ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ బలం కార్యకర్తలు ఏ, పార్టీలో ఏ బాధ్యత ఇచ్చిన పార్టీ ఎజెండా కోసం పనిచేయాలి, పార్టీ అభివృద్ధి లో ప్రతి కార్యకర్త పాలు పంచుకోవాలని, పార్టీ ప్రతి ఒక్కరిని గుర్తిస్తదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఒక మామూలు కార్పొరేటర్ స్థాయి నుంచి రాష్ట్ర అధ్యక్షులు గా ఆ తర్వాత కేంద్ర మంత్రిగా అయ్యారని అదే విధంగా బెంగుళూరు ఎంపీ తేజస్వి సూర్య ఒక మామూలు బీజేపీ యువ మోర్చా కార్యకర్త నుంచి ఎంపీ అయ్యారని, జాతీయ యువ మోర్చా అధ్యక్షులు అయ్యారు. కాబట్టి ప్రతి ఒక్కరు వ్యక్తుల కోసం కాకుండా, పార్టీ ఎజెండా కోసం పని చేయాలని మీకు ఏ బాధ్యత ఇచ్చిన ఆ బాధ్యత ను సమర్థవంతంగా నిర్వహించాలని, పార్టీ లో 6 మోర్చాలు ఉంటాయి. కాబట్టి ప్రతి ఒక్కరికి అవకాశాలు వస్తాయని మిమ్మల్ని పార్టీ మీ పనితనం చూసి గుర్తిస్తుందని, పార్టీ కోసం పనిచేసే వారికే పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఎస్సీ మోర్చా నాయకులు జోగు రవి , ఓబీసీ రాష్ట్ర కార్యనిర్వాహణ సభ్యులు అడికే రాజు, ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు రావులు భాస్కర్, ఎన్. మురళీధర్ రెడ్డి, బొమ్మరాజు నరసింహ, వెంకట్రమణ గుప్తా, బల్ల శ్రీనివాస్ యాదవ్, గూడూరి అంజి, జే



వినయ్ కుమార్, జేఎం శ్రీను , జే నగేష్ , భాస్కర్,శరణ్ ,నిఖిల్, అరుణ్, హర్ష, శశి రెడ్డి , సందీప్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టర్‌పై చర్యలు ఏవి..?


- నిర్లక్ష్యపు నీడలో అధికారులు
- నాకు నేనే సాటి అన్నట్టుగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్
- పత్రికల్లో వచ్చిన కథనాలపై అధికారుల స్పందన కరువు

**యాచారం, ఆగస్టు 10 (జనం సాక్షి) :** యాచారం మండల కేంద్రంలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో అసంపూర్తిగా పునర్నిర్మాణ పనులు చేశాడని కాంట్రాక్టర్ పై వివిధ పత్రికల్లో కథనాలు వచ్చిన సంగతి పాఠకులకు విధితమే. ఇప్పటికీ రెండు, మూడు రోజులు అయినప్పటికీ ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన పనులపై ఏ అధికారి కూడా సందర్శించి పరిశీలన చేయకుండా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తూతూ మంత్రంగా పునర్నిర్మాణ పనులు జరిగాయని, దీంతో కాంట్రాక్టర్ చేతులు దులుపుకొన్నాడని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. పునర్నిర్మాణ పనులకు రూ.50లక్షల నిధుల్లో 30 శాతం ఖర్చు చేయలేదని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. వివరణ కోరితే కాంట్రాక్టర్ మాట



దాటవేస్తున్నాడని వారు చెప్పారు. ఇప్పటివరకు ఆసుపత్రిలో ఒక పెయింట్ వర్క్ సగభాగమే జరిగిందని అన్నారు. అసంపూర్తిగా కిటికీలు, డ్రైనేజీ, బాత్రూములు, సంపు నిర్మాణ పనులు అలానే ఉన్నాయని వారు స్పష్టం చేశారు. పునర్నిర్మాణ పనులు చేసిన కాంట్రాక్టర్ పై పై అధికారులకు తాము ఫిర్యాదు కూడా చేశామని వారి పేర్కొన్నారు. కానీ ఆసుపత్రి పునర్నిర్మాణ పనులపై అసంపూర్తిగా పనులు జరిగాయని వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందన కరువైందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

## చిన్నోని చెరువుకు జలకళ



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10 (జనం సాక్షి) :** నారాయణపేట మండలం, శ్యాసన్ పల్లి శివారులోని చిన్నోని చెరువు జలకళను సంతరించుకుంది. శనివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి పై నుండి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో చిన్నోని చెరువు నిండి అలుగు పారుతుంది.అలుగు పారిన వరద ప్రవాహం శ్యాసన్ పల్లి, సింగారం, జాజాపూర్, ఊట్కూర్ మండలంలోని తిప్రాస్ పల్లి మీదుగా ఊట్కూర్ చెరువుకు వరద నీటి ప్రవాహం చేరుతుంది.ఈ ప్రవాహం ఇలాగే కొనసాగితే పై గ్రామాల పరిసరాల్లో భూగర్భ జలాలు పెరిగి బోర్లు తిరిగి పూర్వ వైభవనికి వచ్చే అవకాశముందని రైతులు అంటున్నారు.ఈ వర్షకాలంలో మొదటిసారిగా అలుగు పారడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పరిసర గ్రామాల ప్రజలు చెరువును సందర్శించి సెల్ఫీ ఫోటోలు తీసుకున్నారు.

## స్వయం ఉపాధితో పది మందికి పని కల్పించాలి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి




**వనపర్తి, ఆగస్టు 10 (జనంసాక్షి) :** యువత స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకొని మరో పది మందికి పని కల్పించాలని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సూచించారు.జిల్లా కేంద్రంలోని పాన్ గల్ రోడ్డులో పెద్దముక్కుల మహేష్ ఏర్పాటు చేసుకున్న నూతన హర్ష చికెన్ సెంటర్ ను ఆదివారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందిస్తూ నాణ్యవంతమైన,ఆరోగ్యమైన ఆహారం అందిస్తే ప్రజలు మన్నిస్తారని, అంతేకాకుండా యువత ఇతరులపై ఆధారపడకుండా స్వయం ఉపాధి ఏర్పాటు చేసి పదిమందికి ఉపాధి, భవిష్యత్తు జీవనోపాధి కల్పించి ఆదర్శప్రాయులుగా నిలవాలని ఆకాంక్షించారు. పెద్దముక్క మహేష్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నందిమల్ల అశోక్, విజయ్ కుమార్, ధర్మా నాయక్, కంచె రవి, సదుర్ల రమేష్, పెద్దముక్కల రవికుమార్, చిట్యాల రాము, కొమ్ము శ్రీనివాస్, ఎంట్ల శ్రీను, నాగవరం యువత పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు రామంచ విద్యార్థులు

- జిల్లాస్థాయి అత్య పాత్య క్రీడలో ప్రతిభ



**సిద్దిపేట, ఆగస్టు 10 (జనంసాక్షి) :** సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామంచ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి అత్య పాత్య క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. రామంచ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న అవినాష్, రాజేందర్ అనే ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి అత్య పాత్య పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సత్తవ్వ తెలిపారు. అత్య పాత్య జిల్లా అసోసియేషన్ అధ్వర్యంలో కొండపాక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 17 సంవత్సరాల లోపు బాల, బాలికల జిల్లా స్థాయి అత్య పాత్య క్రీడా పోటీలలో అవినాష్, రాజేందర్ చక్కటి ప్రతిభ కనబరిచారు. వీరి ప్రతిభను గుర్తించిన సెలెక్టర్లు వీరిని రాష్ట్ర స్థాయి అత్య పాత్య క్రీడా పోటీలకు ఎంపిక చేశారు. త్వరలో అత్య పాత్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించే 17 సంవత్సరాల లోపు రాష్ట్ర స్థాయి బాలుర అత్య పాత్య క్రీడా పోటీలలో జిల్లా జట్టు తరపున ఆడుతారని ప్రధానోపాధ్యాయురాలు సత్తవ్వ తెలిపారు. జిల్లా స్థాయి అత్య పాత్య క్రీడా పోటీలలో అత్యంత ప్రతిభ కనబర్చి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు అవినాష్, రాజేందర్ లతో పాటు వీరికి అత్య పాత్య క్రీడలో శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు సంతోషి లను ప్రధానోపాధ్యాయురాలు సత్తవ్వ, ఉపాధ్యాయులు కత్తి మల్లయ్య, రామిని భాస్కర్, గంగా భవాని, నిర్మల, నరేందర్ , ఎల్.వి.శ్రీనివాస్, జమున అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్ రాచకొండ శ్రీదేవి, గ్రామస్తులు అభినందించారు.

# కౌడిపల్లిలో కలెక్టర్ రాహుల్ రాజ్ విస్తృత పర్యటన

**కౌడిపల్లి, ఆగస్టు 10 (జనంసాక్షి) :** మూడు రోజులకు మించి జ్వరంతో బాధపడుతున్నట్లయితే తక్షణమే దగ్గరలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యులతో పరీక్షలు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ రోగులకు సూచించారు. ఆదివారం కౌడిపల్లి మండల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, ఓపి రిజిస్టర్, ఏఎన్సీ, ఇన్‌పేషెంట్, మందుల స్టాక్ రిజిస్టర్,తదితర రిజిస్టర్ లను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా జ్వర సర్వేను నిర్వహించడం జరుగుతున్నదని, అయితే వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు సంభవిస్తున్నాయని, ప్రజలు సీజనల్ వ్యాధుల వల్ల ఇబ్బందులు పడకుండా ఉండేందుకుగాను జ్వరం వచ్చినప్పుడు తక్షణమే డాక్టర్ ను సంప్రదించి చికిత్స చేయించుకోవాలని చెప్పారు. ప్రత్యేకించి మూడు రోజులకు మించి జ్వరం ఉన్నట్లయితే నిర్లక్ష్యం చేయకుండా



దగ్గర్లో ఉన్న ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి వచ్చి డాక్టర్ తో చూయించుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధులతో పాటు, అన్ని రకాల జబ్బులకు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, అంతేకాక అవసరమైన మందులు సైతం సిద్ధంగా ఉన్నాయని, అందువల్ల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్లు వారి పరిధిలో ఎప్పటికప్పుడు జ్వరపీడితులను గమనిస్తూ ఉండాలని, ఆశ, అంగన్వాడీ కార్యకర్తల ద్వారా ఎప్పటికప్పుడు గ్రామాల నుండి సమాచారాన్ని సేకరించి వైద్యం అందించే విధంగా సిద్ధంగా ఉండాలని, ఇందుకు గాను మందులతో పాటు, ఇతర పరీక్షలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. కౌడిపల్లిలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌ను తనిఖీ చేసి, వంటగది, నిల్వ గది నిర్వహణ, శుభ్రత మరియు త్వరగా పాడైపోయే వస్తువుల నాణ్యత మొదలైన వాటిని తనిఖీ చేశారు. నాణ్యమైన మేనూ అందించడంతోపాటు గుణాత్మక విద్య బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నంది వనపర్తిలో అంగరంగ వైభవంగా మల్లన్నస్వామి బోనాల ఉత్సవాలు

**యాచారం, ఆగస్టు 10 (జనం సాక్షి) :** యాచారం మండలం నంది వనపర్తి గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లన్న స్వామి బోనాలు శివశక్తుల పూనకాలు పోతురాజుల విన్యాసాలతో అంగరంగ వైభవంగా జరిగాయి.ఈ ఉత్సవాలకు మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, బి.యన్.రెడ్డి ట్రస్ట్ చైర్మన్ శేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వెంకట్ రెడ్డి, హాజరయ్యారు. ఈ



సందర్భంగా యాదవ సంఘం నాయకులు వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. మల్లన్న స్వామి ఆశీస్సులు గ్రామం పై ఎల్లవేళలా ఉండాలని వేడుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు రెడ్డి మోని సత్యనారాయణ,జెనిగే వెంకటేష్, వంగూరు సాయి, పంతం సాయికిరణ్ , సైతాన్ బాలరాజు, సైతాన్ శేఖర్, సైతాన్ కృష్ణ, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో చట్టం చేయాలి

- సంగారెడ్డిలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన
- సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ



**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 10 (జనం సాక్షి) :** 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో చట్టం చేసి అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ అంబేద్కర్ చౌక్ దగ్గర బీసీ రిజర్వేషన్ల కోసం చట్టం చేసి వెంటనే అమలు చేయాలని, తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ తీర్మానం చేసి 42 శాంతం బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రానికి ఆమోదం కోసం పంపిందన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం బీసీలను మోసం చేస్తూ 42 శాతం రిజర్వేషన్ల కోసం పార్లమెంటులో చట్టం చేయకుండా మోసం చేస్తుందన్నారు. రిజర్వేషన్లు ఇచ్చేది మత ప్రాతిపాదికన కాదని, వెనుకబడిన వర్గాలకు ఆర్థిక,రాజకీయ,సామాజిక సమాన అవకాశాలు కల్పన కోసం అన్న అంశాన్ని బిజెపి పక్కన పెడుతుందని విమర్శించారు. విద్య ఉద్యోగ ఉపాధి అవకాశాలలో సమానత్వాన్ని నిరాకరిస్తున్నదని, అందుకే బీజేపీ బీసీ రిజర్వేషన్లను పక్కన పెట్టాలని భావిస్తుందన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో అమలు చేస్తున్న రిజర్వేషన్ల గురించి మాట్లాడకుండా కేవలం తెలంగాణ రాష్ట్రంలో మత ప్రతిపాదికన ప్రజలను విభజించడం కోసం రిజర్వేషన్లను మతానికి పరిమితం చేస్తున్నారని విమర్శించారు. చట్ట సవరణ చేసి భారత రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని, ఆ దిశగా బీసీ రిజర్వేషన్లకు సైతం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంపై రిజర్వేషన్ల సాధనకై రాజీలేని పోరాటాలు చేయాలని కాంగ్రెస్ పార్టీకి సూచించారు. ఆ దిశగా అఖిల పక్ష రాజకీయ పార్టీలను కలుపుకొని కేంద్రం పై పోరాడాలన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం చేసే పోరాటంలో రాజిపడే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సాయిలు, నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ, నాయకులు అశోక్, రామేశ్గౌడ్, నర్సింహారెడ్డి, మహేష్, దత్తు తది తరులు పాల్గొన్నారు.

# రంగంపేట తిరుమల రైస్‌మిల్‌లో చోరీ

- మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి



**కొల్చారం, ఆగస్టు 10 (జనంసాక్షి) :** రంగంపేట తిరుమల రైస్ మిల్లు లో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించి రూ. నాలుగు లక్షల రూపాయల చోరీ చేశారు. కొల్చారం ఎస్సై మహమ్మద్ మోహినుద్దీన్, బాధితుడు ముప్పిడి కృష్ణ కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తిరుమల రైస్ మిల్లు తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించి కార్యాలయ గది తాళాలు బీరువా తాళాలు పగలగొట్టారు. బీరువాలో ఉన్న రూ.4 లక్షల రూపాయలు చోరీ చేశారు. ఉదయం మిల్లు యజమాని కృష్ణ రైస్ మిల్ తెరవడానికి వెళ్లగా గేటు తాళాలు , కార్యాలయ తలాలు, బీరువా తాళాలు పగలగొట్టి ఉండడంతో మేడం తో కొల్చారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కొల్చారం ఎస్ఐ మహమ్మద్ మోహినుద్దీన్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి లు సంఘటన స్థలాన్ని సందర్శించారు. క్లూస్ టీం ను రప్పించి ఆధారాలు సేకరించారు.

# శతాబ్ది ఉత్సవాలకు పూర్తి సహకారం అందిస్తా..

- మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



**జడ్చర్ల, ఆగస్టు 10 (జనంసాక్షి) :** బాదేపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని మాజి మంత్రి డా. లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. శతాబ్ది ఉత్సవ కమిటి కార్యవర్గం ఆదివారం మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని జడ్చర్ల లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శతాబ్ది ఉత్సవాలకు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ఉత్సవాలను విజయవంతం చేసుకుందామని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాల 100 ఏళ్లు పూర్తిచేసుకోవటం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. పాఠశాల అభివృద్ధిలో తనవంతు భాగస్వామ్యాన్ని గుర్తు చేశారు. ఆయనను కలసిన వారిలో ఉత్సవ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కృష్ణ, ప్రధానకార్యదర్శి రమణా చార్యులు, ఉపాధ్యక్షులు జీనురాల సత్యం, సత్యం, సయ్యద్ ఇబ్రహీం, కార్యనిర్వహణ కార్యదర్శి కంచుకోట ఆనంద్, పరమటయ్య, సంతోషాచారి, శ్రీహరి, అర్జున్, శ్రీను, శ్రీనివాస్ చారి, మహిళ కమిటి అధ్యక్షురాలు మౌనిక, ఎంఈఓ మంజులా దేవి, పీఏసీఎస్ మాజి చైర్మన్ పి. మురళి, ఇఫ్తాకారోద్దిన్, నర్సింహ్మా యాదవ్, పర్వత్ రెడ్డి, జెడ్పీ మాజి వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, బాదేపల్లి శంకర్ బాబు, బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ ను ఉత్సవ ఉత్తమ కమిటీ సభ్యులు ఉత్సవాలకు ఆహ్వానించారు. జడ్చర్లలో ఒ కార్యక్రమానికి హాజరైన శాంత కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు.

# జనంసాక్షి కథనంతో పరిశ్రమ పేరుతో బోర్డు ఏర్పాటు



ఈ పరిశ్రమ పేరేంటీ..?



**రాజాపూర్, ఆగస్టు 10 (జనంసాక్షి) :** మండల పరిధిలోని రంగారెడ్డిగూడ గ్రామ శివారులో గల రసాయన పరిశ్రమ పేరు లేకుండానే గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న , ఎవరు పట్టించుకోవడం లేదని ఈ పరిశ్రమ పేరేంటి అనే కథనం జనంసాక్షిలో ప్రచురితం కావడంతో పరిశ్రమ ముందు వివంతా ల్యాబొరటరీ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో బోర్డు ఏర్పాటు జరిగింది. కానీ రెండు సంవత్సరాలుగా గ్రామ పంచాయతీ పన్ను చెల్లించకుండా ఈ పరిశ్రమ కొనసాగుతుందని సమాచారం. ఈ పరిశ్రమలో ఒకే రకమైన కెమికల్ తయరికే అనుమతులు ఉన్నాయని, కానీ రెండు మూడు రకాల ఉత్పత్తులు తయారు చేస్తుంటారని, గతంలో సల్ఫ్యూరిక్ యాసిడ్ ప్రమాదమే దానికి సాక్ష్యం అని గ్రామస్తులు అంటున్నారు. అనుఫార్మా నుండి వివంతా ల్యాబొరటరీ అని పేరు మార్చి ప్రజాభిప్రాయాన్ని తీసుకోకుండా అనుఫార్మాలో తయరుచేసే కెమికల్ నే వివంతా ల్యాబొరటరీ లో తయారు చేయడానికి అనుమతులు ఇవ్వడాన్ని పరిశ్రమ పరిధిలోని తాండాల ప్రజలు, రంగారెడ్డిగూడ ప్రజలు ఖండిస్తున్నారు.

# వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తప్పవు
- ఉర్కొండ ఎస్సై కృష్ణ దేవ



**ఉర్కొండ, ఆగస్టు 10 (జనం సాక్షి) :** తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇస్తే జరిమానాతో పాటు కేసు నమోదుచేస్తామని ఉర్కొండ ఎస్సై కృష్ణదేవ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణదేవ మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల 18 సంవత్సరాలు నిండని మైనర్లు వాహనాలు నడిపిన, వాహన పత్రాలు లేకున్నా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నిబంధనలు ఎవరైనా అతిక్రమించిన చట్టరీత్యా చర్యలు చేపడతామని సందర్భంగా తెలియజేశారు. మండలంలోనీ ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు.

# నులి పురుగుల నివారణే ప్రభుత్వ లక్ష్యం

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



**పటాన్‌చెరు, ఆగస్టు 10 (జనం సాక్షి) :** బాల బాలికల్లో నులి పురుగుల సమస్య నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతి ఏటా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తోందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. జాతీయ ఫైలేరియా మరియు నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పటాన్చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మాత్రల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రెండు విడతల్లో నులి పురుగు నివారణ మాత్రలు ప్రభుత్వం పంపిణీ చేస్తోందని తెలిపారు. 1-19 సంవత్సరాల మధ్య వయస్సు గల ప్రీస్కూల్, పాఠశాల వయస్సు గల పిల్లలందరికీ (నమోదు చేసుకున్న మరియు నమోదు చేసుకోని) పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వేదిక ద్వారా వారి మొత్తం ఆరోగ్యం, పోషక స్థితి, విద్యకు ప్రాధాన్యత, జీవన నాణ్యతను మెరుగుపరచడం ద్వారా నులిపురుగులను తొలగించడం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారిని నిర్మల, డాక్టర్ మనోహర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఆసుపత్రి అభివృద్ధి సంఘం సభ్యులు కంకర సీనయ్య, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# భారీ వర్షంతో ట్రంకులైన్ కుంగుబాటు


- జాతీయ రహదారికి గండి





**హయత్‌నగర్, ఆగస్టు 10 (జనం సాక్షి) :** హయత్‌నగర్‌లో జాతీయ రహదారికి అనుకొని నేతాజీ కాలనీ ముఖద్వారం వద్ద శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి భూగర్భ డ్రైనేజ్ ట్రంక్ లైన్ పగిలి అర్ధరాత్రి 12 గంటల సమయంలో జాతీయ ప్రధాన రోడ్డు మార్గం కుంగిందని సమాచారం రావడం తో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గారు హుటాహుటిన ఘటన స్థలాన్ని పరిశీలించారు. అటువైపు నుంచి ఎలాంటి వాహనాలు వెళ్లకుండా భారీ గేట్స్ ఏర్పాటు చేయించారు. వారితో పాటు ఘటన స్థలాన్ని జలమండలి అధికారి డీజీమ్ రాజ్ గోపాల్, జాతీయ రోడ్డు విస్తరణ అధికారులు, జలమండలి సూపర్వైజర్ బాలు, జీవన్ అన్న మిత్రబృందం సభ్యులు పాండాల శ్రీధర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# చేర్యాల డివిజన్ సాధనకు 12న విద్యాసంస్థల బంద్



**చేర్యాల/మద్దూర్, ఆగస్టు 10 (జనంసాక్షి) :** విద్యార్థులకు చేర్యాల ప్రాంత ఆవశ్యకతను కిందిస్థాయిలో తీసుకెళ్లడం కోసం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ఈ నెల 12న నాలుగు మండలాల పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల బందుకు యజమాన్యాలు విద్యార్థులు సహకరించాలని మద్దూరు మండల జేఏసీ నాయకులు పాకాల ఇసాక్, జంగిలి యాదగిరి, వలబోజు నర్సింహా చారి లు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు డివిజన్ ప్రకటిస్తామని ఆమె ఇచ్చిందని వెంటనే ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా చేర్యాలను ఏర్పాటు చేసి చేర్యాల ప్రాంత ప్రజల ఇబ్బందులను తీర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. 12 జరిగే విద్యాసంస్థల బంధుకు అందరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# నేత్రపర్వంగా చౌడేశ్వరి మాత అఖండ జ్యోతుల ఊరేగింపు



**నారాయణపేట, ఆగస్టు 10 (జనంసాక్షి) :** బ్రహ్మణ్ వాడి తొగట వీరక్షత్రియాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం చౌడేశ్వరి మాతఅఖండ జ్యోతుల ఊరేగింపును పురవీధుల మీదుగా భజన సంకీర్తనలతో ఖడ్గ విన్యాసలతో నందికొలు ఆటలతో కన్నుల పండువగా నిర్వహించారు. అంతకుముందు అమ్మావారి మూల విరాట్ విగ్రహనికి మహా అభిషేకం కుంకుమార్చన పుష్పా లంకరణ ప్రత్యేకపూజలతోపాటు మహా మంగళహారతి సర్వదర్శనం తీర్థ ప్రసాద వితరణ చేశారు భక్తులు మహిళలు దేవాలయ కమిటి సభ్యులు తోగుట వీర క్షత్రియ కుల బాంధవులు పాల్గొన్నారు.

# స్ట్రీట్ వెండర్స్ ఆధ్వర్యంలో క్యూబా సంఘీభావ నిధి

- సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి



**హయత్‌నగర్, ఆగస్టు 10 (జనం సాక్షి) :** ఆనంద్ నగర్ లోని సిఐటియు స్ట్రీట్ వెండర్స్ ఆధ్వర్యంలో క్యూబా ప్రజలకు సహాయం నిధిని వసూలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కిసరి నర్సిరెడ్డి మాట్లాడుతూ అమెరికాకు 90 మైళ్ల దూరం లోని చిన్న ద్వీపం సోషలిస్ట్ క్యూబా గత 60 ఏళ్లుగా అమెరికా ను ఎదిరించి నిలబడుతుందని, క్యూబాలో సోషలిస్టు విప్లవం జయప్రదమైన నాటి నుండి క్యూబా పై అనేక ఆంక్షలు విధిస్తూ క్యూబా ప్రజల స్ఫూర్తిని దెబ్బతీయాలని అమెరికా పాలకులు ప్రయత్నం చేస్తున్నారని వారు అన్నారు. అమెరికన్ పాలకులు వైఖరి మాత్రం చిన్న చిన్న తేడాలు ఉన్న ఒకటిగానే ఉన్నట్లుందని, అమెరికన్ సామ్రాజ్యవాద ఆకాంక్షలకు వ్యతిరేకంగా క్యూబా ప్రజలు పోరాడుతూనే తమ దేశాన్ని ముందుకు తీసుకుపోతు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న క్యూబా ప్రజలకు సీఐటీయూ అభినందనలు తెలుపుతుందని వారు తెలిపారు. ప్రజలు క్యూబాకు అండగా నిలబడుతున్నారు ధన, వస్తు రూపం లో ప్రజలకు చేయూతను అందిస్తున్నారని వారు పేర్కొన్నారు.

### క్యూబా ప్రజలకు ఎందుకు అండగా నిలవాలి ?

క్యూబా ప్రజలు ఉన్న పరిస్థితుల్లో అనేక రూపాల్లో అంతర్జాతీయ సంఘీభావం అవసరం ఎక్కువ ఉందని వారు అన్నారు. క్యూబా పై అమెరికా విధిస్తున్న ఆంక్షలు ఖండిస్తూ, ఐక్యరాజ్యసమితి చేసిన 31 తీర్మానాలను అమెరికా తిరస్కరించింది. క్యూబా వ్యతిరేక శక్తులను, టెర్రరిస్టులకు మిలియన్ డాలర్లను ఖర్చు చేస్తూ క్యూబాను అస్థిరపరిచేందుకు నిరంతరం ప్రయత్నం చేస్తూనే ఉందని వీటికి అదనంగా దొంగే దొంగ దొంగ అని అర్చినట్లుగా క్యూబా పై ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశంగా ముద్ర వేసి ఆంక్షలు మరింత పెంచే క్యూబాను లొంగ తీసుకోవాలని చూస్తుందని వారు తెలియపరిచారు. సామ్రాజ్యవాద అమెరికా విధిస్తున్న దిగ్బంధనము వలన విద్యుత్ ఉత్పత్తిలో, పంపిణీలో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్తు లేకుండానే చీకటి లోనే మగ్గుతున్నారు, విద్యుత్ సరఫరా లేక పరిశ్రమల నడపగలిగే పరిస్థితి లేనందున ఉత్పత్తి చేయలేని పరిస్థితిలో ఉన్నదని వారు పేర్కొన్నారు. మరోవైపు మందుల తయారీ అవసరం అయిన ముడి సరుకుల కొరత వల్ల అవసరమైన మందుల ఉత్పత్తి చేసుకోలేకపోతున్నారు, ఫలితంగా ప్రజల ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం పడుతుంది. ఆహారం, ఇంధనం, ముడి సరుకులు క్యూబాకు అందకుండా ఆర్థిక దిగ్బంధాన్ని విధిస్తున్నారు. ఈ చర్యలను మన సంఘం తీవ్రంగా ఖండిస్తుంది క్యూబా పై ఉన్న వ్యాపార అంశాల్ని, ట్రావెల్ ఆంక్షలను, ఆర్థిక అంశాలను, పెట్టుబడుల ఆంక్షలు విధించిన ఇతర దేశాల నుండి సహాయం పొందకుండా వీలులేని పరిస్థితిని అమెరికా సృష్టిస్తుందని వారు ఆవేదన వ్యక్తపరిచారు. ఈ చర్యలను అన్నిటిని ఖండిస్తూ క్యూబా సహాయ నిధిని అందజేసిన కార్మికులకు ధన్యవాదాలు తెలియజేశారు. స్ట్రీట్ వెండర్స్ ద్వారా క్యూబా సహాయ నిధికి పదిహేను వందల రూపాయలు వసూలు చేయడం జరిగిందని, సహకరించిన కార్మికులందరికీ సిఐటియు పక్షాన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో యూనియన్ అధ్యక్షులు ఎరుపుల యాదయ్య, కార్యదర్శి కొత్త సైదులు, కృష్ణ, సుజాత, జ్యోతి, వెంకన్న, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకుందాం

- గణేష్ ఉత్సవ సమితి



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా కేంద్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే గణేష్ ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకుందామని గణేష్ ఉత్సవ సమితి నాయకులు అన్నారు.ఆదివారం పట్టణం లో జరిగిన ఉత్సవ సమితి సమావేశంలో పలు నిర్ణయా లు తీసుకున్నారు. హిందూ ఉత్సవాలపై అనవసర ఆంక్ష లు విధించరాదని పేర్కొన్నా రు.అలాగే సంస్కృతి సాంప్ర దాయలను పరిరక్షించేలా అందరికీ ఆదర్శంగా ఉత్సవా లు జరుపుకోవాలని కోరారు.ఉత్సవాలకు అధికారులు సహకారం అందించాలని కోరారు.నారాయణపేట మతసామరస్యానికి ప్రతీక అని అన్నారు. ఆపేరును అలాగే కొనసాగించేందుకు అందరూ సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో గణేష్ ఉత్సవ కమిటీ,వి ఎచ్ పి నాయకులు చెన్నారెడ్డి,ప్రవీణ్,శివకుమార్,నందు నామాజీ, పోషల్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# జస్ట్ ఒక్క క్లిక్‌తో ఇందిరమ్మ ఇళ్ల స్టేటస్ చెక్

- జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ ప్రతినిధి, ఆగష్టు 20(జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులు తమ బిల్లుల స్టేటస్‌ను సులభంగా తెలుసుకోవడానికి ఒక కొత్త ఆన్‌లైన్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. ఇకపై లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే, తమ ఇంటి బిల్లు ఎక్కడి వరకు వచ్చింది, ఏ దశలో ఉంది, లేదా ఏ కారణంతో ఆగిపోయింది వంటి పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందవచ్చన్నారు. జిల్లా లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగం గా కొనసాగుతున్నాయని... ఈ స్కీమ్ కింద గుర్తించిన లబ్ధిదారులు.. ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేసే దిశగా ముందుకెళ్తున్నారన్నారు. పనులు ఆధారంగా ప్రభుత్వం కూడా నిధులను జమ చేస్తోందని... ప్రతి సోమవారం బిల్లుల చెల్లింపు కొనసాగుతోందన్నారు. అయితే చాలా మంది తమ ఖాతాలో డబ్బులు పడ్డాయా లేదా అనేది తెలుసుకోవటానికి ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారని...బిల్లుల పేమెంట్ గురించి తెలుసుకునేందుకు లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో...రాష్ట్ర గృహ నిర్మాణశాఖ కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతితో పాటు బిల్లుల పేమెంట్ వివరాలను సులభంగా తెలుసుకునేందుకు వీలుగా వెబ్ సైట్ లో ఆప్షన్‌ను తీసుకొచ్చిందని లబ్ధిదారుల వివరాలు, ఇళ్ల పురోగతి, బిల్లుల చెల్లింపుల స్టేటస్ చెక్ చేసుకునేలా మాడిఫై చేసిందన్నారు. బిల్లుల పేమెంట్ తో పాటు ఇంటి పురోగతి స్టేటస్ తెలుసుకునేందుకు లబ్ధిదారులు ముందుగా http://indirammaindlu.telangana.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్ళి.... హోం పేజీలో స్టేటస్ పైకి వెళ్లాలని..ఇక్కడ ఆధార్ నెంబర్ లేదా మొబైల్ నెంబర్ లేదా ఫుడ్ సెక్యూరిటీ కార్డ్ నెంబర్ లేదా అప్లికేషన్ నెంబర్ ను ఎంట్రీ చేసి సబ్మిట్ చేస్తే మీ ఇంటి నిర్మాణానికి సంబంధించిన పూర్తి వివరాలు డిస్ ప్లే అవుతాయని ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన ఆప్షన్స్ తో లబ్ధిదారులు తరచూ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. నేరుగా http://indirammaindlu.telangana.gov.in వెబ్‌సైట్‌లోనే సంబంధిత సేవలను చాలా సులభంగా పొందొచ్చన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి సందేహాలు నివృత్తి చేయడం, ఫిర్యాదుల స్వీకరణ కోసం 040-29390057 టోల్ ఫ్రీ నెంబర్ ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

# నిరక్షరాస్యతను అంతం చేయాలి





- చెట్లను, అడవులను రక్షించాలి
- మంత్రి ధనసరి అనసూయ సీతక్క

**ములుగు ప్రతినిధి/ తాడ్వాయి, ఆగష్టు 10(జనంసాక్షి) :** విద్య ద్వారా నిరక్షరాస్యతను అంతం చేయాలని, విద్యార్థులకు విద్య అందించడం ద్వారా వారి జీవితాలలో వెలుగులు నింపవచ్చని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం తాడ్వాయి మండలం మండల తోగు లో నూతనంగా నిర్మించిన పాఠశాలను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి లతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గుత్తికోయ గూడాలలో చిన్నారులకు విద్య అందించాలని ప్రభుత్వ పాఠశాలలు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఆలోచిస్తుందని, ఈ ప్రాంతం అభయ అరణ్యంలో ఉండడం ద్వారా అనుమతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ తరుణంలోనే ఈ ప్రాంతంలోని పిల్లలకు విద్యను అందించాలనే సంకల్పంతో పీపుల్ హెల్పింగ్ సెంటర్ ఎన్జీఓ సంతోష్ 2020 కరోనా నుంచి ఈ ప్రాంతంలో మాతో కలిసి తమ సేవలను అందిస్తున్నాడని, చక్రవర్తి హాస్పిటల్ యాజమాన్యం గతం సంవత్సరం లో తక్కలపాడు లో స్కూల్ నిర్మించారని, ఈ రోజు ఇక్కడ ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని, సహకరించడం చాలా అభినందనీయమని పేర్కొన్నారు. విద్య అందరి ప్రాథమిక హక్కు అని, గిరిజన ప్రాంతాలలో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మౌలిక వసతులు కల్పిస్తూ, విద్యను అందించడం జరుగుతుందని అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి, కలెక్టర్ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ రవిందర్, చక్రవర్తి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తరుణ్ రెడ్డి, మండల అధికారులు, ఎన్జీఓ సంతోష్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రాంతాన్ని ఏడారిగా మారుస్తారా?

- బిజెపి దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి రామరాజు నేత



**ఏటూరునాగారం, ఆగష్టు 10(జనంసాక్షి) :** ఏజెన్సీ ప్రాంతాన్ని ఏడారిగా మారుస్తారా? అని బిజెపి దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి రామరాజు నేత విమర్శించారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మైదాన ప్రాంత నాయకురాలు పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి కండ్లలో ఆనందం చూడడం కోసం ములుగు జిల్లాలోని ఇసుక క్వారీ లు గిఫ్ట్ గా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఇచ్చి దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ నుండి మైదాన ప్రాంతాలకు నీళ్లు దోసుకెళ్లి ఏజెన్సీ ప్రాంతాన్ని ఏడారిగా మార్చడం కోసం ఈ మంత్రుల పర్యటన అని అన్నారు. అదేవిదంగా ఇప్పటికైనా ఏజెన్సీ ప్రాంతంలోని కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులారా మీరు మైదాన ప్రాంత నాయకుల జెండాలు మొయ్యడం ఒకే కానీ, మన ప్రాంత అభివృద్ధి గురించి మాట్లాడాలని అన్నారు. ఇప్పటికైనా ఏజెన్సీ ప్రాంత బడుగు బలహీన వర్గాల ప్రజలు మేధావులు, ప్రజా సంఘాల నాయకులు ఒక్కసారి ఆత్మ విమర్శ చేసుకొని ఆలోచించండి. మైదానప్రాంత నాయకులు మన ప్రాంతం లో ఉండవలసిన జిల్లా కలెక్టర్ ఆఫీస్ ను ములుగు కు తరలించుకొని వెళ్లారు. రెవిన్యూ డివిజన్ ఆమోదం పొందితే మైదాన ప్రాంత నాయకులకు మనుగడ ఉండదని రెవిన్యూ ఆమోదం పొందకుండా చూస్తున్నా కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ నాయకుల మోసపూర్తి మాటలు నమ్మి మోసపోకుండని అన్నారు. కాని దేవదుల లిఫ్ట్ ఇరిగేషన్ నుండి మైదానప్రాంత రైతులు పంటలు నష్టపోతున్నారని దేవాదుల లిఫ్ట్ నుండి సాగు నీరు, త్రాగు నీరు దోసు కెల్లాడం కోసం ఐదుగురు మంత్రులు పర్యటన చేస్తున్నారు. కానీ ఏజెన్సీ ప్రాంతాన్ని ఎడారిగా మార్చడమే పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ మంత్రి ఏజెన్సీ ప్రాంత ప్రజలకు అవసరమా అని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి రామరాజు నేత అన్నారు.

# గిరిజన జాతీయ సదస్సుకు ముఖ్య వక్తగా సీతారాం నాయక్

**ఆహ్మదాబాద్ వెళ్లనున్న మాజీ ఎంపీ**



**మహబూబాబాద్ ప్రతినిధి, ఆగష్టు 10 (జనం సాక్షి):** మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి గిరిజన సామాజిక ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం కోసం గాంధీ నగర్‌లో జరిగే సమ్మేళనంకు ముఖ్య వక్తక హాజరుకానున్నట్లు మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు ప్రొఫెసర్ అజ్మీర సీతారాం నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో 12 కోట్ల బంజారా (లంబాడీ) సమస్యలపై జాతీయస్థాయిలో మాట్లాడేందుకు ఏర్పాటుచేసిన సమ్మేళనానికి ముఖ్య వక్తగా హాజరై బంజారాల స్థితిగతులపై ప్రసంగిస్తానని వారు పేర్కొన్నారు.

# విద్వేషాలను రెచ్చగొడుతున్న బిజెపి ప్రభుత్వం

- పేదల సంక్షేమాన్ని విస్మరించిన పాలకులు
- ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్




**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 10 (జనం సాక్షి):** ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర ప్రభుత్వం మతం ప్రాంతం భాషల పేరుతో విద్వేషాలను సృష్టిస్తూ రాజకీయ లబ్ధి కోసం ప్రాకలాడుతున్నదని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం వరంగల్ నగరంలోని మిడిల్ ఏరియా మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ల పార్టీ కార్యకర్తల సమావేశం ఎల్లం బజార్ లోని పంచతన్ జూనియర్ కళాశాలలో ఎస్కే హైమద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పెద్దారపు రమేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని అపహస్యం పాలు చేసే విధంగా పాలన కొనసాగిస్తుందని ట్రంపు అడుగులకు మడుగులొత్తుతూ దేశ ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెడుతుందని అయినా మన దేశ ప్రజలపై 50 శాతం దాకా ట్రంప్ పన్నులు విధించడం విడ్డూరంగా ఉందని ఇప్పటికైనా సిగ్గు తెచ్చుకొని అమెరికాతో వాణిజ్య ఒప్పందాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మతం ప్రాంతం భాష పేరుతో వైశ్యామ్యాలు రెచ్చగొట్టే విధానాలకు స్వస్తి పలకకపోతే ప్రజలు తిరగబడక తప్పదని హెచ్చరించారు. తెలంగాణలో 42శాతం బి సి రిజర్వేషన్లకు వెంటనే పార్లమెంట్ ఆమోదం తెలపాలని లేకపోతే బీసీ వ్యతిరేక పార్టీగా బిజెపికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని అలాగే రాజకీయ లబ్ధి కోసం బీసీ రిజర్వేషన్లను ముందు పెట్టి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ప్రయత్నం చేస్తుందని గతంలో బీసీలను గుర్తించకుండా అణచివేసిందే కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. ఇప్పటికైనా చిత్తశుద్ధితో బీసీ జనాభా కనుగుణంగా రిజర్వేషన్లను ఆమోదించి చిత్తశుద్ధి ప్రదర్శించాలని కోరారు. ఎంతో చారిత్రాత్మకమైన వరంగల్ నగరం ఎంతో వెనుకబడి ఉందని అందులో మిడిల్ ఏరియా అయినా రామన్నపేట ఎల్లం బజార్ మండి బజార్ చార్ బౌలి గిర్మాజీపేట లక్ష్మీపూర్ ఎల్బీనగర్ తదితర ఏరియాలని అభివృద్ధికి దూరంగా ఉన్నాయని ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని ఆయా డివిజన్లోని కాలనీలా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి డెవలప్ చేయాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం రాబోయే రోజుల్లో బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు.

**ఎంసిపిఐ(యు) మిడిల్ ఏరియా కన్వీనర్ గా మహబూబ్ పాష..**

వరంగల్ నగరంలోని 24 25 26 27 28 29 మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్స్ మిడిల్ ఏరియా ఎంసిపిఐ(యు) కన్వీనర్ గా మహమ్మద్ మహబూబ్ పాష ఏరియా కమిటీ సభ్యులుగా ఎస్కే హైమద్ కీర్తి శ్రీనివాస్, ఎస్.కె హాజీమ్, ఎండి అజ్మత్, ఎండి హైమత్ సయ్యద్ ఆదామ్, ఎండి ఫిరోజ్, ఎండి షేరు లతో కమిటీ ఎన్నికైనట్లు పార్టీ నగర కార్యదర్శి మాలోత్ సాగర్ ప్రకటించారు. ఆయా మున్సిపల్ డివిజన్స్ లలో సమస్యలపై సర్వే నిర్వహించి పరిష్కారానికి ప్రజా పోరాటాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నగరం సహాయ కార్యదర్శులు నర్ర ప్రతాప్ సుంచు జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# లాభాల ప్రకటనపై మౌనమేలా?

- గుర్తింపు సంఘం, యాజమాన్యం స్పందించాలి : సీఐటీయూ



**రామకృష్ణాపూర్, ఆగస్ట్ 10 (జనంసాక్షి):** లాభాల ప్రకటనపై మౌనమెందుకు వహిస్తున్నారని సీఐటీయూ నేతలు ప్రశ్నించారు. మందమర్రి ఏరియా ముఖ్య కార్యకర్తల సమావేశంలో సిఐటియు నేతలు యాజమాన్యం లాభాలను ప్రకటించకపోవడం, గుర్తింపు సంఘం దీనిపై మౌనంగా ఉండడం పై తీవ్రంగా విమర్శించారు. బ్రాంచ్ అధ్యక్షులు ఎస్.వెంకట్ స్వామి, అల్లి రాజేందర్ మాట్లాడుతూ గతంలో లాభాల ప్రకటనపై గొప్పలు చెప్పుకున్న గుర్తింపు సంఘం నాయకులు, ఇప్పుడు యాజమాన్యంపై ఒత్తిడి తేవకుండా మౌనం వహించడం సరికాదుని అన్నారు. సేఫ్టీ కమిటీల్లో అనుభవజ్ఞులకు ప్రాధాన్యం ఇవ్వాలని, నాణ్యమైన రక్షణ పరికరాలు కార్మికులకు అందించాలని వారు డిమాండ్ చేశారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో గుర్తింపు సంఘం విఫలమైందని ఆరోపించారు. వామపక్ష యూనియన్‌గా కార్మిక హక్కుల కోసం నిజాయితీగా పోరాడాలి, ఓడిన సంఘాలను విమర్శించడం మా ఉద్దేశం కాదని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వద్లకొండ ఐలయ్య, అలవాల సంజీవ్, జడల ప్రవీణ్, ఆగిడి రాజ్ కుమార్, నాగవెల్లి శ్రీధర్, ధనిశెట్టి సురేష్, బద్రి ఆదర్శ్, లింగాల రమేష్, మాహమ్మద్ తాజుద్దీన్, నాగరాజు పాల్గొన్నారు.

# రైతు బీమా కోసం పేరు నమోదు చేసుకోండి

- కొత్త రైతులు గడువులోగా నమోదు చేసుకోవాలి
- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ బ్యూరో, ఆగస్టు10 (జనంసాక్షి) 2025-26 సంవత్సరానికి అర్హులైన కొత్త రైతులు రైతు బీమా పథకంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల మునుపటి డేటాను ఈ నెల 12లోపు అధికారులు పునరుద్ధరిస్తారని, కొత్త నమోదు గడువు 13తో ముగుస్తుందని తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించి, గడువులోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కలెక్టర్ ప్రకటనలో కోరారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా



**కాసిపేట ఆగష్టు 10 (జనం సాక్షి) :** ఓరియంట్ అదాని సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికలో గెలిచేదే తమేనని గేలిసిన వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరిస్తానని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ అధ్యక్ష అభ్యర్థి శ్రీ కొక్కిరాల సత్య పాల్ రావు అన్నారు. ప్రచారంలో భాగంగా ఆదివారం పెద్ద గూడెం, అచ్యుతరావు గూడెం, నట్టు పటేల్ గూడెం, రాంపూర్ , పిసి రోడ్డులో కార్మికుల ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తూ, కార్మికులను కలిసారు. సమస్యలను అడిగి తెలుసుకుని గెలిచిన వెంటనే ఆ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మీ అమూల్యమైన ఓటు తరాజు గుర్తు మీద వేసి గెలిపించాలని కార్మికులను కోరారు..మాజీ కార్మికులు క్రిష్ణ రావు గారి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు..

# పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వీక్షించిన ఎమ్మెల్యే రేవూరి



**పరకాల, ఆగస్టు 10 (జనం సాక్షి):** జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఆదివారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఓటర్ల జాబితా తయారీలో ఎన్నికల కమిషన్ అక్రమాలపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సిద్ధం చేసిన పి పి టి(పవర్ పాయింట్ ప్రజెంటేషన్) ను జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి వీక్షించారు. ఓటర్ల జాబితా బండారాన్ని డాక్యుమెంట్లతో సహా రాహుల్ గాంధీ బయటపెట్టారని,ఈసీ అక్రమాలకు పాల్పడిందంటూ పలు ఆధారాలను రాహుల్ గాంధీ బయటపెట్టారు అని,ప్రతిపక్ష నేత ఆధారాలతో ప్రెస్ మీట్ పెట్టి ఓటర్ లిస్టులో జరుగుతున్న పొరపాట్లను దేశ ప్రజలకు వివరించినా పట్టించుకోవడం లేదని, దీనిపై కేంద్రం వెంటనేస్పందించాలన్నారు.ఇటీవల పలు రాష్ట్రాలు అసెంబ్లీ, గతేడాది లోక్‌సభ ఎన్నికల్లోనూ అనేక అక్రమాలు జరిగాయని ఆరోపించారు.ఎన్నికల ఫలితాలపై తాము పరిశోధన చేశామని రాహుల్ గాంధీ చెప్పారు. ఎగ్జిట్, ఒపీనియన్ పోల్స్‌కు భిన్నమైన ఫలితాలు వస్తున్నాయని అన్నారు. ఎన్నికలపై విశ్లేషణ, పరిశోధనలో మా అనుమానాలకు సంబంధించిన పలు ఆధారాలు బయటపడ్డాయని లోక్‌సభ ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీ ప్రకటించారు. పార్టీ ఆదేశాల ప్రకారం త్వరలోనే నియోజకవర్గంలో బూత్ కి ఇద్దరు చొప్పున ఏర్పాటు చేసి,ఓటర్ లిస్టులో ఉన్న అక్రమాలను బయటపెడతామన్నారు.

# దేశంలోనే అసమర్ధ ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్

- దివ్యాంగుల మహా గర్జన సన్నాహక సభలో మంద కృష్ణ మాదిగ

**పినపాక, ఆగస్టు 10 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాదని, ప్రతిపక్ష నాయకుడికి అసెంబ్లీకి వచ్చి అధికార పార్టీని అడిగే తీరిక లేదని ఇద్దరూ పేదలను దోచుకునే వారిని అధికార, ప్రతిపక్షాలపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణ మాదిగ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆదివారం పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో జరిగిన భారీ దివ్యాంగుల మహా గర్జన సన్నాహక్ సభకు ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని అసమర్ధ ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అని మండిపడ్డారు. ఎన్నికల హామీలు ఇచ్చిన విధంగా దివ్యాంగులకు 6000, వృద్ధులకు 4000 పెన్షన్ పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. చేయూత పింఛన్ దారులకు ఇచ్చే పింఛన్ వెంటనే పెంచి ఇవ్వాలని లేదంటే సీఎం రేవంత్ రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలన్నారు. ఏపీలోనూ సీఎం చంద్రబాబు తీవ్ర వైకల్యం గల దివ్యాంగులకు నెలకు రూ.15 వేలు ఇస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో చేసిన పోరాటాల ఫలితమే నేడు తెలంగాణలో వృద్ధులకు అమలవుతున్న 2000, దివ్యాంగులకు 4000 పెన్షన్ అన్నారు. దివ్యాంగులు, చేయూత పింఛన్‌దారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. పెన్షన్లే జీవనాధారంగా బతుకుతున్న దివ్యాంగులు, కిడ్నీ బాధితులు, కండరాల క్షీణత గలవారు తదితర అత్యంత పేదలకు చెందాల్సిన నిధులను వందల ఎకరాలున్న భూస్వాములకు రైతు భరోసాగా ఇచ్చారని ఆరోపించారు.



కేసీఆర్ మాదిరిగానే సీఎం రేవంత్ రెడ్డి సైతం పెద్దలకు దోచి పెడుతున్నారని విమర్శించారు. ఇక ముందు మోసపోవద్దన్న ఆలోచనతో దివ్యాంగుల గర్జన సభను ఆగస్టు 13న ఎల్బీ స్టేడియం వేదికగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ లోపు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కండరాల క్షీణత గలవారికి రూ.15వేలు, దివ్యాంగులకు రూ.6వేలు, వితంతువులకు రూ.4వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కండరాల క్షీణత గలవారికి ఏపీలో ఎలాంటి ముందస్తు హామీలు ఇవ్వకపోయినా తమ విన్నపంతో సీఎం చంద్రబాబు రూ.15వేలుదివ్యాంగులకు రూ.6వేలు, వితంతువులకు రూ.4వేలు ఇస్తున్నారన్నారు. కండరాల క్షీణత గలవారికి ఏపీలో ఎలాంటి ముందస్తు హామీలు ఇవ్వకపోయినా తమ విన్నపంతో సీఎం చంద్రబాబు రూ.15వేలు ఇస్తున్నారని, దాన్ని తెలంగాణలోనూ అమలు చేయాలన్నారు. లక్షలాదిమంది హైదరాబాదులో జరిగే ఈ సభకు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు వల్లే పోగు వెంకటేశ్వర్లు, తిరుపతి సోంపల్లి, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు, మండల నాయకులు, వేలాదిమంది ప్రజలు, దివ్యాంగులు, వృద్ధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

- ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేని పార్టీ కాంగ్రెస్
- ఎంపీ డీకే అరుణ

**జడ్చర్ల, ఆగస్టు 10 (జనంసాక్షి) :** బీసీ రిజర్వేషన్లపై హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ 42 శాతం రిజర్వేషన్లు పూర్తిగా బీసీలకే కేటాయించాలని, అది చేతకాక ఒక డమ్మీ తీర్మానం పంపి నింద బిజెపి పార్టీ పైన వేస్తామంటే ఊరుకోమని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. జడ్చర్ల ప్రేమ్ రంగా గార్డెన్ లో ఆదివారం నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాక సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎంపీ, బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, స్థానిక సంస్థల ఎన్నికల ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే రామచంద్ర రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను గత పది ఏళ్ళు బిఆర్ఎస్ పార్టీ మోసం చేస్తే ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఏడాది పాలనలో కాంగ్రెస్ అదే బాటలో నడుస్తుందని, అధికారంలోకి వచ్చింది మొదలు ఏ ఒక్క హామీ కాంగ్రెస్ నెరవేర్చలేక పోయిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఓటమి భయం పట్టుకుందని ఆ భయంతోనే బిజెపి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తుందన్నారు.

### గడపగడపకు తీసుకెళ్లాలి

కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రామాల్లో ప్రతి గడపగడపకు తీసుకెళ్లాలని, స్థానికంగా ఉన్న ప్రతి సమస్య పరిష్కారానికి చేస్తామని భరోసా బిజెపి నాయకులు, కార్యకర్తలు కల్పించాలని, అలాంటి వారిని ప్రజలు ఎన్నుకుంటారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు పార్టీలు చూడరని మీ పనితీరును



చూస్తారని, అందుకు ప్రతి గ్రామాల్లో స్థానిక సంస్థలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించాలన్నారు. ముందుగా జడ్చర్ల నియోజకవర్గం పెద్దాయిపల్లి లో నవోదయ విద్యాలయం ఏర్పాటుకు, జడ్చర్ల బైపాస్ కోసం కృషి చేసిన ఎంపీ డీకే అరుణను నియోజకవర్గ బిజెపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, జాతీయ కౌన్సిలింగ్ మెంబర్ పద్మజా రెడ్డి, రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు కిరణ్ కుమార్ రెడ్డి, రాజేశ్వర్, శ్రీనివాస్ రెడ్డి, బాలవర్ధన్ గౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలకృష్ణ, ముచ్చర్ల కృష్ణయ్య, సామల నర్సింహులు, పట్టణ అధ్యక్షులు అమర్నాథ్ గౌడ్, మోర్చాల నాయకులు తిరుపతి, సాహితీ రెడ్డి, బుక్క నవీన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞాన సమాజమే స్వేరోస్ లక్ష్యం



**చారకొండ,ఆగస్టు 10 (జనంసాక్షి) :** చారకొండ మండల కేంద్రంలోని ఆదివారం స్వేరోస్ ముఖ్య నాయకుల సమావేశాన్ని అచ్చంపేట నియోజకవర్గ రెడ్డపాకుల శివశంకర్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీనియర్ స్వేరోస్ నాయకులు దుబ్బ నాగేష్ మాట్లాడుతూ అణగారిన వర్గాలలో ఆత్మ గౌరవం నింపి అక్షరం, ఆర్థికం, ఆరోగ్యం, ఆత్మగౌరం లక్ష్యసాధన ధ్యేయంగా స్వేరోస్ నాయకత్వం ముందుకు సాగాలని ఆయన అన్నారు. గ్రామీణ స్థాయిలో స్వేరోస్ నాయకత్వాన్ని బరోపితం చేస్తామని ఆయన అన్నారు. సుప్రీం స్వేరో డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ చేపట్టిన జ్ఞాన సమాజ నిర్మాణమే లక్ష్యంగా స్వేరోస్ నాయకులు పనిచేయాలని ఆయన సూచించారు. త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి బూత్ క్యాంపును విజయవంతం చేసేందుకు స్వేరోస్ నాయకత్వం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అక్షరం ఆరోగ్యం ఆర్థికం ఆత్మగౌరవం రక్షంగా డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ నిరంతరం పనిచేస్తున్నారని ఆయన అడుగుజాడలో స్వేరోస్ నడవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో మండల స్వేరోస్ అధ్యక్షునిగా పసుల పాపయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఉపాధ్యక్షుడిగా ప్రధాన కార్యదర్శిగా కోశాధికారిగా తదితరులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలకపల్లి టౌన్ ఉపాధ్యక్షులు బల్మూరు మల్లేష్, అర్జున్, రాంబాబు, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యలపై చలో ఇందిరపార్క్

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 10 (జనం సాక్షి) :** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ,పెన్షనర్లకు తీవ్రంగా నష్టం కలిగిస్తున్నాయనీ వాటిని పరిష్కరించాలని చలో ఇందిరా పార్క్ ఈనెల 11న బయలుదేరుతున్నట్లు జోగులాంబ గద్వాల జిల్లా పెన్షనర్ల సంఘం నాయకులు అన్నారు.సిపిఎస్ పేరుతో ఉద్యోగులనూ,ఫైనాన్స్ యాక్ట్ 2025 పేరుతో పెన్షనర్లనూ వీడదీసి డివైడ్ అండ్ రూల్ పాలసీతో ముందుకుసాగుతున్నాయనీ,ఈ హెచ్ ఎస్ పై నగదు రహిత చికిత్స లేక, కోర్టు మెట్లెక్కినా రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఒకే జి ఓ,డీఎస్సీ ద్వారా నియమితులై, రాష్ట్రం వీడిపోయిన, ఆంధ్రప్రదేశ్ లో జీవో ఎంఎస్ నెంబర్ 28, 1-3-2019ప్రకారం ఇచ్చారనీ,విషయమై ఎన్నో సార్లు,ఎన్నో కమిటీలకూ మొరపెట్టుకున్నా, ఉత్తమ్ మాటలు ఉత్తవే, భట్టీమాటలు వట్టివే, రేవంత్ మాటలురెచ్చ గొట్టేవే అన్నట్లున్నదనీ, వీరిపాలనా,దీంతో విసిగిపోయిన పెన్షనర్ల సంఘాల సమన్వయ కమిటీ గత్యంతరంలేక, తప్పనిసరి పరిస్థితుల్లో ఛలో ఇందిరా పార్క్, పెన్షనర్ల మహాధర్నా కూ పిలుపు నిచ్చిందనీ, మనమంతా ఔరేక్ ద్ధక్కావేస్తే, పెన్షనర్ల సమస్యలతో పాటు 398/-స్పెషల్ టీచర్లకు నోషనలింఇంక్రిమెంట్లూ పక్కా, ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగుదమనీ ,ఛలో ఇందిరాపార్క్, పెన్షనర్ల మహాధర్నా జయప్రదం చేయాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ బాబు,కార్యదర్శి శంకర్ ప్రభాకర్,పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇక్బాల్ పాషా,ధరణి హనుమంతు,కె.ప్రకాష్,ఎండి సుభాన్, 398 స్పెషల్టీచర్స్, పెన్షనర్ల తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతిని కాపాడుకుందాం

- పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం
- యువకుడు సైకిల్ యాత్ర

**చారకొండ, ఆగస్టు 10 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లా మైదుకూరు మండలం బస్వాపురం గ్రామానికి చెందిన యువకుడు కార్తీక్ రెడ్డి ఫిబ్రవరి 6 - 2025 న తన ఇంటి నుండి సేవ్ ట్రీ సేవ్ ఎర్త్ అనే నినాదంతో సైకిల్ యాత్ర చేపట్టాడు. సైకిల్ యాత్ర చేపట్టిన కార్తిక రెడ్డి చారకొండకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.... మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించుకోవడం కోసం తన సైకిల్ యాత్ర కొనసాగుతుందని అన్నారు. మొక్కలు కాలుష్య నివారణకు కార్యదర్శిగా నిలుస్తాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించుకోవాలని ఆయన అన్నారు. మానవాళి మనగడకు చెట్లు చాలా అవసరమని




ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, గోవా, ఒడిశా రాష్ట్రాలలో సైకిల్ యాత్ర కొనసాగించి 4200 కిలోమీటర్లు పూర్తి చేశానని ఇంకా ఇండియాలోని మిగతా రాష్ట్రాలలో తిరిగి పర్యావరణపై ప్రజల్లో చైతన్యం పరిచి తన సైకిల్ యాత్రను ముగిస్తానని తెలిపారు. చారకొండ నుంచి నల్గొండ జిల్లా దేవరకొండ వైపు తన సైకిల్ యాత్ర కొనసాగించారు.

# పిడుగుపడి పదిమందికి స్వల్ప గాయాలు

**మల్దకల్, ఆగస్టు 10 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం ఆదివారం పెద్దొడ్డి గ్రామానికి చెందిన నల్లారెడ్డి వ్యవసాయ పొలంలో చీని పండ్లు తెంపుతుండగా పిడుగు పడి ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి.ఐజ మండలం ఉప్పల గ్రామానికి చెందిన కూలీలు చరణ్ విజయ్,భీమేష్ పొలంలో పండ్లను తెంపుతుండగా సంఘటన చోటు చేసుకుంది. మిగతా ఏడు మంది కూలీలు మల్లయ్య, రఫీ,తిమోతి,రమేష్, లక్ష్మి,శ్రీకాంత్,సుజాతలకు స్వల్ప గాయాలు అయ్యాయి. మల్దకల్ తాసిల్దార్ ఝాన్సీ రాణి,జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్షావలి చారి, నల్లారెడ్డిఆసుపత్రికి సందర్శించి వారిని పరామర్శించారు.




వీరిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో గద్వాల ఏరియా ఆసుపత్రిలో గాయాలైన ముగ్గురికిచికిత్స చేసి పంపించారు.

# నేడు ఈడీ విచారణకు నటుడు రానా

**హైదరాబాద్, ఆగస్టు 10 (జనంసాక్షి) :** బెట్టింగ్ యాప్ ప్రమోషన్ల కేసులో సోమవారం నటుడు రానా ఇడి విచారణకు హాజరుకానున్నారు. నటులు, యాంకర్లు, సోషల్ మీడియా ఇన్ఫ్యూయెన్సర్లు, టీవీ హెూస్ట్‌లతో సహా 29 మందిపై అక్రమ బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహించినందుకు ఇడి కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు



జంగ్లీ రమ్మీ, ఎ23, జీట్‌విన్, పారిమ్యాచ్, టోటస్365 వంటి ప్లాట్ ఫామ్‌లకు చెల్లించిన ప్రమోషన్లపై నమోదైంది. 1867 పబ్లిక్ జూదం చట్టం కింద పంజాగుట్ట, మియాపూర్, సైబరాబాద్, సూర్యాపేటలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలలో ఐదు వేరువేరు ఎఫ్ఐఆర్‌ను నమోయ్యాయి. ఈ కేసులో మనీలాండరింగ్ జరిగిందనే కోణంలో ఇడి అధికారులు దృష్టి సారించారు. ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఇసిఐఆర్) నమోదు చేసింది. ఇందులో బాగంగా కేసులో ఉన్న నిందితులను వరుసగా ఇడి విచారిస్తోంది. ఇప్పటికే ఈ కేసులో నటులు ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండలను విచారించగా, సోమవారం దగ్గుబాటి రానా విచారణకు హాజరుకానున్నారు. ఈ మేరకు ఇప్పటికే విచారణకు హాజరుకావాలంటూ రానాకు ఇడి అధికారులు నోటీసులు జారీ చేశారు. కాగా, ఇదే కేసులో 13వ తేదీన నటి మంచు లక్ష్మివిచారణకు హాజరు కానున్నారు.

## గ్రామీణ కళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం తోడ్పాటు



**కోదాడ, ఆగస్టు 10 (జనం సాక్షి) :** చిరంజీవి అభిమానులు రక్తదానం ,నేతదానం వంటి కార్యక్రమాలతో పాటు సామాజిక, సంస్కృతిక రంగాలలో కూడా ముందుండటం అభినందించదగ్గ విషయమని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి అన్నారు. ఆదివారం పద్మభూషణ్, మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా జరుగు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కోదాడలో కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్రస్థాయి పాటల పోటీలను సూర్యాపేట జిల్లా చిరంజీవి యువత గుండెపంగు రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని పాటలు పోటీలో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి మాట్లాడుతూ కళాకారులకు, కళలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంచి గుర్తింపు ఇస్తుందని, వారికి ఎటువంటి అవసరం ఉన్నా అండగా నిలబడుతుందని గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం ఉన్న కళాకారులను గుర్తించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణయతలుగా వ్యవహరించిన ప్రముఖ వాగ్గేయకారులు సినీ గేయ రచయిత మాస్టర్జి, సినీ మ్యూజిక్ డైరెక్టర్ రవి కళ్యాణ్ గాలి శ్రీనివాస్ నాయుడు, బాదే రాము, బలుగూరి స్నేహ, డాక్టర్.నందిపాటి శ్రీ ప్రియ, మాతంగి శైలజ, ఫ్లూ న్యాయ నిర్ణీతలుగా వ్యవహరించారు . ఈ కార్యక్రమంలో అఖిలభారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ బైరు వెంకన్న గౌడ్, కిడ్స్ ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ నీలా సత్యనారాయణ ,, టీపీసీసీ డెలిగేట్ లక్ష్మీనారాయణ రెడ్డి, సూర్యాపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, తెర సాంస్కృతిక మండలి అధ్యక్షులు వేముల. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



**నంగునూర్, ఆగస్టు 10 (జనం సాక్షి) :** నంగునూరు మండలంలోని పలువురు కార్యకర్తల కుటుంబాలను ఆదివారం రోజు మాజీ మంత్రి ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు పరామర్శించారు. కోనాయిపల్లి గ్రామానికి పార్టీ సీనియర్ నాయకులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదం లో తీవ్ర గాయాలు కాగ అదేవిధంగా వెంకటాపూర్ గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త నక్క లింగారెడ్డి ఇటీవల గుండె పోటుతో మృతి చెందగా అదేవిధంగా పాలమాకుల గ్రామానికి చెందిన రంగు రమేష్ తండ్రి ఇటీవల అనారోగ్యం తో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియ చేస్తూ , వారి కుటుంబాలకు అన్ని విధాలు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమం లో మండల బిఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి ,ఎడ్ల సోమిరెడ్డి , దువ్వల మల్లయ్య ,రాగుల సారయ్య, లింగం గౌడ్, కోల రమేష్ గౌడ్, సంతోష్ రెడ్డి, రవీందర్ రెడ్డి తదితరులు నాయకులు పాల్గొన్నారు.

# దామోదర సంజీవయ్యనగర్‌లో ఘనంగా బోనాల పండుగ

**చంపాపేట్, ఆగస్టు 10 (జనం సాక్షి) :** శ్రావణ మాసం బోనాల ఉత్సవాలతో నగర వీధులన్నీ ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతున్నాయి. యాకుత్‌పురా నియోజకవర్గంలోని సైదాబాద్ మండలం, సంతోష్ నగర్ ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని దామోదర సంజీవయ్య కాలనీలో ఆదివారం బోనాల పండుగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జి సామ సుందర్ రెడ్డి ముందుగా శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో పవిత్రమైన బోనం సమర్పించి, ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సు, రాష్ట్రాభివృద్ధి కోసం అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం ఈదమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని భక్తుల మధ్య పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ఆలయ ప్రాంగణం పూలతోరణాలు, మామిడి ఆకుల అలంకరణలు, రంగురంగుల దీపాలతో అద్భుతంగా అలంకరించబడింది. మహిళలు సంప్రదాయ వేషధారణలో బోనాలు మోసి, నైవేద్యాలు సమర్పించగా, యువతులు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మేళాలు, దప్పుకట్టలు, భక్తుల నృత్యాలతో వీధులన్నీ పండుగ వాతావరణంలో మునిగిపోయాయి. టెంపుల్ కమిటీ చైర్మన్ వరికుప్పల బలరాంతో పాటు శ్రీనివాస్, వెంకటేష్, చందర్, కాశీరాం, కృష్ణయ్య, గోవిందు, బక్కయ్య, రాములు, ఇద్దయ్య, కృష్ణ తదితరులు సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేశారు. సామ సుందర్ రెడ్డి



మాట్లాడుతూ, "బోనాలు తెలంగాణ సంస్కృతి ప్రతీక. భక్తి, సంప్రదాయం, ఐక్యతకు ఈ పండుగ చిహ్నం. ప్రతి ఇంటా శాంతి, సౌభాగ్యం కలగాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నాను" అన్నారు. పండుగ సందర్భంగా అన్నప్రసాదం పంపిణీ చేయడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించబడగా, భక్తుల హర్షధ్వానాలతో దామోదర సంజీవయ్య నగర్ ఆధ్యాత్మిక కాంతులతో మెరిసిపోయింది.

# ఘనంగా హెూప్ ఫౌండేషన్ 10వ వార్షికోత్సవం

**శేరిలింగంపల్లి, ఆగస్టు 10 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లిలో హెూప్ ఫౌండేషన్ 10వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాదాపూర్ వార్డ్ కార్యాలయంలో స్థానికులకు టిఫిన్ బాక్సులు, టిఫిన్ బ్యాగులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పదవ ఫౌండేషన్ వార్షిక వేడుకల కేకును కొండా విజయ్ కుమార్ తన చేతుల మీదుగా కట్ చేసి ప్రతినిధులకు, ఆహుతులకు పంచిపెట్టారు. ఇందులో భాగంగా హెూప్ ఫౌండేషన్ ప్రతినిధులకు పలువురు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పరిసర ప్రాంతాల పారిశుద్ధ్య కార్మికులకు చీరలను, బట్టలను చైర్మన్ కొండా విజయ్ కుమార్ తన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజ హితంకోసం, నిరుపేద వర్గాల అభ్యున్నతి కోసం తోచినంత సేవ చేయాలనే అలోచనతో 2016 లో హెూప్ ఫౌండేషన్ పేరుతో సేవా సంస్థను ఏర్పాటు చేసినట్లు ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ తెలిపారు. హెూప్ ఫౌండేషన్ 10వ వార్షిక దినోత్సవ వేడుకలు నిత్యం సమాజ శ్రేయస్సుకోసం, ఆరోగ్య మెరుగుదలకోసం పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహిస్తూ ఎనలేని





సేవలందిస్తున్న పారిసిద్ధ కార్మికుల సమక్షంలో నిర్వహించడం గొప్ప అనుభూతినిచ్చిందన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా క్రీడాకారులకు, పేద విద్యార్థులకు, వైద్య సమస్యలు ఉన్న పేద వారికి సహాయం చేస్తున్నట్లు తెలిపారు. విద్యల్లో రాణిస్తున్న విద్యార్థులకు, పేద కుటుంబాలకు కుట్టు మిషన్ల తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ విజయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్యం కార్మికులతో పాటు లయన్స్, హెూప్ సభ్యులు, అపర్ణ, మధుసూధన్ రెడ్డి, సందీప్, బర్క మల్లేశ్ యాదవ్, విష్ణుమూర్తి, అవేజ్, స్థానిక జిహెచ్ఎంసి సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, అజారుద్దీన్, లవ్ కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.




బంగారం ధరలు గత కొంత కాలంగా పెరుగుతూనే ఉన్నాయి. ఈ మధ్య కాలంలో గోల్డ్ రేటు మరింత పెరిగి పసిడి ప్రియులను అవాక్కయ్యాలా చేసింది. స్టాక్ మార్కెట్లు కుప్ప కూలుతుంటే.. బంగారం రేటు మాత్రం ఆకాశాన్నంటుతోంది. దీనికి ప్రధాన కారణం దీనికి ప్రధాన కారణం పెట్టుబడిదారులు.. గోల్డ్ మీద ఎక్కువగా ఇన్వెస్ట్ చేయడమే అని నిపుణులు భావిస్తున్నారు

# బంగారం ధరల మోత.. కారణాలివే..

**జనంసాక్షి:**బంగారం ధరలు గత కొంత కాలంగా పెరుగుతూనే ఉన్నాయి. ఈ మధ్య కాలంలో గోల్డ్ రేటు మరింత పెరిగి పసిడి ప్రియు లను అవాక్కయ్యాలా చేసింది. ఈ స్థాయిలో కనకం ధరలు పెరగడానికి కారణం ఏమిటనే వివరాలు ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరింత పెంచిన సుంకాలు చాలామంది పెట్టుబడిదారుల్లో భయాన్ని రేకెత్తించింది. స్టాక్ మార్కెట్లు కుప్ప కూలుతుంటే.. బంగారం రేటు మాత్రం ఆకాశాన్నంటుతోంది. దీనికి ప్రధాన కారణం పెట్టుబడిదారులు.. గోల్డ్ మీద ఎక్కువగా ఇన్వెస్ట్ చేయడమే అని నిపుణులు భావిస్తున్నారు.2025 ఆగస్టు 01న గరిష్టంగా రూ. 210 తగ్గి రూ.99,820 (10 గ్రా 24 క్యారెట్స్) వద్ద నిలిచిన గోల్డ్ రేటు.. ఆ తరువాత ఆగస్టు 08 నాటికి రూ. 1,03,310 కు చేరింది. దీన్నిబట్టి చూస్తే పసిడి ధర ఈ మధ్య కాలంలోనే రూ. 3490 పెరిగింది. ఇది బంగారం ధరలు ఏ స్థాయిలో పెరుగుతున్నాయి తెలుపడానికి నిదర్శనం.బంగారు కడ్డీలపై అమెరికా సుంకాలు, బలహీనమైన అమెరికా డాలర్, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు తగ్గింపుపై మార్కెట్ అంచనాలు, ఆర్థిక అనిశ్చితి మధ్య పెరుగుతున్న ప్రపంచ డిమాండ్ వంటివన్నీ గోల్డ్ రేటు పెరగడానికి కారణమవుతున్నాయి.అస్థిర ఆర్థిక పరిస్థితుల్లో బంగారం సురక్షితమైన ఆస్తి. కాబట్టి గోల్డ్ కొనుగోలు చేసే పెట్టుబడిదారుల సంఖ్య కూడా పెరిగింది. ఓ వైపు శ్రావణమాసం.. మరోవైపు



వస్తున్న పండుగ సీజన్. ఇవన్నీ కూడా బంగారం ధరలను మరింత పెంచే అవకాశం ఉంది. 2005లో రూ. 7000 వద్ద ఉన్న గోల్డ్ రేటు.. 2025లో రూ. 100000 దాటేసింది. దీన్నిబట్టి చూస్తే దశాబ్దంలో రేటు ఎంతలా పెరిగిందో అర్థం చేసుకోవచ్చు.

# బెంగుళూరుకు బైబై..

## ఐటీ సిటీలో ఇళ్లు అమ్మేస్తున్న టెకీలు.. మైసూరుకు మకాం..





**బెంగ ళూరులో పెరుగుతున్న ప్రాపర్టీ ధరలు, అధ్వానంగా మారుతున్న ట్రాఫిక్, క్షీణిస్తున్న గాలి నాణ్యత కారణంగా ఐటీ ఉద్యోగులు, టెక్ నిపుణులు మైసూరుకు మకాం మారుస్తున్నారు .ఇక్కడ ఇళ్లు అమ్మేసి.. అక్కడ కొంటున్నారు.**

**జనంసాక్షి:**దేశ ఐటీ రాజధానిగా ప్రసిద్ధి చెందిన బెంగళూరులో పెరుగుతున్న ప్రాపర్టీ ధరలు, అధ్వానంగా మారుతున్న ట్రాఫిక్, క్షీణిస్తున్న గాలి నాణ్యత కారణంగా ఐటీ ఉద్యోగులు, టెక్ నిపుణులు మైసూరుకు మకాం మారుస్తున్నారు .ఇక్కడ ఇళ్లు అమ్మేసి.. అక్కడ కొంటున్నారు. ఒకప్పుడు రిటైర్మెంట్ స్వర్గధామంగా పేరొందిన మైసూరు ఇప్పుడు నిశ్శబ్ద జీవనశైలిని కోరుకునే హైబ్రిడ్, రిమోట్ వర్కర్లకు ఇష్టమైన గమ్యస్థానంగా మారుతోంది.బెంగళూరు-మైసూరు ఎక్స్ప్రెస్ వే, ప్రతిపాదిత రాపిడ్ రైల్ ట్రాన్సిట్ సిస్టం (ఆర్ఆర్టీఎస్) ద్వారా మెరుగైన కనెక్టివిటీ రెండు నగరాల మధ్య ప్రయాణాన్ని మరింత సులభతరం చేసింది. ఈ మౌలిక సదుపాయాల అప్ గ్రేడ్ లు బెంగళూరు టెక్ వ్యవస్థతో సంబంధాలను కొనసాగిస్తూనే మైసూరులో స్థిరపడటానికి ఐటీ ఉద్యోగులను ప్రోత్సహిస్తున్నాయి. ముఖ్యంగా వర్క్ ఫ్రమ్ హోమ్, హైబ్రిడ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులు బెంగళూరులోని తమ ప్రాపర్టీలను అమ్మేసి మైసూరులో కొంటున్నారు.మైసూరులోని సరస్వతీపురం, జయలక్ష్మీపురం, హెబ్బాళ్ వంటి ప్రాంతాల్లో నివాస డిమాండ్ పెరుగుతోంది. 2బీహెచ్కే ఫ్లాట్ల ప్రాపర్టీ ధరలు రూ.60 లక్షల నుంచి రూ.కోటి వరకు పలుకుతున్నాయి. నెల వారీ అద్దెలు రూ.15,000 నుంచి రూ.45,000 వరకు ఉన్నాయి. ఉత్తర మైసూరు ముఖ్యంగా హెబ్బాళ్ పారిశ్రామిక కారిడార్ చుట్టుపక్కల ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్న ఐటీ, నివాస కేంద్రంగా ప్రాచుర్యం పొందుతున్నాయి.రింగ్ రోడ్డు, పెరిఫెరల్ జోన్లలో రూ.50-70 లక్షల మధ్య ధర కలిగిన ముడా ఆమోదం పొందిన ప్లాట్లపై ఇన్వెస్టర్లు కన్నేశారు. కొన్ని ప్రాంతాలలో వార్షిక పెరుగుదల 15-20% గా నివేదికలు చెబుతున్నాయి. విజయనగర్ స్టేజ్ 2, 3లోని లేఅవుట్లు ప్లాట్ల ఇళ్లకు ఆసక్తిని ఆకర్షిస్తున్నాయి. ఈ ట్రెండ్కు అనుగుణంగా డెవలపర్లు స్పందిస్తున్నారు. మైసూరులో 10 ఎకరాలను అభివృద్ధి చేయడానికి బ్రిగేడ్ గ్రూప్ రూ .225 కోట్ల జాయింట్ డెవలప్మెంట్ అగ్రిమెంట్పై సంతకం చేయగా, సెంచరీ రియల్ ఎస్టేట్ ఈ ఏడాది చివర్లో ప్రణాళికాబద్ధ అభివృద్ధిని ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తోంది. మైసూరు సాంస్కృతిక వారసత్వాన్ని ఆధునిక మౌలిక సదుపాయాలతో సమతుల్యం చేస్తుండటంతో ఇది బెంగళూరు పట్టణ విస్తరణకు ఆచరణీయమైన ప్రత్యామ్నాయంగా కనిపిస్తుంది.

## ఇలా జీతం చేతికి.. అలా రాజీనామా..

- వచ్చిన ఐదు నిమిషాలకే ఉద్యోగి రాజీనామా




**జనంసాక్షి:**ఉద్యోగం దొరక్క కొంతమంది బాధపడుతుంటే.. ఉన్న ఉద్యోగంలో ఇమడలేక కొందరు రాజీనామాలు చేస్తున్నారు. ఉద్యో గంలో చేరిన కేవలం ఒక నెల తరువాత ఒక ఉద్యోగి రాజీనామా చేసిన సంఘటన సోషక్ నీడియాలో వైరల్ అవుతోంది.హ్యూమన్ రిసోర్స్ ప్రొఫెషనల్ ప్రియవర్షిణి చేసిన లింక్డ్ఇన్ పోస్టులో.. ఉద్యోగంలో చేరిన ఒక నెల తర్వాత రాజీనామా చేసిన ఉద్యోగి గురించి వెల్లడించింది. ఉదయం 10:00 గంటలకు జీతం అందుకున్న ఉద్యోగి.. తన రాజీనామాను ఉదయం 10:05 గంటలకు ఈమెయిల్ ద్వారా పంపినట్లు వెల్లడించింది. ఇటువంటి చర్య మంచిదేనా?, ఇది న్యాయంగా ఉందా? అంటూ హెచ్ఆర్ ప్రశ్నించారు.నువ్వు ఇక్కడే ఉండాలి అనుకోకపోతే.. ఉద్యోగంలో ఎందుకు చేరాలి?, ప్రాసెస్ ప్రక్రియలను ఎందుకు పూర్తి చేయాలి?, ట్రైనింగ్ సమయంలో ఎందుకు మౌనంగా ఉండాలి? అని కూడా హెచ్ఆర్ ప్రశ్నించింది. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.జీతం వచ్చిన వెంటనే.. రాజీనామా చేయడం వెనుక ఉన్న ఉద్దేశ్యం.. జవాబుదారీతనం లేకపోవడం అని కొందరు చెబుతున్నారు. ఆకస్మికంగా ఉద్యోగానికి రాజీనామా చేయడం ఏ మాత్రం సమంజసం కాదని ఇంకొందరు చెబుతుంటే.. ఉద్యోగం నచ్చలేదేమో అని మరికొందరు సమర్థిస్తున్నారు.

## చైనా టెక్ దిగ్గజం హువావే సంచలనం

### ఈ బ్యాటరీ వచ్చిందంటే టెస్లాకు ముప్పే..



చైనా టెక్ దిగ్గజం హువావే ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) బ్యాటరీ టెక్నాలజీలో సంచలనం సృష్టించబోతోంది. తక్కువ సమయంలో ఛార్జ్ అయ్యే, ఎక్కువ రేంజ్ ఇచ్చే బ్యాటరీని రూపొందిస్తున్న ఈ కంపెనీ అందులో పురోగతిని సాధించినట్లు తెలుస్తోంది.బీజీఆర్ రిపోర్ట్ ప్రకారం.. ఈ కొత్త సాలిడ్-స్టేట్ బ్యాటరీ 1,800 మైళ్ళు (సుమారు 3,000 కిలోమీటర్లు) డ్రైవింగ్ పరిధిని అందించగలదు. ఐదు నిమిషాల్లోనే 10% నుండి 80% వరకు రీఛార్జ్ అవుతుంది. ఇది అందుబాటులోకి వస్తే టెస్లా వంటి దిగ్గజాల ఆధిపత్యానికి చావు తప్పదని పరిశ్రమ విశ్లేషకులు భావిస్తున్నారు. 2023లో దాఖలు చేసిన పేటెంట్ ప్రకారం.. ఈ బ్యాటరీ అధిక-సాంద్రత కలిగిన సాలిడ్-స్టేట్ ఆర్కిటెక్చర్ను ఉపయోగిస్తుంది. మెరుగైన భద్రత, దీర్ఘ మన్నిక, అల్ట్రా-ఫాస్ట్ ఛార్జింగ్ను అందిస్తుంది. సాధారణంగా ఎలక్ట్రిక్ వాహనాల విషయంలో రెండు ఇబ్బందులు ఉంటాయి. అవి తక్కువ రేంజ్, ఛార్జింగ్కు ఎ?క్కువ సమయం పట్టడం. ఈ బ్యాటరీ కమర్షియల్గా పూర్తిగా అందుబాటులోకి వస్తే ఇక రేంజ్ గురించి ఆందోళనలు అక్కర్లేదు. ఛార్జింగ్ సమయాలను కూడా గణనీయంగా తగ్గిస్తుంది. టెస్లా అత్యంత అధునాతన మోడళ్లు గరిష్టంగా 400-500 మైళ్ల రేంజ్ను అందిస్తున్నాయి. వీటిని ఛార్జ్ చేయడానికి 15-30 నిమిషాలు పడుతోంది. హువావే ప్రోటోటైప్ పనితీరు, సౌలభ్యం రెండింటిలోనూ పురోగతిని సూచిస్తుంది. దీంతో బ్యాటరీ ఆవిష్కరణ కేంద్రాన్ని అమెరికా నుంచి చైనాకు మార్చే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.అయినప్పటికీ, ఈ బ్యాటరీ ఇంకా అభివృద్ధి దశలో ఉంది. వాస్తవ ప్రపంచ పనితీరు ప్రయోగశాల ఫలితాలకు భిన్నంగా ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. "ఇది ఒక ఆశాజనక దశ, కానీ భారీ ఉత్పత్తి, వాహనాలలో ఇంటిగ్రేషన్ నిజమైన పరీక్ష" అని బెంగళూరుకు చెందిన ఈవీ పరిశోధకుడు డాక్టర్ అనిల్ మెహతా అన్నారు.ఈ బ్యాటరీని ఎప్పుడు లాంచ్ చేసేదీ, ఏ వాహనంతో భాగస్వామ్యాన్ని ఏర్పరచుకునేది హువావే ఇంకా వెల్లడించలేదు. కానీ ఇలాంటి బ్యాటరీ రాబోతోందన్న వార్తలు ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తించాయి. ముఖ్యంగా ఈవీ మౌలిక సదుపా యాలు వేగంగా విస్తరిస్తున్న భారత్ వంటి మార్కెట్లలో మరింత చర్చనీయాంశంగా మారాయి.

### గుడ్ల ధరలు

హైదరాబాద్ ₹ 4.60
వరంగల్ ₹ 4.62

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్
₹ 94,450 (22 క్యారెట్లు)
₹ 1,03,040 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,27,000

# భారత్తో పోరు... పాక్కు చావు దెబ్బ!



**జనంసాక్షి:**దాయాది దేశం పాకిస్తాన్కు భారత్ కారణంగా గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్ తీసుకున్న చర్యలు, నిర్ణయాలు వల్ల ఆ దేశానికే ఊహించని షాక్ తగిలింది ఈ కారణంగా కేవలం రెండు నెలల కాలంలో పాక్కు ఏకంగా రూ.1,240 కోట్ల నష్టం వాటిల్లినట్టు డాన్ పత్రిక ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ అధికారిక ప్రకటనను ఉటంకిస్తూ నివేదించింది. ఇంతకీ ఏం జరిగిందంటే..పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాకిస్తాన్ మధ్య చోటుచేసుకున్న దౌత్యపరమైన ఉద్రిక్తతల్లో.. భారత్ పలు ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేయడంతో భారత్పై కక్షగట్టిన పాక్.. తన గగనతలాన్ని మూసివేసింది. భారత విమానాలు తమ గగనతలం మీదుగా వెళ్లకుండా పాక్ ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ నిర్ణయంతో దాయాదికే భారీ నష్టం ఎదురైంది. ఏప్రిల్ 24 నుంచి జూన్ 20 వరకు పాక్ తమ గగనతలాన్ని మూసివేయడంతో దాదాపు రూ.1240కోట్లు(భారత కరెన్సీ) నష్టం వాటిల్లిందని పాక్ ఎయిర్పోర్ట్స్ అథారిటీ పేర్కొన్నట్లు తెలుస్తోంది. భారతపై ఆంక్షల నేపథ్యంలో రోజుకు 100-150 విమానాలపై ప్రభావం పడిందని తెలిపింది.దీని కారణంగా విమానాల రాకపోకలు 20శాతం తగ్గిపోయాయని వెల్లడించింది. ఫలితంగా పాక్ గగనతలాన్ని వినియోగించుకున్నందుకు భారత విమానాలపై విధించే ఛార్జీలపై వచ్చే ఆదాయంపై తీవ్ర ప్రభావం పడినట్లు వివరించింది. మరోవైపు.. ఈ ఆంక్షలను ఆగస్టు 24 వరకు పొడిగించారు. దీనికి ప్రతిగా భారత్ కూడా పాక్ విమానాలకు తమ గగనతలాన్ని మూసివేసింది. పహల్గాంలో ఉగ్రదాడి ఘటనపై దేశమంతా ఆందోళన వ్యక్తమైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఉగ్రవాదులను పోషిస్తున్న పాక్పై భారత్ కఠిన చర్యలు తీసుకుంది. అందులోభాగంగా సింధుజలాల ఒప్పందాన్ని నిలిపివేయడంతోపాటు పాక్ పౌరులు తక్షణమే భారత్ను విడిచివెళ్లాలని ఆదేశించింది. అనంతరం భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టి.. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్లో ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసింది. దాదాపు 100 మంది ఉగ్రవాదులను హతమార్చింది.

## ఉత్తరకాశీ ఉపద్రవం.. పాండవుల శివాలయం మాయం!

నిజానికి ధరాలి ఎప్పుడూ పేరొందిన పర్యాటక ప్రదేశం కాదు. అయితే అటువైపుగా రాకపోకలు సాగించే యాత్రికులకు మాత్రం బాగానే తెలుసు. గౌముఖ్-తపోవన్ లేదా లామా టాప్కు వెళ్లే మార్గంలో ట్రెక్కర్లు దాని గుండానే వెళతారు.అయితే ఇప్పుడు ధరాలి అనే పేరు దేశమంతా మారుమోగడానికి ఓ దురదృష్టకర ఉపద్రవం కారణమైంది.అప్పుడెప్పుడో 19వ శతాబ్దం మధ్యలో, ఉత్తరకాశీకి సమీపంలోని హర్సిల్లో స్థిరపడిన బ్రిటిషర్ ఫ్రెడరిక్ "పహాడి" విల్సన్, ఆపిల్ తోటలు ఎర్ర రాజ్మా వ్యాపారాన్ని ఈ ప్రాంతానికి పరిచయం చేశాడు. అది స్థానిక ఆర్థిక వ్యవస్థను సమూలంగా మార్చింది. అలా నేడు, ధరాలి ఆపిల్ పండ్లు ఉత్తర భారతదేశం అంతటా సరఫరా అవుతున్నాయి. కానీ గత వారం, ఈ తోటలను పోషించిన టెర్రస్లు విరిగిపోయాయి. వాటి రవాణాకు వాడిన ఫుట్బ్రిడ్జిలు మాయమయ్యాయి. అనేక అందమైన ఇళ్లు అర్ధభాగాలే మిగిలాయి. కుటుంబాలు తమ భూమి అడవిలో కలిసిపోవడాన్ని కన్నీళ్లతో చూశాయి.హర్సిల్ నుంచి కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉత్తరాఖండ్ కొండలలోని ప్రశాంతమైన పర్వత గ్రామాన్ని ఖీర్ గడ్ నది అకస్మాత్తుగా ఉప్పొంగి ముంచేసింది. ఇళ్ళు, తోటలు సహా మరెన్నో జ్ఞాపకాలను తుడిచేసింది. అందులో కల్ప కేదార్ ఆలయం కూడా ఉంది. దీనిని పాండవులు నిర్మించారని స్థల పురాణం చెబుతోంది. కాలభైరవుని ముఖంతో చెక్కబడిన ఈ నిర్మాణం, 1900ల ప్రారంభంలో ఈ మందిరాన్ని హిమనీ నదుల మార్పు పూడ్చిపెట్టింది. అయినప్పటికీ కల్ప కేదార్ ఆలయ గోపురం స్పష్టంగా కనిపించేది తాజా వరదతో ఆ గోపురం కూడా అదృశ్యమైంది. ఇది ఆ ప్రాంత వాసుల్ని కలచివేసింది. ధరాలి మాజీ గ్రామ ప్రధాన్ మనోజ్ రాణా మాట్లాడుతూ 'ఇది కేవలం వరద కాదు. ఇది మా గ్రామ హృదయాన్ని చీల్చేసింది' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.స్థానికులకు, కల్ప కేదార్ కేవలం ఒక శిల కాదు. ఇది దైవిక రహస్యాన్ని కలిగి ఉంది. ఈ ఆలయం వెలికితీత కోసం 1980లలో అనేక ప్రయత్నాలు చేసినా భూమి నీటి పొరల క్రింద తరతరాలుగా దాగి ఉన్న శివలింగం పూర్తిగా వెలుగు చూడలేదు. పురాణాల ప్రకారం, శివుడు పాండవుల పాపాలను వదిలించుకోవడానికి నిరాకరించి హిమాలయాలలో చెల్లాచెదురుగా విస్తరించాడు. అందుకే కేదార్నాథ్ లాగానే కల్ప కేదార్ కూడా ఆ శకలాలలో ఒకటిగా భావిస్తారు. ధరాలి అధికారికంగా పంచ కేదార్ తీర్థ మార్గంలో లేకపోయినా, గ్రామస్తులు కల్ప కేదార్ను వాటితో ఆధ్యాత్మికంగా ముడిపడి ఉందని విశ్వసిస్తారు.

## ప్రియుడ్ని ఇంటికి పిలిచి.. దారుణంగా హత్య చేసిన మహిళ!

**సాంభాల్:** వివాహేతర సంబంధం కారణంగా ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలోని సాంభాల్లో మరో హత్యోందంతం వెలుగు చూసింది. నైతికత మరిచి వివాహేతర సంబంధం కొనసాగించడమే కాకుండా ప్రియుడ్ని పక్కా పథకం ప్రకారం అడ్డు తొలగించుకునే యత్నం చేసింది ఓ మహిళ, ఆ వ్యక్తిని ఇంటికి పిలిచి స్క్రూ డ్రైవర్, బీపట్టకారు సాయంతో హత్య చేసిన ఉదంతం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.45 ఏళ్ల అనిష్ అనే వ్యక్తికి సితార అనే మహిళతో వివాహేతర సంబంధం ఉంది. ఈ క్రమంలోనే అతని వద్ద నుంచి రూ. 7 లక్షలను సితార తీసుకుంది. ఆ సొమ్మును ఇవ్వాలని అనిష్ పదే పదే అడగడంతో సితార ప్రణాళిక రచించింది. అప్పు తీసుకున్న విషయం భర్త రాయిస్ అహ్మద్కు కూడా తెలిసినదే కావడంతో హత్యా రచన అనేది ఇద్దరూ కలిసే చేశారు. అనిష్ను ఇంటికి పిలిచింది సితార. ఇంటికి వచ్చిన తర్వాత అతన్ని కట్టేసి స్క్రూ డ్రైవర్, ఇంటిలోని ఇతర వస్తువుల సాయంతో అనిష్ను హత్య చేశారు.ఆ హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు తమ ప్రాథమిక విచారణలో తేల్చారు. ఆమె ఇంటికి తరుచు వస్తూ పోతూ ఉండే అనిష్ను అడ్డు తొలగించుకోవాలని సితార భావించింది. దీనిలో భాగంగానే ఇంటికి పిలిచి హత్య చేసినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు పోలీసులు. అయితే పూర్తి స్థాయి విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అడిషనల్ ఎస్పీ రాజేశ్ కుమార్ శ్రీవాత్సవ తెలిపా రు. ప్రస్తుతం అనిష్ హత్య కేసులో నిందితులుగా ఉన్న భార్యాభర్తల్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పేర్కొ న్నారు. అయితే అనిష్ కుటుంబ సభ్యులు మాత్రం సితారతో వివాహేతర సంబంధం గురించి తమకు తెలియదని అంటున్నారు. ఆమె తమకు తెలుసున్న వ్యక్తి అని, ఆ క్రమంలోనే అనిష్ వద్ద నుంచి రూ. 7 లక్షలను అప్పుగా తీసుకుందని అంటున్నారు. ఆ డబ్బు తిరిగి ఇమ్మని అడిగి నందుకే తన కుమారుడు అని ష్ను పొట్టన పెట్టుకున్నారని తండ్రి ముస్తకిమ్ తెలిపారు. చాలా దారు ణంగా తన తన యుడ్ని హత్య చేశారని, డబ్బులు అడి గినందుకే ఇంత ఘోరానికి ఒడిగట్టారని తనకు తెలియదని తండ్రి తెలిపారు.

# 'నా భార్యను బ్రతికించుకోలేకపోయాను'



**జనంసాక్షి:**నగరం అంటే ట్రాఫిక్ నరకం. ఇది కాదనలేని సత్యం. ఉండటానికి ఫ్లై ఓవర్స్ ఉంటాయి. నేషనల్ హైవేలు సైతం అనుసంధానంగా కూడా ఉంటాయి. కానీ ట్రాఫిక్ సుఖం మాత్రం ఉండటం లేదు.ఇక్కడ ఏదో ఒక నగరం గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఏ నగరం చూసినా ఇంచుముంచు ఇదే పరిస్థితి.ఇక వర్షం పడితే ఆ నరకం వర్ణనాతీతం. సాధారణ ప్రజలైతే ఆ నరకాన్ని దాటుకుంటూ ఏదో రకంగా తమ గమ్యాలకు చేరతారు. కానీ ఏదైనా విషమ పరిస్థితుల్లో ఉన్నవారు ట్రాఫిక్లో చిక్కుకుంటే మాత్రం ఏం జరుగుతుందో మన ఊహకు కూడా అందదు.ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నారు మహారాష్ట్రలోని పాల్గర్ ప్రాంతానికి చెందిన దంపతులు. భర్త కళ్ల ముందు భార్య విపరీతమైన నరకయాతన అనుభవిస్తున్న చేసేది లేక అంబులెన్స్లో అలా ఉండిపోయాడు. భార్య పడిన నరకాన్ని కళ్లరా చూసి.. బ్రతికించుకోవడానికి చేసిన ప్రయత్నం మాత్రం విఫలమైంది. దీనికి కారణం ట్రాఫిక్. ప్రాణాపాయ స్థితిలో ఉన్న భార్యను తీసుకుని నేషనల్ హైవే మీద చిక్కుకుపోయిన ఘటన హృదయవిదారకంగా ఉంది.పల్ఘార్కు చెందిన చయ్యా పూరవ్ అనే 49 ఏళ్ల మహిళకు తీవ్రంగా గాయపడింది. చయ్యా పూరవ్ ఇంటి వద్ద ఉన్న ఒక చెట్టు కొమ్మ ఆమెపై విరిగిపడింది. దాంతో ఆమె తీవ?్ర రక్తస్రావం జరిగింది. స్థానిక ఆస్పత్రికి తీసుకెళితే, ముంబైలోని హిందుజా ఆస్పత్రి రిఫర్ చేశారు. దాంతో ఆమెను తీసుకుని అంబులెన్స్లో బయల్దేరాడు భర్త. అయితే నేషనల్ హైవే-48బీపై వెళితే అక్కడకు చేరడానికి పెద్ద సమయం పట్టదు. పల్ఘార్ నుంచి ముంబై వెళ్లడానికి అది అనువైన రహదారి కూడా.100 కి.మీ దూరం ఉన్న ముంబైని చేరుకోవడానికి ఎంత లెక్కన వేసుకున్నా రెండు గంటలన్నర కంటే ఎక్కువ పట్టదు. అయితే నేషనల్ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. సగం దూరం చేరడానికే మూడు గంటలకు పైగా సమయం పట్టింది. అప్పటికే ఆమె పరిస్థితి మరింత విషమించింది. తీవ్రమైన నొప్పితో విలవిల్లాడిపోతోంది. కానీ భర్త ఏం చేసే పరిస్థితి లేదు. ఆ ట్రాఫిక్ను ఛేదిస్తే గానీ భార్య పడే నరకానికి ఫుల్స్టాప్ పెట్టలేదు.ఈ క్రమంలోనే 70 కి.మీ దూరం వెళ్లేసరికి ఆమె స్పృహలోకి లేకుండా మారిపోయింది. దాంతో అక్కడ ఉన్న ఓ ఆస్పత్రికి తీసుకు వెళితే ఆమె చనిపోయిందని డాక్టర్లు నిర్ధారించారు. ఎంత ప్రేమేగా చూసుకునే భార్య కళ్ల ముందే విలవిల్లాడిపోతుంటే చేసేది లేకుండా పోయిందని భర్త అంటున్నారు. తన భార్య నాలుగు గంటల పాటు తీవ్ర నరకయాతన అనుభవించిందని, అది తన కళ్లతో చూశానని బోరుమంటున్నారు. ట్రాఫిక్ కారణంగానే తన భార్యను కాపాడులేకపోయానని భర్త పూరవ్ కన్నీటి పర్యంతమయ్యారు. అరగంట ముందుగా ముంబై ఆస్పత్రికి వెళ్లినా తన భార్యను కాపాడుకునే వాడినని పూరవ్ బాధాతప్త హృదయంతో మీడియా ముందు కన్నీళ్లు పెట్టుకున్నారు. గత నెల 31వ తేదీన జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

## పాక్తో భారత్ మ్యాచ్ ఆడటమేంటి?.. ఒవైసీ సంచలన వ్యాఖ్యలు

**జనంసాక్షి:** ఆసియా కప్లో భాగంగా భారత్, పాకిస్తాన్ మధ్య జరగబోయే క్రికెట్ మ్యాచ్పై ఎంఐఎం అధినేత, లోక్సభ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు.రక్తం, నీళ్లు కలిసి ప్రవహించలేవు.. పాకిస్తాన్తో భారత్ క్రికెట్ ఎలా ఆడుతుంది అంటూ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మ్యాచ్కు బీసీసీఐ ఎలా అనుమతి ఇచ్చింది అంటూ నిలదీశారు.ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ జాతీయ మీడియా పోడ్ కాస్ట్లో మాట్లాడుతూ..'నీళ్ళు, రక్తం కలిసి ప్రవహించలేవని.. చర్చలు, ఉగ్రవాదం కలిసి సాగలేవని ప్రధానమంత్రి మోదీ స్వయంగా చాలా సార్లు చెప్పారు. ఇలా మాట్లాడి.. మళ్లీ ఇప్పుడు పాకిస్తాన్తో ఎలా క్రికెట్ ఆడుతారు. దుబాయ్లో పాకిస్తాన్తో క్రికెట్ మ్యాచ్ ఆడుతున్నామని తెలిసి నేను ఆశ్చర్యపోయాను. నేను ఈ మ్యాచ్ను చూడను. పాక్తో భారత్.. వాణిజ్య సంబంధాలను తెంచుకున్నారు, గగనతలాన్ని మూసివేశారు. కానీ, మీరు క్రికెట్ ఆడటానికి సిద్ధంగా ఉన్నారా? ప్రశ్నించారు. పాక్తో ఆడటానికి కేంద్రం ఎలా అనుమతి ఇస్తుంది. భారతదేశంలో క్రికెట్ అనేది ఒక వ్యామోహం. క్రికెట్ ప్రతీ దాన్ని స్తంభింపజేస్తుంది అని అన్నారు.ఉగ్రవాద దాడిలో ప్రజలు వారి కుటుంబ సభ్యుల ముందే చనిపోయారు. ఈ దాడి నన్ను తీవ్రంగా బాధించింది. ఈ ఘటన చాలా దారుణం. భార్యాపిల్లల ముందే తమ వారిని ఎవరైనా హత్య చేయడం బాధాకరం. ఇంత దారుణం జరిగినప్పుడు పాకిస్తాన్తో క్రికెట్ మ్యాచ్ ఆడటంలో అర్థం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో బీసీ సీఐ, కేంద్ర ప్రభుత్వం మ్యాచ్కు అనుమతి ఇస్తుంది?. మ్యాచ్ బాయ్కాట్ చేయాలని పిలుపునిచ్చారు.

## జమ్మూకశ్మీర్లో టెన్షన్ టెన్షన్

### ఉగ్రవాదులను చుట్టుముట్టిన సైన్యం.. కిష్త్వార్లో భారీ ఆపరేషన్

న్యూఢిల్లీ(జనంసాక్షి):జమ్మూకశ్మీర్లో ఉగ్రవాదులకు ఊపిరాడకుండా సైన్యం ఆపరేషన్లు కొనసాగిస్తోంది. తాజాగా కిష్త్వార్లో పలువురు ఉగ్రవాదులు నక్కినట్లు దళాలకు సమాచారం అందడంతో గాలింపు చేపట్టింది.ఈ క్రమంలో దుల్ జనరల్ ఏరియాలో ఉగ్రవాదులు, దళాలకు మధ్య కాల్పులు మొదలయ్యాయి. ఈ విషయాన్ని వైట్నైట్ కోర్ ఎక్స్లో పోస్టు చేసింది. పూర్తిగా పర్వత ప్రాంతమైన కిష్త్వార్లో టెర్రరిస్టులు ఉన్నట్లు పక్కా సమాచారం అందినట్లు సైన్యం వెల్లడించింది. ప్రస్తుతం భారీగా కాల్పులు జరుగుతున్నాయి.మరోవైపు కుల్గాంలో అపరేషన్ అఖల్ 10వ రోజుకు చేరింది. వీరమరణం పొందిన లాన్స్నాయక్ ప్రీత్పాల్ సింగ్, సిపాయ్ హర్మిందర్ సింగ్కు చినార్ కోర్ నివాళి అర్పించింది. ప్రస్తుతం ఆపరేషన్ కొనసాగుతోందని పేర్కొంది.

## ఇండిగోకు భారీ జరిమానా.. ప్రయాణికురాలు ఏం చేసిందంటే?

ఢిల్లీ: ఇండిగో ఎయిర్ లైన్స్కు ఢిల్లీ వినియోగదారుల ఫోరం భారీ జరిమానా విధించింది. విమానంలో ఓ ప్రయాణికురాలికి అపరిశుభ్రమైన, అసౌకర్యవంతమైన సీటును కేటాయించినందుకుగాను రూ.1.5 లక్షల జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకుంది.అంతేకాకుండా.. ఈ కేసుకు సంబంధించి ఆమె ఖర్చు చేసిన రూ.25,000 కూడా చెల్లించాలని ఆదేశించింది.వివరాల ప్రకారం.. ఈ ఏడాది జనవరి ఐదో తేదీన పింకీ అనే మహిళ బాకు-ఢిల్లీ ఇండిగో విమానంలో ప్రయాణించింది. ఈ సందర్భంగా విమానంలో తనకు అపరిశుభ్రమైన సీటు కేటాయించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసింది. అనంతరం, ఈ ఘటనపై ఢిల్లీలోని వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. దీని వల్ల తాను శారీరకంగా, మానసికంగా ఇబ్బంది పడినట్లు తెలిపారు. ఫిర్యాదుపై విచారణ జరిపిన కమిషన్ అపరిశుభ్రమైన, అసౌకర్యవంతమైన సీటును కేటాయించినందుకుగాను ఇండిగో ఎయిర్ లైన్స్కు రూ.1.5 లక్షల జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని సదరు ప్రయాణికురాలికి చెల్లించాల్సిందిగా ఆదేశించింది. అలాగే, ఈ కేసుకు సంబంధించి ఆమె ఖర్చు చేసిన రూ.25,000 కూడా చెల్లించాలని పేర్కొంది.అయితే.. ఈ ఆదేశాలను ఇండిగో వ్యతిరేకించింది. ప్రయాణికురాలికి కేటాయించిన సీటు సరిగ్గా లేకపోడంతో ఆమె అభ్యర్థన మేరకు తాము వేరే సీటు కేటాయించినట్లు తెలిపింది. అనంతరం ఆమె సౌకర్యవంతంగా తన ప్రయాణాన్ని పూర్తి చేసినట్లు పేర్కొంది. అయినప్పటికీ వినియోగదారుల ప్రయాణ సమాచారాన్ని తెలిపే రికార్డులలో భాగమైన సిట్యువేషన్ డేటా డిస్ప్లే నివేదికను సమర్పించడంలో ఎయిర్లైన్స్ విఫలమైందని తెలిపింది. అందుకే జరిమానాను చెల్లించాల్సిందేనని వినియోగదారుల ఫోరం స్పష్టం చేసింది.

# తెలంగాణ రాష్ట్ర సైకాలజిస్టుల మండలి ఏర్పాటుకు కృషి

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హామీ



**రాజన్న సిరిసిల్ల బ్యూరో :** తెలంగాణ రాష్ట్ర సైకాలజిస్టుల మండలి ఏర్పాటు కోసం తెలంగాణ సైకాలజిస్టుల సంఘం చేస్తున్న కృషికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పూర్తి మద్దతు తెలిపారు. ఆదివారం సిరిసిల్లలో ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో సైకాలజిస్టు మండలి ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. ప్రతినిధులు రాష్ట్రవ్యాప్తంగా 2,500కు పైగా సైకాలజిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను, మండలి ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలను గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, "మానసిక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న ఈ కాలంలో సైకాలజిస్టుల పాత్ర అత్యంత కీలకం అని అన్నారు. మండలి ఏర్పాటుకు తాను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని, అవసరమైన మద్దతు ఇస్తాను" అని హామీ ఇచ్చారు. సైకాలజిస్టులకు చట్టబద్ధ గుర్తింపు మరియు లైసెన్సింగ్ వ్యవస్థ మానసిక ఆరోగ్య కేంద్రాలకు ప్రమాణపూర్వక నియంత్రణ వృత్తి అభివృద్ధి కోసం నిరంతర శిక్షణ, పరిశోధనకు ప్రోత్సాహం అవసరం అని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కనుకుంట్ల పున్నంచందర్, జిల్లా అధ్యక్షుడు వై. ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి సి హెచ్ శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# గోదారిని ఎడారిగా మార్చిన ఘనత కాంగ్రెస్ సర్కార్‌ది

- కేసీఆర్ హయాంలో నిండుకుండలగా గోదారి
- రేవంత్ పాలనలో రైతుల కళ్లల్లో కన్నీళ్లు
- కన్నెపెల్లి పంప్ హౌజ్ నుండి నీటిని వెంటనే విడుదల చేయాలి
- మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు కోరుకంటి చందర్



**గోదావరిఖని, జనంసాక్షి :**
తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రైతంగానికి సాగునీరు ఈ ప్రాంతానికి త్రాగునీరు అందించాలన్న మహా సంకల్పం తో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేసి గోదావరి నదిని నిండుకుండలగా మార్చి రైతుల కన్నీళ్లు తుడిచారని... 20 నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రైతంగానికి సాగునీరు అందించక రైతుల కంట కన్నీరు పెట్టిస్తూ రేవంత్ సర్కార్ అరిగోస పెడుతుందని... గోదావరి నదిని ఎడారిగా మార్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ గారు అన్నారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో గోదావరిఖని పట్టణ శివారు గోదావరి నది ఇసుక లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇసుకలో బీఆర్ఎస్ నాయకులు క్రికెట్, ఖోఖో, కబడ్డీ ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కేసీఆర్ పాలనలో కేసీఆర్ సీఎంగా కొనసాగిన సమయంలో గోదావరి నిండుకుండగా ఉండేదని కాంగ్రెస్ సర్కారు గద్దెనెక్కిన తర్వాత నిండుకుండలా ఉన్న గోదావరి ఎడారిలా మారిందన్నారు. తాము ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో నిండుకుండలాగా ఉన్న గోదారినదిలో పడవల పోటీలు నిర్వహించామని గుర్తుచేశారు. గలగలా పారే గోదావరి నది కాంగ్రెస్ పాలనలో ఎడారిగా మారిందని ఆయన ఎద్దేవా చేశారు. రైతులకు ప్రజలకు సాగు, తాగు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎన్నికలు సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని రేవంత్ రెడ్డి అబద్ధపు ప్రచారాలు చేస్తూ ప్రజలను, రైతులను నమ్మించి ఎన్నికల్లో గెలిచాక ప్రజలను నట్టేటా ముంచరన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు రెండు ఫిల్లర్లు కుంగితే మరమత్తులు చెయకుండా రేవంత్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు పై కేసీఆర్ గారిపై అక్కసుతో రైతులను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నరన్నారు. పంటలు ఎండిపోకుండా ఇప్పటికైనా రైతులకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కన్నెపల్లే పంప్ హౌజ్ ను నుండి నీటిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ కార్పోరేటర్లు కల్వచర్ల కృష్ణ వేణీ , గాదం విజయ బాదె అంజలి టిబిజికెఎస్ నాయకులు పర్లపల్లి రవి నూనె కోమురయ్య వడ్డెపల్లి శంకర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు అచ్చే వేణు తోకల రమేష్ చెలకలపల్లి శ్రీనివాస్ నారాయణదాసు మారుతి కాల్వ శ్రీనివాస్ పీచర శ్రీనివాస్ జక్కుల తిరుపతి అల్లం అయిలయ్య కేశవ గౌడ్ ఇరుగురాళ్ల శ్రావన్ చింటూ సట్టు శ్రీనివాస్ కలవేని రవీందర్ భాను చందర్ నూతి తిరుపతి గంపుల లక్ష్మి ఆర్శనపల్లి శ్రీనివాస్ బండారి ప్రవీన్ గుర్రం పద్మ సూజాత లక్ష్మి బుర్ర వెంకటేష్ ఆవునూరి వెంకటేష్ కిరన్ జీ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ అలీఖాన్ సౌదీ అరేబియాలో పర్యటన



**హైదరాబాద్ ఆగస్టు10(జనం సాక్షి):** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో రిపబ్లిక్ ఆఫ్ కజకిస్తాన్ గౌరవ కాన్సుల్ డాక్టర్ నవాబ్ మీర్ నాసీర్ అలీ ఖాన్ సౌదీ అరేబి యాలో అధికారికంగా పర్యటించారు. ప్రిన్స్ అబ్దుల్ అజీజ్ బిన్ ఫైసల్ బిన్ అబ్దుల్ మజీద్ అల్ సౌద్ను కలిశారు. ఈ సమావేశంలో సౌదీ అరేబియాకు చెందిన పర్యావర ణహిత, ఆరోగ్యకర జీవనశైలికి తోడ్పడే సమగ్ర లగ్జరీ హౌసింగ్ ప్రాజెక్టులపై చర్చలు జరిపారు. ఎందుకంటే, డాక్టర్ నవాబ్ మీర్ నాసీర్ అలీ ఖాన్ ఎంఏకే ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రమోటర్, మేనేజింగ్ డైరెక్టర్ కూడా. సౌదీ అరేబియా విజన్ 2030తో ముందుకు సాగుతుంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థకు ఆధునిక, పర్యావరణ పరిరక్షణ తో కూడిన సమాజాలకు పెరుగుతున్న డిమాండ్ను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రిన్స్ అబ్దుల్ అజీజ్ బిన్ ఫైసల్ బిన్ అబ్దుల్ మజీద్ అల్ సౌద్ రియాద్లో ఒక ప్రత్యేక విందు ఇచ్చారు. ఈ సందర్భంలో ఇంపాక్ట్ మీనా యాక్సెస్ సర్కిల్ తరఫున డాక్టర్ నవాబ్ మీర్ నాసీర్ అలీ ఖాన్ కు బహుమతి అందజేశారు. ఇది అలీఖాన్ దూరదృష్టి, విజన్ 2030 లక్ష్యాలు సాధించడంలో ఆయన చూపిస్తున్న చొరవకు ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ నవాబ్ మీర్ నాసీర్ అలీ ఖాన్ సౌదీ అరేబియా అద్భుత ఆతిథ్యానికి ధన్యవాదాలు తెలిపారు. సౌదీ అరేబియాలో లగ్జరీ హౌసింగ్ ప్రాజెక్టుల అభివృద్ధిలో పాల్గొనేందుకు ఆసక్తి వ్యక్తపరిచారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ఆరోగ్యకర జీవనశైలి పెంపొందించడానికి కృత నిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు. ప్రిన్స్ అబ్దుల్ అజీజ్ బిన్ ఫైసల్ బిన్ అబ్దుల్ మజీద్ అల్ సౌద్ను కజకిస్తాన్కు ఆహ్వానించారు. డాక్టర్ అలీఖాన్ సౌదీ అరేబియా, ఇతర ప్రాంతాలలో అభివృద్ధిలో పాలు పంచుకునేందుకు, పరస్పర అవగాహనతో దీర్ఘకాల వ్యాపార భాగస్వామ్యం కోసం ఆసక్తితో ఉన్నారు.

## బోధన్ మండలంలో ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభం

**బోధన్, (జనంసాక్షి):** నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ మంజూరు చేసిన ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డీ మోహన్ రెడ్డిలు ప్రారంభించారు. బోధన్ మండలంలోని మినార్ పల్లిలో సేవాలాల్ గుడి ప్రహరీ గోడ నిర్మాణానికి మూడు లక్షల రూపాయలు, అమ్దాపూర్ గ్రామంలో ఓపెన్ జిమ్ కోసం నాలుగు లక్షల రూపాయలు, రాంపూర్ గ్రామంలో మహిళా భవన నిర్మాణానికి మూడు లక్షల రూపాయలతో చేపట్టనున్న పనులను వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామాలు దేశానికి పట్టు కొమ్మలని, అందుకే ఎంపీ అరవింద్ గ్రామీణాభివృద్ధికి కట్టుబడి ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెడుతుందని, రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పి, బిజెపిని గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో బిజెపి జడ్పీ చైర్మన్ స్థానంతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకుంటామని అన్నారు.

## నేడు సుడా వాణిజ్య సముదాయ భవనానికి శంకుస్థాపన

### విచ్చేస్తున్న మంత్రులు



**కరీంనగర్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి) :**
నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో కెడిసిసి బ్యాంక్ ఎదురుగా సుడా వాణిజ్య సముదాయ భవనం రెండు దశలలో రెండు, రెండు మొత్తం నాలుగు కోట్ల రూపాయలతో నిర్మాణం సంబంధించి ఐడిఎస్ఎంటి షాపింగ్ కాంప్లెక్స్ (పాత మున్సిపల్ గెస్ట్ హౌజ్) సుడా నిధులు డెబ్బై తొమ్మిది లక్షలతో మౌలిక వసతులు ఆధునీకరణ పనులకు సంబంధించి శంకుస్థాపన కార్యక్రమాలు ఉన్నాయని సోమవారం ఉదయం 10 గంటలకు మొదట సుడా వాణిజ్య సముదాయం అనంతరం ఉదయం 10:30 గంటలకు ఐడిఎస్ఎంటి షాపింగ్ కాంప్లెక్స్ పనులకు శంకుస్థాపన చేస్తారని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఎమ్మెల్యేలు, కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, సుడా వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, వివిధ హోదాలలో ఉన్న చైర్మన్లు, అధికారులు తదితరులు హాజరు కానున్నారని నరేందర్ రెడ్డి తెలిపారు.

## రెండో విడతలో ఇందిరమ్మ ఇల్లు దరఖాస్తు చేసుకోండి

### బిజిఎంసి కమిషనర్ బి.శరత్ చంద్ర

**రాజేంద్రనగర్, ఆగస్టు10(జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు పథకం కింద మళ్ళీ రెండో విడతలో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని బిజిఎంసి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమీషనర్ బి. శరత్ చంద్ర పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియా ప్రకటన ద్వారా ఈ అవకాశాన్ని బండ్లగూడ జాగీర్ నగర పాలక సంస్థ పరిధిలో నివసించే అర్హత కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలని దరఖాస్తు చేసుకొనుటకు కావలసిన దస్త వేజులుగా ఆధార్ కార్డు జిరాక్స్, ప్లాటుకు సంబంధించిన డాక్యుమెంట్లు జిరాక్స్, ఆస్తిపన్ను చెల్లించిన రసీదు, కరెంట్ బిల్లు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డులతో కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ వివరించారు.

## ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన వెంకటకిష్టయ్య



**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 10 (జనంసాక్షి) :**
ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రభుత్వ డైవర్ల సంఘం ఎన్నికల నోటిపికేషన్ 2025 జులై 27న ఇవ్వడం జరిగింది. అదే విధంగా 2025 ఆగస్టు 10వ తేది ఆదివారం రోజున ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో నామినేషణ స్వీకరించడం జరిగింది. ఎన్నికల అధికారిగా ఎండి.జహంగీర్ అలి, అసిస్టెంట్ అధికారులు గా ఎండి.సాబీర్, రెండవ ఎన్నికల అధికారిగా కె. భాస్కర్ లు తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల జిల్లా శాఖ ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో నామినేషన్లు జరిగినది. ఈ ఎన్నికలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల అధ్యక్ష పదవికి మూడు నామినేషన్లు వచ్చినవి. వారిలో మొదటి వ్యక్తి వేంకటకిష్ణయ్య , రెండవ వ్యక్తి యు. వెంకటయ్య, మూడవ వ్యక్తి అబ్దుల్ షకీల్ నామినేషన్ వేశారు. ఇందులో రెండు నామినేషన్ల లో యు. వెంకటయ్య , అబ్దల్ షకిల్ నామినేషన్ల ఇతర కారణల వలన ఉపసంహరించుకున్నందున కె. వెంకటకిష్టయ్య ని ఎకగ్రీవంగ ఎన్నుకోవడం జరిగిందని ఎన్నికల అధికారులు ఎండి.జహంగీర్, అసిస్టెంట్ అధికారులు ఎండి.సాబీర్, కె. భాస్కర్ లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం భాద్యులు, సభ్యులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ హైస్కూల్‌లో ఘనంగా

# జాతీయ విద్యా విధానంపై అవగాహన సదస్సు




**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 10 (జనంసాక్షి) :**
ప్రస్తుత పోటీ ప్రపంచంలో సమాజంలో వెలువడుతున్న మార్పులకు అనుగుణంగా విద్యా విధానంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఎంతగానో ఉందని, ఉపాధ్యాయులు వాటి పట్ల విశ్లేషణాత్మకంగా వ్యవహరించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ హైస్కూల్ (సీబీఎస్ఇ) లో ఏర్పాటు చేసినటువంటి జాతీయ విద్యా విధానం పై నిర్వహించినటువంటి అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ఉపాధ్యాయుడు విద్యా విధానం పట్ల సమగ్ర అవగాహన కలిగి ఉండాలని విద్యా విధానంలో చోటు చేసుకునేటువంటి మార్పులకు అనుగుణంగా బోధించాలని వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వారు విద్యావిధానాన్ని సులభతరంగా చేయడానికి ప్రవేశపెట్టినటువంటి జాతీయ విద్యా విధానం ఎంతగానో దోహదపడుతుందని, విద్యా వ్యవస్థను పటిష్ట పరచడానికి ఇది చాలా ఉపకరిస్తుందని వారు తెలిపారు. విద్యా విధానంలో చోటుచేసుకునేటువంటి సమూల మార్పులకు అత్యుత్తమ విద్యను అందించడమే లక్ష్యంగా ఈ ప్రణాళికలను చాలా వ్యూహాత్మకంగా విశ్లేషణాత్మకంగా నిపుణులతో చర్చించిన తర్వాత ప్రవేశపెట్టడం జరిగిందని వారు తెలిపారు. విద్యార్థులకు అనువైన పద్ధతులలో బోధన అందించవలసిన అవసరం ఎంతగానో ఉందని ముఖ్యంగా సృజనాత్మకంగా కొత్త కోణంలో వారికి బోధించాలని చెప్పారు. నూతన ప్రమాణాలకు దీటుగా ప్రవేశపెడుతున్నటువంటి బోధన పద్ధతులను అలవర్చుకోవడమే కాకుండా అమలుపరచాలని వారు సూచించారు.
కార్యక్రమానికి విచ్చేసినటువంటి రిసోర్స్ పర్సన్స్ ఎన్.ఎస్.శ్రీనివాస్ ,సంజీవ్ కుమార్, మాట్లాడుతూ విద్యా విధానంలో వస్తున్నటువంటి మార్పులను ఉపాధ్యాయులకు తెలియజేయడానికై విషయాలను విశ్లేషణాత్మకంగా విద్యార్థులకు తెలియజేయడానికి సమాజంలో వెలువడుతున్న మార్పులు కనుగుణంగా ఉపాధ్యాయులు పలు అంశాల్లో శిక్షణ పొందాలని శిక్షణలో నేర్చుకున్నటువంటి విషయాలను తరగతి గదిలో సక్రమంగా అమలుపరచడమే కాకుండా విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించే బాధ్యత సైతం తీసుకోవాలని వారు తెలిపారు.
నేటి పోటీ ప్రపంచంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని ఈ మార్పులను అన్నిటిని కూడా పరిగణలోకి తీసుకొని ఉపాధ్యాయులు విషయాలను బోధించే పద్ధతులను సైతం మార్చుకోవాలని వారు సూచించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు సృజనాత్మకంగా నూతన విద్యా విధానం ద్వారా బోధించడం చాలా హర్షించదగ్గ విషయమని పాఠశాలలో అన్ని మనలను కల్పించి విద్యార్థులను అభివృద్ధి పరచడం చాలా ఆదర్శనీయమని కొనియాడారు. అవగాహన సదస్సులో భాగంగా నిర్వహించినటువంటి పలు కార్యక్రమాలు ఆలోచింపచేసాయి. ముఖ్యంగా చిన్నపిల్లలకు నేర్పించే విద్యా విధానం చాలా ఆకర్షణీయంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో సీబీఎస్ఇ రిసోర్స్ పర్సన్స్ ఎన్ఎస్ శ్రీనివాస్, నాంపల్లి సంజీవ్, పాఠశాల ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## బోర్ వెల్ లారీకి బైక్ ఢీ యువకుడు మృతి

**ముస్తాబాద్ ఆగస్టు 10( జనం సాక్షి):**
ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామానికి చెందిన కొప్పు నరేష్ (27) ఆదివారం తన మోటార్ సైకిల్ పల్సర్ బండి పైన రాత్రి ముస్తాబాద్ కు వెళ్లి పెట్రోల్ పోయించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా హనుమాన్ టెంపుల్ వద్ద బోర్‌వెల్ లారీ డ్రైవర్ ఎలాంటి ఇండికేటర్స్, సూచికలు వేయకుండా బండి పార్కింగ్ చేయగా ఆ బండి రాత్రి సమయంలో కనపడకా కొప్పు నరేష్ తన బైక్ తో వెనక నుండి గుద్దుకొని తలకు, కడుపులో గాయాలు అయి చనిపోయాడని మృతుడి మరణానికి లారీని రోడ్డుపైన ఎలాంటి సూచనలు లేకుండా పార్కింగ్ చేసిన నరేష్ బంధనకల్ గ్రామానికి చెందిన అనునతనిపై కేసు నమోదు చేసి మృతుని తండ్రి రవి ఫిర్యాదు మేరకు విచారణ ప్రారంభించామని పోలీసులు తెలిపారు.

# పేద విద్యార్థికి ఆర్థిక సాయం

## విద్య ద్వారా ఉన్నత శిఖరాలు

- ర్యాంకర్ మహేష్‌కు రూ. 5.22 లక్షల సాయం
- బ్యాంక్ డిపాజిట్ సర్టిఫికెట్ అందజేత
- ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి



కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 10 (జనంసాక్షి): పేద విద్యార్థికి ఆర్థిక సాయం అందించడం ద్వారా విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ర్యాంకర్ మహేష్‌కు రూ.5.22 లక్షల సాయం అందజేస్తూ బ్యాంక్ డిపాజిట్ సర్టిఫికేట్‌ను అందించారు. ఆదివారం ఎల్ఎండీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో నీట్‌లో జాతీయ స్థాయిలో 17వ ర్యాంకు సాధించిన గంగిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి మార మహేష్‌కు విరాళాల ద్వారా సేకరించిన 5.22 లక్షల రూపాయల డిపాజిట్ సర్టిఫికేట్‌ను ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత ఉట్కూరి నరేందర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివినప్పుడే విద్యలో రాణిస్తారని, తద్వారా జీవితంలో ఉన్నతమైన జీవితం గడుపుతారని అన్నారు. ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత ఉట్కూరి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల, కళాశాలలోనే చదివి నీట్‌లో జాతీయ స్థాయి ర్యాంకు సాధించడం మామూలు విషయం కాదని, అది మానకొండూర్ నియోజకవర్గానికే కాకుండా మన జిల్లాకు గర్వకారణమని అన్నారు. మహేష్‌ను చూసి విద్యార్థులు స్ఫూర్తి పొందాలన్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సతీమణి డాక్టర్ అనూరాధ 1.50 లక్షల రూపాయల విరాళం అందించారు. పేద విద్యార్థి మహేష్ భారీ స్థాయిలో విరాళం సేకరించేందుకు దోహదపడిన మానకొండూర్ ఎమ్మెల్యే దంపతులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, డాక్టర్ కవ్వంపల్లి అనూరాధలకు యూటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు ముల్కల కుమార్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్ మండల పార్టీ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు మర్రి ఓదెలు యాదవ్, పులి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ గంగిపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు ఎం.రామకృష్ణ, పార్టీ నాయకులు రామిడి తిరుమల్ రెడ్డి, వాల అంజుత్ రావు, ముక్కెర సతీష్ కుమార్, డాక్టర్ పోతిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఆర్. శ్రీనివాస్ రెడ్డి, కనకం లక్ష్మణ్, ముల్కల కుమార్, గొల్లెన కొమురయ్య, బండి మల్లేషం, బైరం సంతోష్, చెప్యాల శ్రీనివాస్, బుర్ర చంద్రాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ ధర్నాతో యావత్తు దేశం తెలంగాణ వైపు చూసింది

- బిఆర్ఎస్ నేత కవితకు బీసీలపై చిత్తశుద్ధి ఉంటే కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావుతో కలిసి ఢిల్లీలో ధర్నా చేయాలి
- బిజెపి పాలిత రాష్ట్రాల్లో బీసీ రిజర్వేషన్ల నుండి ముస్లింలను తొలగించాలని డిమాండ్ చేసే దమ్ము బండి సంజయ్ కి ఉందా..?
- కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం



**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 10 (జనంసాక్షి) :**
కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, పలువురు కాంగ్రెస్ నేతలతో కలిసి ఆదివారం రోజు కరీంనగర్ డిసిసి కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సత్తు మల్లేశం మాట్లాడుతూ..మా నాయకుడు రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు చేపట్టిన భారత్ జోడో యాత్రలో భాగంగా బడుగు బలహీన వర్గాల సమస్యలను ప్రత్యక్షంగా వీక్షించి ఆనాడు మీరు ఎంతో మీకంత అనే నినాదాలు తీసుకువచ్చి రాహుల్ గాంధీ ఆలోచన మేరకు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ వేదికగా స్వాతంత్రానంతరం మొట్టమొదటిసారిగా మా ప్రియతమ నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో 2024 నుండి 2025 సంవత్సర కాలంలో బీసీ కమిషన్ ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్తంగా కులగనున చేపట్టి విద్యా, ఉపాధి, ఉద్యోగ రంగాలలో అవకాశాలు కల్పించాలని, రాజకీయాలలో స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రెండు బిల్లులను అసెంబ్లీలో ఆమోదించి దానిని కేంద్ర ప్రభుత్వానికి ఆమోదం కొరకు పంపించడం జరిగిందని తెలిపారు. మొన్నటి వరకు కేంద్ర ప్రభుత్వం ఆమోదించకపోతే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి ఈనెల 6వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టడం జరిగిందని, ఉమ్మడి జిల్లాలో బీసీ వెల్ఫేర్ అండ్ ట్రాన్స్పోర్ట్ వెల్ఫేర్ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ ఇండస్ట్రియల్ మినిస్టర్ దుద్దిల్ల శ్రీధర్ బాబు , ఎస్సీ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నేతృత్వంలో కరీంనగర్ జిల్లా నుండి అందరూ ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరూ ఆ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయడం జరిగిందన్నారు.
ఆనాడు అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టిన రోజున బిజెపి, బిఆర్ఎస్ ఆమోదించి ఈనాడు కేంద్ర ప్రభుత్వానికి బిల్లును పంపించిన తర్వాత బీసీల పైన వారికి ఎంత ప్రేమ ఉందో ఈరోజు బయటపడింది, నేడు బీజేపీ పార్టీకి చెందిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, మరొక మంత్ర కిషన్ రెడ్డి, బీసీ రిజర్వేషన్ల నుండి మైనారిటీలను తీసినట్లయితే మేము బిల్లు ఆమోదింప చేస్తామని అన్నారు. బిజెపి నేత నరేంద్ర మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లలో, ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయం అయిన మహారాష్ట్రలో బిజెపి ప్రభుత్వమే కదా అధికారంలో ఉంది. ఆయా రాష్ట్రాల్లో బీసీ రిజర్వేషన్లలో ఉన్నటువంటి ముస్లింలను తీసేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్, నరేంద్ర మోడీని డిమాండ్ చేయాలని అంతే కాకుండా మన పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి మిత్రపక్షమైన టిడిపి పార్టీకి చెందిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని అక్కడ బీసీ రిజర్వేషన్లలో ఉన్న ముస్లింలను తొలగిస్తేనే మీతో మిత్రపక్షంలో కొనసాగుతామని మీరు వారిని డిమాండ్ చేయాలని కోరుతున్నామన్నారు. బండి సంజయ్ కుమార్‌కి బీసీల పైన, దళితుల పైన గాని ఏమాత్రం విశ్వాసం, ప్రేమ ఉన్నట్లయితే, ఒక బిసి కాబట్టే కరీంనగర్ పార్లమెంట్ ప్రజలు నిన్ను రెండుసార్లు ఎంపీగా గెలిపించి అదేవిధంగా మంత్రి స్థాయి వరకు వెదిగే విధంగా ప్రోత్సహిస్తే మీకు ఏమాత్రం బీసీలపైన ప్రేమ ఉన్నా ఈ బీసీ బిల్లును ఆమోదింపజేసి నువ్వు ఈ బీసీల పైన కచ్చితంగా నీ వ్యక్తిత్వాన్ని నిరూపించుకోవాలని కోరుతున్నానన్నారు. అంతేకాకుండా డిసెంబర్ 2 రాజ్యసభలో ఆనాడు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అయినటువంటి అమిత్ షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ని ఉద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యలను దేశ ప్రజలు మరిచిపోలేదని, భారత రాజ్యాంగాన్ని నిర్మించే సమయంలో అంబేద్కర్ పురుషులతో సమానంగా మహిళలకు సమాన హక్కులు కల్పించాలని ఒక ఆలోచన చేయడం జరిగిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రశ్నించడం మీవల్ల కాకపోతే మన రాష్ట్రానికి కేంద్రం నుండి వచ్చే నిధులను తీసుకురావాలని అందు గురించి ప్రయత్నం చేయాలని కోరుతున్నామని, భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రైతుల సంక్షేమం కోసం 56 వేల కోట్లు ఖర్చు పెట్టిన ఘనత ఈ ప్రజా పాలన ప్రభుత్వానిదన్నారు. బిఆర్ఎస్ నేత ఎమ్మెల్సీ కవితకి ఏమాత్రం బీసీలపై చిత్తశుద్ధి ఉన్నా ఢిల్లీలో ధర్నా చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని మీరే కాకుండా మీ నాన్న కేసీఆర్, మీ బావ హరీష్ రావుని, మీ అన్న కేటీఆర్ ని అందరిని ఒప్పించి ఢిల్లీకి తీసుకువెళ్లి జంతర్ మంతర్ వద్ద కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించి మీ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కవిత ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు ఏం.డి. తాజ్, భానోతు శ్రావణ్ నాయక్, కొరివి అరుణ్ కుమార్, అబ్దుల్ రెహమాన్, జెల్లోజి రాజు, గంగుల దిలీప్, అడపసాగర్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.



## పొట్టి సిరీస్‌లో టీమిండియా వైట్‌వాష్

ఆస్ట్రేలియా పర్యటనలో భారత మహిళల ఏ జట్టు పొట్టి సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైంది. రెండో టీ20లో 73 పరుగులకే ఆలౌటై దారుణ ఓటమి చవిచూసిన రాధా యాదవ్ బృందం, మూడో టీ20లో గట్టి పోటీ ఇచ్చినప్పటికీ నాలుగు పరుగుల తేడాతో మ్యాచ్ చేజార్చుకుంది. ఆస్ట్రేలియా ఏ జట్టు నిర్దేశించిన 144 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో ఓపెనర్ షఫాలీ వర్మ (41), మిన్ను మణి (30), రఘ్వీ బిస్త్ (25)లు అద్భుతంగా ఆడినప్పటికీ మిగతా బ్యాటర్ల వైఫల్యంతో ఓటమి తప్పలేదు. ఆఖరి ఓవర్ నాలుగో బంతి వరకూ ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో భారత జట్టు నాలుగు పరుగుల తేడాతో పరాజయం పాలైంది. దీంతో, సిరీస్‌లో వరుసగా మూడు మ్యాచ్‌లూ ఓడి క్లీన్‌స్వీప్‌కు గురైంది. ఛేదనలో నాలుగు పరుగులకే ఓపెనర్ బృందా దినేశ్ (4) ఔటైనప్పటికీ, షఫాలీ వర్మ ధనాధన్ బ్యాటింగ్‌తో లక్ష్యాన్ని కరిగించింది. ఆమెకు రఘ్వీ బిస్త్, మిన్ను మణిలు సహకరించారు. అయితే, ఆసీస్ బౌలర్ సియన్నా జింజర్ (4-16) సంచలన బౌలింగ్‌తో మిడిలార్డర్‌ను కుప్పకూల్చింది. ఆఖర్లో ప్రేమా రావత్ (12 నాటౌట్) పోరాడినా, చివరి ఓవర్‌లో 10 పరుగులు మాత్రమే వచ్చాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా ఏ జట్టు సమిష్టి ప్రదర్శనతో 144 పరుగులు చేసింది. అలీసా హేలీ (27), మడెలినా పెన్నా (39), సియన్నా జింజర్ (17 నాటౌట్) రాణించారు. ఈ సిరీస్‌లో ఒక్క మ్యాచ్‌లోనూ గెలవలేకపోవడంతో భారత ఏ జట్టు తీవ్ర నిరాశకు గురైంది.

# నీరజ్, నదీమ్ పోరు లేనట్టేనా!

## ఐదు రోజుల్లో డైమండ్ లీగ్..



పారిస్ ఒలింపిక్స్ తర్వాత భారత బడిసె వీరుడు నీరజ్ చోప్రా , అర్షద్ నదీమ్ ఎదురుపడింది లేదు. త్వరలోనే సెలేసియా డైమండ్ లీగ్‌లో దాయాది అథ్లెట్లు 'నువ్వానేనా' అన్నట్టు జావెలిన్‌ను విసురుతారని అభిమానులు అనుకున్నారు. కానీ, నిర్వాహకులు ప్రకటించిన తొలి జాబితాలో ఇద్దరి పేర్లు లేకపోవడంతో అభిమానులు నిరాశ చెందుతున్నారు.

ఆగస్టు 16 న సెలిసియా డైమండ్ లీగ్ మొదలవ్వనుంది. టోర్నీకి మరో ఐదు రోజులే ఉండడంతో ఆదివారం నిర్వాహకులు అథ్లెట్ల జాబితాను వెల్లడించారు. అందులో నీరజ్, అర్షద్‌ల పేర్లు మాత్రం లేవు. జులియన్ వెబర్, జులియస్ ఎగో, అండర్సన్ పీటర్స్ వంటి స్టార్లు బరిలో ఉన్నట్టు ఆర్గనైజర్స్ తెలిపారు. అయితే.. జూలైలోనే ఈ లీగ్ షెడ్యూల్ వచ్చింది. దాంతో.. యూరప్‌లో జరుగబోయే ఈ టోర్నీలో నీరజ్, నదీమ్‌ల మధ్య హోరాహోరీ బడిసె ఫైట్ ఉంటుందని భావించారంతా. కానీ, అధికారిక జాబితాలో చోప్రా పేరు లేకపోవడంతో అతడు ఈ టోర్నీలో ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. పాక్ అథ్లెట్ నదీమ్ ఈమధ్యే లండన్‌లో కాలిపిక్క కండరాలకు సర్జరీ చేయించుకున్నాడు. ప్రస్తుతం కోలుకుంటున్న అతడు ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ మీద దృష్టిసారించాడని అతడి కోచ్ సల్మాన్ భట్ వెల్లడించాడు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల కారణంగా 'నీరజ్ చోప్రా క్లాసిక్'లో నదీమ్ పోటీపడలేదు. ఆ తర్వాత 90 మీటర్ల మార్క్ అందుకొని చోప్రా విజేతగా నిలిచిన జరిగిన 'దోహా డైమండ్ లీగ్'లోనూ నదీమ్ పాల్గొనలేదు.

తలపడేది వీళ్లే.. జులియన్ వెబర్ (జర్మనీ), జులియస్ ఎగో(కెన్యా), రొడ్రిక్ జెన్కి డీన్ (జపాన్), అండ్రియాన్ మర్దారే(మాల్డోవా), సిప్రియన్ రిజ్‌గోల్డ్ (పోలాండ్), అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), కెశొర్న్ వాల్‌కాట్(ట్రినిడాడ్ టొబాగో).

## అలా వీడ్కోలు పలికాను



అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీ ఓవల్ టెస్టులో ఆకాశ్ దీప్ ప్రవర్తనపై దుమారం రేగుతున్న విషయం తెలిసిందే. ఇంగ్లండ్ ఓపెనర్ బెన్ డకెట్ ను ఔట్ చేసిన తర్వాత.. అతడి భుజంపై చేయి వేసి మాట్లాడినందు భారత పేసర్‌పై నిషేధం విధించాలని డకెట్ కోచ్ డిమాండ్ చేస్తున్నాడు. తన ప్రవర్తన వివాదాస్పదం కావడంపై ఆదివారం ఆకాశ్ దీప్ స్పందించాడు. ఓవల్ టెస్టులో డకెట్ సవాల్ విసరడం వల్లనే తాను అలా వీడ్కోలు పలకానని.. అంతే తప్ప అందులో వేరే ఉద్దేశమేది లేదని ఆకాశ్ తెలిపాడు. సిరీస్ ఫలితాన్ని నిర్ణయించిన ఓవల్ టెస్టులో ఆకాశ్ దీప్ ఓవర్లో డకెట్ బౌండరీలతో చెలరేగాడు. బజ్ బాట్ ఆటతో చెలరేగుతూ స్కోర్ బోర్డును ఉరికించాడు. 'నువ్వు నన్ను ఔట్ చేయలేవు' అని అనడంతో ఆకాశ్ అవునా.. 'ఔట్ చేసి తీరుతాను' అనుకున్నాడు. హాఫ్ సెంచరీతో విరుచుకుపడిన అతడిని ఔట్ చేసి ఇంగ్లండ్‌కు షాకిచ్చాడు భారత పేసర్. 'నాకు డకెట్‌పై మంచి రికార్డు ఉంది. అతడిని పలుమార్లు ఔట్ చేశాను. లెఫ్ట్ హ్యాండర్లను వెనక్కి పంపడం అంటే నాకిష్టం. డకెట్ ఏమీ ప్రత్యేకం కాదు. కానీ, ఆ రోజు మాత్రం అతడు నా లైన్ అండ్ లెంగ్త్‌ను దెబ్బతీశాడు. సహజమైన షాట్లకు బదులు రివర్స్ స్వీప్, స్వీప్ షాట్లతో నాపై పైచేయి సాధించాడు. అంతేకాదు 'ఈ రోజు నాది. నువ్వు నన్ను ఔట్ చేయలేవు' అని నాతో అన్నాడు. అతడి మాటలు విన్నాక నాలో మరింత కసి పెరిగింది. అలానా అయితే చూద్దాం అనుకున్నా. 'నువ్వు మిస్ అయితే నేను వికెట్ల పడగొడుతా' అని డకెట్‌తో చెప్పాను. అలా చెప్పినట్టే.. అతడి వికెట్ తీశాను. ఇంగ్లిష్ ఓపెనర్ నిరాశగా పెవిలియన్ వెళ్తుంటే అతడి భుజంపై వేసి.. ప్రతిసారి నువ్వు విజయం సాధించలేవు. ఈసారి నేను గెలిచాను అని సరదాగా అన్నాను. నా మాటల్ని డకెట్ కూడా స్పోర్టివ్‌గానే తీసుకున్నాడు' అని తమ ఇద్దరి మధ్య జరిగిన సంభాషణను ఆకాశ్ వెల్లడించాడు. భారత జట్టు రెండో ఇన్నింగ్స్‌లో నైట్ వాచ్‌మన్‌గా వచ్చిన ఆకాశ్.. అద్భుతమైన ఆటతో అలరించడమే కాదు టెస్టుల్లో తొలి అర్ధ శతకం సాధించాడు. ఓపెనర్ యశస్వీ జైస్వాల్‌తో కలిసి నాలుగో వికెట్‌కు విలువైన 107 రన్స్ జోడించాడీ స్పీడ్‌గన్. ఇంగ్లండ్ పర్యటనలో 13 వికెట్లతో రాణించిన ఆకాశ్ స్వదేశం వచ్చాక తన డ్రీమ్ కారు కొన్నాడు. రాఖీ పండుగ రోజున తన సోదరీమణులతో కలిసి టయోటా ఫార్చునర్ కారు కొనుగోలు చేశాడీ పేసర్.

### క్రికెట్

### నాకు రెండో అవకాశమిచ్చింది

ఇంగ్లండ్ పర్యటనలో భారత జట్టు సంచలన ప్రదర్శనతో సిరీస్‌ను సమం చేసింది. టాప్ ఆర్డర్, మిడిల్ ఆర్డర్, బౌలింగ్ యూనిట్ అద్భుతంగా రాణించడంతో టీమిండియా చరిత్ర సృష్టించింది. అయితే, బ్యాటర్ కరుణ్ నాయర్ మాత్రం ఈ పర్యటనలో దారుణంగా విఫలమయ్యాడు. నాలుగు టెస్టుల్లో కేవలం ఒక్క అర్ధ శతకం (ఓవల్ టెస్టులో) మాత్రమే సాధించిన అతడు అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయాడు. క్రిక్‌ఇన్ఫోతో మాట్లాడుతూ, కరుణ్ తన వైఫల్యాన్ని అంగీకరించాడు. ఓవల్ టెస్టులో తాను బాదిన అర్ధ శతకాన్ని సెంచరీగా మలచలేకపోయినందుకు నిరాశ వ్యక్తం చేశాడు. అయినప్పటికీ, రెండు వికెట్లు త్వరగా కోల్పోయిన జట్టును తన ఇన్నింగ్స్‌తో పటిష్ట స్థితిలో నిలిపానని, గతంలో కౌంటీ క్రికెట్‌లో సర్రే జట్టుపై 150 పరుగులు సాధించిన అనుభవం తనలో ఆత్మవిశ్వాసం నింపిందని చెప్పాడు. భవిష్యత్‌లో అవకాశం వస్తే భారీ స్కోర్లు చేస్తానని, ఇంగ్లండ్ టూర్‌లో అనేక విషయాలు నేర్చుకున్నానని అతడు తెలిపాడు.

# టిమ్ డేవిడ్ సంచలనం

- వార్నర్ 16 ఏళ్ల సిక్సర్ల రికార్డు బద్దలు
- టీ20లో అత్యధిక సిక్సర్లు
- డార్విన్‌లో టిమ్ డేవిడ్ విధ్వంసం
- ఆస్ట్రేలియా 17 పరుగుల తేడాతో విజయం



పొట్టి క్రికెట్‌లో సంచలనంగా మారిన ఆస్ట్రేలియా బ్యాటర్ టిమ్ డేవిడ్ మరో రికార్డును బద్దలు కొట్టాడు. ఆదివారం దక్షిణాఫ్రికాతో డార్విన్‌లోని మర్రార క్రికెట్ మైదానంలో జరిగిన తొలి టీ20లో ఈ యువ ఆటగాడు 52 బంతుల్లో 83 పరుగులతో విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. 7.4 ఓవర్లలో ఆస్ట్రేలియా ఆరు వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న వేళ, డేవిడ్ ఎనిమిది సిక్సర్లు, నాలుగు ఫోర్లతో సఫారీ బౌలర్లకు చుక్కలు చూపించి, జట్టును 178 పరుగుల గౌరవప్రదమైన స్కోరుకు చేర్చాడు. ఈ ఇన్నింగ్స్‌తో 2009లో డేవిడ్ వార్నర్ సౌతాఫ్రికాపై ఆరు సిక్సర్లతో నెలకొల్పిన 16 ఏళ్ల రికార్డును డేవిడ్ అధిగమించాడు. ఈ రికార్డును డేవిడ్ హస్సీ (2009), మిచెల్ మార్ష్ (2023), ట్రావిస్ హెడ్ (2023)లు కూడా సమం చేశారు, కానీ డేవిడ్ ఎనిమిది సిక్సర్లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఇటీవల జూలై 26న వెస్టిండీస్‌పై మూడో టీ20లో డేవిడ్ 37 బంతుల్లో 102 పరుగులతో ఆస్ట్రేలియా తరఫున వేగవంతమైన సెంచరీ రికార్డు నెలకొల్పాడు, ఇందులో 11 సిక్సర్లు, ఆరు ఫోర్లు ఉన్నాయి. ఈ ఇన్నింగ్స్‌తో 2023లో స్కాట్లాండ్‌పై జోష్ ఇంగ్లిస్ (43 బంతులు) సాధించిన వేగవంతమైన సెంచరీ రికార్డును డేవిడ్ బద్దలు కొట్టాడు. ఐపీఎల్‌లోనూ విధ్వంసక బ్యాటింగ్‌తో ఆకట్టుకున్న ఈ చిచ్చరపిడుగు, ఆస్ట్రేలియా జట్టు టీ20 విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు.

డార్విన్‌లోని మర్రార క్రికెట్ మైదానంలో ఆదివారం జరిగిన దక్షిణాఫ్రికాతో తొలి టీ20లో ఆస్ట్రేలియా 17 పరుగుల తేడాతో విజయం సాధించింది. దక్షిణాఫ్రికా టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోగా, ఆస్ట్రేలియా మొదట బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 178/10 స్కోరు సాధించింది. టిమ్ డేవిడ్ (52 బంతుల్లో 83, 8 సిక్సర్లు, 4 ఫోర్లు) విధ్వంసక బ్యాటింగ్‌తో జట్టును ఆదుకున్నాడు. 7.4 ఓవర్లలో 75/6తో కష్టాల్లో పడిన ఆసీస్‌కు డేవిడ్, బెన్ ద్వార్షుయిస్ (34)లు 59 పరుగుల భాగస్వామ్యంతో ఊపిరి పోశారు. దక్షిణాఫ్రికా బౌలర్ క్వేనా మఫాకా (4/20) నాలుగు వికెట్లతో పటిష్టంగా బౌలింగ్ చేశాడు. కాగిసో రబడా (2/13), లుంగి ఎంగిడి (1/25) కూడా రాణించారు. ఛేదనలో దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 161/9 స్కోరుతో పోరాడినప్పటికీ లక్ష్యాన్ని చేరలేకపోయింది. ర్యాన్ రికెల్టన్ (44 నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్ (26) పోరాడినా, ఆస్ట్రేలియా బౌలర్లు జోష్ హాజిల్‌వుడ్ (3 వికెట్లు), బెన్ ద్వార్షుయిస్ (3 వికెట్లు) గట్టి పట్టు సాధించారు. గ్లెన్ మాక్స్‌వెల్ (1/29) కీలక వికెట్ తీసుకున్నాడు. ఈ విజయంతో ఆస్ట్రేలియా మూడు టీ20ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది.

క్రికెటర్లకు వీరాభిమానులు చాలామందే ఉంటారు. తమ అభిమాన ఆటగాళ్లను స్టేడియంలో చూసి మురిసిపోయేవాళ్లు కొందరైతే.. మరికొందరు భద్రతా వలయాన్ని దాటి మైదానంలోకి పరుగెత్తుతూ వెళ్లి తమ హీరోను హగ్ చేసుకుంటారు. అంతేతప్ప వాళ్ల ఫోన్ నంబర్‌గానీ, వాళ్లతో ముఖాముఖిగానీ సాధ్యం కావు. కానీ, ఒక కుర్రాడు మాత్రం ఏకంగా విరాట్ కోహ్లీ, ఏబీ డివిలియర్స్ వంటి స్టార్లతో నేరుగా వాట్సాప్‌లో సందేశాలు పంపాడు.

### మార్నస్ లబూషేన్ ఓపెనర్‌గా

# పునరాగమన ఆశలు



ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ మార్నస్ లబూషేన్ ఒకప్పుడు వరల్డ్ నంబర్ వన్‌గా, యాషెస్ హీరోగా, టెస్టు స్పెషలిస్ట్‌గా జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. అయితే, ప్రస్తుతం ఫామ్ లేమితో జట్టులో చోటు కోసం నిరీక్షిస్తున్న అతడు ఓపెనర్ స్థానంలో రాణించాలని ఆశిస్తున్నాడు. డేవిడ్ వార్నర్ వీడ్కోలు తర్వాత ఆసీస్ జట్టుకు శుభారంభాలు ఇచ్చే బ్యాటర్ కరువైంది. సామ్ కొన్‌స్టాస్, మెక్ స్వీనే వంటి యువ ఆటగాళ్లు ఓపెనర్‌గా విఫలమవుతున్న వేళ, ఉస్మాన్ ఖవాజాకు జోడీగా ఇన్నింగ్స్ ఆరంభించేందుకు తాను సిద్ధమని లబూషేన్ అంటున్నాడు. కోచ్‌ల సమక్షంలో తన లోపాలను సవరించుకుంటూ, విమర్శలను పట్టించుకోకుండా పునరాగమనంపై దృష్టి సారించాడు. ఫామ్ లేమి ఆటలో సహజమని, తనను తక్కువగా అంచనా వేస్తున్నవారి సందేహాలను తీర్చే సమయం ఆసన్నమైందని అతడు అంటున్నాడు. వెస్టిండీస్ సిరీస్‌కు దూరమైన తర్వాత తన ఆటపై దృష్టి పెట్టానని, గతంలో ఎక్కువగా మూడో స్థానంలో ఆడినప్పటికీ, ఇప్పుడు జట్టు కోసం ఓపెనర్‌గా సహా ఏ స్థానంలోనైనా ఆడేందుకు సిద్ధమని లబూషేన్ తెలిపాడు. డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఖవాజాతో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించి, రెండు ఇన్నింగ్స్‌లలోనూ చక్కగా ఆడిన అనుభవం తనకు ఉందని అతడు పేర్కొన్నాడు. ఈ ఏడాది నవంబర్ చివరలో జరిగే యాషెస్ సిరీస్ కోసం జట్టులో చోటు దక్కించుకునేందుకు లబూషేన్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. 2018లో టెస్టుల్లో అరంగేట్రం చేసిన లబూషేన్, 2019 యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ బౌలర్లకు చుక్కెదురై, నాలుగు హాఫ్ సెంచరీలతో 353 పరుగులు సాధించి నాలుగో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆ తర్వాత 12 మ్యాచ్‌లలో 1,591 పరుగులు, 2021-22 యాషెస్‌లో రెండు ఫిఫ్టీలు, ఒక సెంచరీతో 335 పరుగులు సాధించాడు. 2020లో వన్డే జట్టులోకి ఎంపికైన అతడు, 2023 వరల్డ్ కప్ ముందు పేలవ ఫామ్‌తో సెలెక్టర్లు పక్కనపెట్టినప్పటికీ, డీన్ ఎల్గర్ గాయంతో స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నాడు. ఫైనల్‌లో టీమిండియాతో జరిగిన మ్యాచ్‌లో 47 పరుగుల వద్ద మూడు వికెట్లు పడిన దశలో ట్రావిస్ హెడ్‌కు అండగా నిలిచి, 58 పరుగులతో నాటౌట్‌గా నిలవడం ద్వారా ఆస్ట్రేలియా విజయంలో కీలక పాత్ర పోషించాడు.




## ప్రేమకూ ఓ ఇల్లు ఇవ్వండి

### ఇండీ కుక్కపిల్లల దత్తతకు జీహెచ్‌ఎంసి పిలుపు

హైదరాబాద్, ఆగస్ట్ 10 : ప్రేమతో నిండిన ఒక చిన్న ప్రాణానికి మీరు ఓ ఇల్లు ఇస్తారా? అంటూ ఇండీ కుక్కపిల్లల దత్తతకు జీహెచ్‌ఎంసి వినూత్న రీతిలో ఆహ్వానం పలుకుతుంది. బిఎ హీరో, దత్తత తీసుకోండి, షాపింగ్ వద్దు (Be a Hero. Adopt, Don`t Shop) నినాదంతో బంజారా హిల్స్, రోడ్ నం. 1లోని జలగం వెంగళ్రావు పార్క్ లో ఈ నెల 17న ఉదయం 6:00 గంటల నుండి 10:00 గంటల వరకు ఇండీ కుక్కపిల్లల ప్రత్యేక దత్తత మేళా జీహెచ్‌ఎంసి నిర్వహిస్తుంది. దత్తత కోసం వచ్చే డాగ్ లవర్స్ కోసం డివార్మింగ్ చేసి, టీకాలు వేసిన, ఆరోగ్యకరం, నమ్మకమైన ఫ్రెండ్లీ కుక్క పిల్లలను మేళాలో ప్రదర్శనగా ఉంచుతారు. వీటి సంరక్షణ కూడా సులభమే. మేళాలో ఉంచే అందమైన ఫ్రెండ్లీ పప్పిలు దత్తత తీసుకున్న వ్యక్తులనే కాకుండా వారి కుటుంబానికి మంచి స్నేహితులుగా మారతారు. "దత్తత పూర్తిగా ఉచితం - కావలసింది మీ ప్రేమ మాత్రమే" అంటూ జీహెచ్‌ఎంసి పిలునిస్తుంది. జీహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఈ మేళా ప్రకటన పోస్ట్ చేయగా పప్పి లవర్స్‌ను విశేషంగా ఆకట్టుకుంటుంది.

## పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణకు వర్షం ముంపు పొంచి ఉంది. ఈ మేరకు వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. ఈ నెల 13న బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని, ద్రోణి ప్రభావం ఈశాన్య బంగాళాఖాతం వరకూ కొనసాగనుందని తెలిపింది. దీంతో ఈ రోజు ఏడు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ములుగు, భద్రాద్రి, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్,కామారెడ్డి జిల్లాలో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. సోమవారం తెలంగాణలోని 11 జిల్లాలకు ఎల్లో అలర్ట్ చేసినట్లు స్పష్టం చేసింది. వర్షం పడే సమయంలో గంటకు 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.

కాగా రాష్ట్రంలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్‌లో ఆదివారం సైతం వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులపైకి భారీగా నీరు చేరింది. దీంతో రోడ్లపై వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. లోతట్టు ప్రాంతాల్లో నీళ్లు చేరాయి. వాన నేపథ్యం లో జీహెచ్‌ఎంసీ, హైడ్రా సిబ్బంది అప్రమత్తమ య్యారు. లోతట్టు ప్రాంతా ల్లో సహాయక చర్యలు చేపట్టారు.

## సత్తుపల్లిలో దొంగల బీభత్సం

**ఖమ్మం ప్రతినిధి (జనంసాక్షి) :** సత్తుపల్లి పట్టణంలోని జేవీఆర్ ఓసీ సింగరేణి ఉద్యోగుల సౌకర్యార్థం నిర్మించిన పీవీఆర్ రావు సెంటినరీ కాలనీలో ఆదివారం తెల్లవారుజామున దొంగలు బీభత్సం సృష్టించారు. వరుసగా మూడు రోజులు సెలవు దినాలు ఉండడంతో ఉద్యోగులు కుటుంబ సభ్యులతో కలిసి ఊర్లకు వెళ్లిన సమయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆరు క్వార్టర్స్‌లో దొంగలు భారీగా సొత్తు చోరీ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం రెండు క్వార్టర్స్ చోరీకి గురైన వస్తువులను గుర్తించగా మిగిలిన ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో వారికి పోలీసులు సమాచారం అందించారు. అశోక్ క్వార్టర్స్‌లో రూ.30 వేల నగదు, 40-50 తులాల వెండి, 3 తులాల బంగారం, ఓ మొబైల్ ఫోన్, అఖిల్ క్వార్టర్స్‌లో 3 తులాల బంగారం, రూ. 8 వేలు నగదు చోరీకి గురైనట్లు సమాచారం. సత్తుపల్లి పట్టణ సీఐ టి.శ్రీహరి క్లూస్ టీం, డాగ్స్ క్యాడ్ రప్పించి కేసు దర్యాప్తు చేపట్టారు. సీసీ టీవీ పుటేజీలను పరిశీలిస్తున్నారు. కాగా వరుస చోరీలతో సింగరేణి ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశాలకు ఆహ్వానం

**హైదరాబాద్, ఆగస్టు 9 :** డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2024-25 విద్యా సంవత్సరా నికి వాణిజ్యం, ఇంగ్లీష్, తెలుగు, ఆర్థిక శాస్త్రం, చరిత్ర, ప్రజా పరిపాలన, సామాజిక శాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, గణితం విభాగాలలో పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీ పుష్ప చక్రపాణి తెలిపారు. ప్రవేశాలు కంప్యూటర్ ఆధారిత పరీక్ష ద్వారా జరుగుతాయని, UGC/CSIR-JRF/NET/SLET/SETలో అర్హత సాధించిన లేదా ఎం.ఫిల్ పట్టా పొందిన అభ్యర్థులు నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావచ్చని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ ఆగస్టు 30 కాగా, ఆలస్య రుసుముతో సెప్టెంబర్ 4, 2025 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ప్రవేశ పరీక్ష హైదరాబాద్‌లో మాత్రమే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీని త్వరలో విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో ప్రకటిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 040-23544741, 23680411, 23680240 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## కృష్ణానగర్ సినీ కార్మికుల భారీ నిరసన

**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని ఫిల్మ్ ఫెడరేషన్ కార్యాలయం వద్ద సినీ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఫిల్మ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనకు కృష్ణానగర్ నుంచి 24 యూనియన్ల కార్మికులు భారీగా తరలి వచ్చారు. వేతనాలు పెంచాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. శనివారం నిర్మాతలు, కార్మిక సంఘాలకు మధ్య జరిగిన చర్చలు విఫలం అయ్యాయి. మూడు కేటగిరీలుగా విభజించి, కార్మికుల వేతనాల్ని పెంచాలని నిర్మాతల నిర్ణయం తీసుకున్నారు. అయితే.. నిర్మాతల నిర్ణయంపై కార్మిక సంఘాలు అసంతృప్తి చెందాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఫిల్మ్ ఫెడరేషన్ కార్యాలయం వద్ద సినీ కార్మికుల ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులు మాట్లాడుతూ.. కొందరికి మాత్రమే వేతనాలు పెంచుతామనడం తప్పు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై ఏ షూటింగ్స్ జరగవని, నిర్మాత విశ్వప్రసాద్ మాకు నోటీసులు ఎందుకు పంపారో అర్థం కావడం లేదన్నారు. మేము ఛాంబర్‌తో మాత్రమే మాట్లాడతామని స్పష్టం చేశారు. పీపుల్స్ మీడియా మాకు రూ. 90 లక్షల బకాయి ఉందని ఆరోపించారు. మా వేతనాల పెంపును నిర్మాతలు పెద్ద సమస్యగా గుర్తించడం లేదన్నారు. ఛాంబర్‌తో చర్చలు జరపాలని నటుడు చిరంజీవి సూచించారని, చిరంజీవి మాతో టచ్ లోనే ఉన్నారని, మంత్రి కోమటిరెడ్డి కార్మికుల పక్షాన నిలబడ్డారని, రేపు మంత్రిని కలవనున్నట్లు ఫిల్మ్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ అనిల్ కీలక వ్యాఖ్యలు చేశారు. స్కిల్ లేదని ఎలా అంటారు.. అని ఫైటర్స్ యూనియన్ కార్మికులు మీడియాతో మాట్లాడారు. మేం ఒత్తిడి చేయడం లేదు, మమ్మల్ని గుర్తించండి.. అని వేడుకున్నారు. వేతనాలు పెంచాలని అడిగితే కేసులు వేస్తారా..? వచ్చే ఆదాయంలో మేము వాటాలు అడగట్లేదని నిలదీశారు.

## ఆగస్టు 15 నుంచి ఫాస్టాగ్ వార్షిక పాస్ అమలు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఎఐ) వాహనదారులకు ఒక శుభవార్త అందించింది. టోల్ ప్లాజాల వద్ద చెల్లింపులను మరింత సులభతరం చేసేందుకు 'ఫాస్టాగ్ వార్షిక పాస్'ను ప్రవేశపెట్టనుంది. ఈ కొత్త పథకం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి రానుంది. తరచుగా జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి పదేపదే రీఛార్జ్ చేసుకునే శ్రమను తగ్గించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఈ వార్షిక పాస్ ధరను రూ. 3,000గా నిర్ణయించారు. ఈ మొత్తాన్ని చెల్లించిన ప్రైవేట్ వాహన యజమానులు ఏడాది పాటు లేదా 200 ట్రిప్పుల వరకు టోల్ చెల్లించాల్సిన అవసరం ఉండదు. కార్లు, జీపులు, వ్యాన్‌ల వంటి వాణిజ్యే తర వాహనాలకు మాత్రమే ఈ సౌకర్యం వర్తిస్తుంది. ఈ పాస్‌ను కొనుగోలు చేయాలంటే వాహనానికి ఇప్పటికే ఫాస్టాగ్ యాక్టివ్‌గా ఉండాలి. 'రాజ్‌మార్గ్ యాత్ర' యాప్ లేదా ఎన్‌హెచ్‌ఎఐ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే, ఈ పాస్ కేవలం ఎన్‌హెచ్ ఎఐ, కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ పరిధిలోని జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై మాత్రమే చెల్లుబాటు అవుతుందని అధికారులు స్పష్ట పర్చారు. ముంబై-పుణె ఎక్స్‌ప్రెస్‌వే, సమృద్ధి మహామార్గ్, అటల్ సేతు వంటి రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని రహదారులపై ఈ పాస్ పనిచేయదు. అటువంటి మార్గాలలో ప్రయాణించేటప్పుడు ఫాస్టాగ్ వ్యాలెట్ నుంచి యథావిధిగా టోల్ రుసుము కట్ అవుతుంది. ఒక వాహనంపై తీసుకున్న పాస్‌ను మరో వాహనానికి బదిలీ చేయడానికి వీలుండదు. అలాగే, 200 ట్రిప్పులు లేదా ఏడాది గడువు ముగిసిన తర్వాత పాస్ గడువు ముగు స్తుంది. వినియోగదారులు కావాలనుకుంటే మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పాస్‌కు ఆటో -రెన్యూవల్ సౌకర్యం ఉండదు.



## నేనలా అనలేదు : మల్లారెడ్డి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మరోసారి మాట మార్చేశారు. ఇకపై రాజకీయాలకు దూరంగా ఉంటూ విద్యా సంస్థలను నడుపుకుంటానని చెప్పిన ఎమ్మెల్యే మల్లారెడ్డి 24 గంటల్లోనే తాను అలా అనలేదని చెప్పారు. రాజకీయాల్లో రిటైర్మెంట్ లేదని,తన చివరి శ్వాస వరకు ప్రజాసేవలోనే ఉంటానని తెలిపారు. ఆదివారం మేడ్చల్ జిల్లా జవహర్ నగర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రాజకీయాలకు దూరంగా ఉంటానని తాను అనలేదన్నారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన ఎంపీగా, మంత్రిగా, ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేశానని, ఇకపై రాజకీయాలకు దూరంగా ఉంటూ దేశవ్యాప్తంగా విద్యాసంస్థలను పెడతానని పేర్కొన్నారు. ఆయన మాట్లాడిన మాటలు రాష్ట్ర వ్యాప్తంగా వైరల్‌గా మారి పోయాయి. బీజేపీ, టీడీపీ పార్టీల్లో చేరుతున్నారు అని ఓ విలేకరి అడగగా తాను ఏ పార్టీలోకి పోనని, ఇంకా ఎమ్మెల్యేగా మూడు సంవత్సరాల పదవీ కాలం ఉందని, బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని మాత్రమే చెప్పానని పేర్కొన్నారు. ఈ విషయంపై జవహర్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతూ తన వయస్సు 73 ఏళ్లని జపాన్‌లో విధంగా రిటైర్మెంట్ అనేది ఉండదో తనకు కూడా రాజకీయాల్లో రిటైర్మెంట్ ఉండదన్నారు.

# జనఔషధీ కేంద్రాల ద్వారా చౌకగా మందులు

- రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ



హైదరాబాద్ (జనంసాక్షి) : దేశవ్యాప్తంగా ఉన్న జన ఔషధీ కేంద్రాల ద్వారా లక్షలాది కుటుంబాలకు ఖరీదైన చికిత్స భారాన్ని తగ్గించి చౌకగా ప్రతి పౌరునికి అందుబాటులో ఉండే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి భారతీయ జన ఔషధీ పరియోజన కార్యక్రమం ప్రవేశపెట్టడం విప్లవాత్మక కార్యక్రమమని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ కొనియాడారు.

ఆదివారం హైదరాబాద్‌లో పీఎంబీఐ-లార్వెన్ జనఔషధి డిస్ట్రిబ్యూషన్ అండ్ మార్కెటింగ్ గిడ్డంగిని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ మన తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి పౌరునికి చవకగా, అందుబాటులో ఉండే, నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలన్న లక్ష్యంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అవుతుందన్నారు. ప్రధాన్ మంత్రి భారతీయ జనఔషధి పరియోజన అనేది ప్రజల ఆరోగ్య అవసరాలు, ఖరీదైన బ్రాండెడ్ ఔషధాల మధ్య ఉండే అంతరాన్ని తగ్గించే విప్లవాత్మక కార్యక్రమమని అభిప్రాయపడ్డారు. ఈ ఉప్పల్ గిడ్డంగి, తెలంగాణ జనఔషధి సరఫరా శ్రేణి వెన్నెముకగా నిలుస్తుందని, ఇది చవకైన మందులు, శస్త్రచికిత్సా పరికరాలను మన రాష్ట్రంలోని దూర ప్రాంతాలకూ వేగంగా, సమర్థవంతంగా చేరేలా చేస్తుందని అన్నారు. సుమారు 3,000 అవసరమైన ఔషధాలు మరియు శస్త్ర చికిత్సా వస్తువులను నిల్వ చేసే సామర్థ్యంతో, ఈ సదుపాయం మన ప్రజలకు నిజమైన ప్రాణాధారంగా మారుతుందన్నారు.

లార్వెన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ముఖ్యంగా వరుణ్ విహార్ మడుపడుగ, రాము మడుపడుగ సామాజిక బాధ్యత కలిగిన వ్యాపారవేత్తలని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిబద్ధత కలిగిన ప్రైవేట్ భాగస్వాములు కలసి పనిచేస్తే ఎంతటి ఫలితాలు సాధించవచ్చో నిరూపిస్తుందని, ఇది ఉద్యోగాలను సృష్టిస్తుందని, చిన్న వ్యాపారవేత్తలకు అవకాశాలిస్తోందని, జనరిక్ ఔషధాల నాణ్యతపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతుందని అన్నారు. ఒక సమాజం విలువ దాని బలహీనులను ఎలా కాపాడుతుందో దానిపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఆరోగ్యాన్ని అందుబాటులోకి తేవడం ద్వారా, మనం మరింత బలమైన, సమానత్వం కలిగిన భారతదేశాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఈ మైలురాయిని సాధించినందుకు పీఎంబీఐ, భారత ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం, లార్వెన్ గ్రూప్, ఆరోగ్య సిబ్బంది మరియు వాలంటీర్లందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం నుండి ప్రేరణ పొంది, ఆదాయం ఎంతైనా సరేప్రతి భారతీయుడికి నాణ్యమైన ఆరోగ్య సేవలు హక్కుగా లభించే భవిష్యత్తును నిర్మించడానికి మనమందరం కట్టుబడిగా పని చేద్దామన్నారు. ఈ కార్యక్రమానికి మహత్తర విజయం, దీర్ఘకాల ప్రభావం కలగాలని కోరుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ పార్లమెంట్ సభ్యులు కేంద్ర బొగ్గు గనుల శాఖ మాత్యులు జి కిషన్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి బీసీ సీఎం

- దక్షిణాదిలో బీసీ నాయకులు ముఖ్యమంత్రులయ్యారు
- టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్






హైదరాబాద్ (జనంసాక్షి) : భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి బీసీ సీఎం కావడం ఖాయమని, దక్షిణాదిలో బీసీ నాయకులు ముఖ్యమంత్రులయ్యారని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. రవీంద్ర భారతిలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 375వ జయంతి జాతీయ వారోత్సవాలు నిర్వహించారు. ఈ 375వ జయంతి జాతీయ వారోత్సవాలకు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, టీపీసీసీ జనరల్ సెక్రటరీలు వట్టికూటి రామారావు గౌడ్, మధు సత్యం గౌడ్, వివిధ పార్టీల గౌడ్ సంఘ నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాలన్నింటిలో బీసీ నాయకులు ముఖ్యమంత్రులు అయ్యారని...కానీ తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఇప్పటివరకు బీసీ సీఎం కాలేదని తెలిపారు. సోషల్ జస్టిస్ కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటం ఎనలేనిదని పేర్కొన్నారు. "ఎవరి శాతం వారికి వాటా" అన్న రాహుల్ గాంధీ ఆశయం మేరకు భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ నుంచి బీసీ సీఎం అవుతారని స్పష్టం చేశారు. ఇటీవల జంతర్ మంతర్‌లో చేపట్టిన మహా ధర్నాకు అన్ని వర్గాల నేతలు, ప్రజలు విశేష మద్దతు తెలిపారని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు అసెంబ్లీలో మద్దతు తెలిపిన బీజేపీ నేతలు ఢిల్లీలో మాత్రం మొఖం చాటేశారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తికమకపెట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించి తీరుతామని హామీ ఇచ్చారు. కూకట్‌పల్లి ఘటన దురదృష్టకరమని పేర్కొన్నారు. నగరంలో కల్లు కాంపౌండ్లపై జరుగుతున్న అసత్య ప్రచారాలను నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కల్లు కాంపౌండ్‌లకు సంబంధించి తాటి చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సూచించారు.

# వరద సమస్యను పరిష్కరించేందుకు శాయశక్తుల కృషి చేస్తున్నాం

- జీహెచ్ఎంసీ అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ (జనంసాక్షి) : వర్షాకాలం పూర్తి అయ్యే వరకూ నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా అన్ని విభాగాలు సమన్వయంతో వ్యవహరించాలని రాష్ట్ర రవాణా శాఖ, జిల్లా ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో హైదరాబాద్, ఔటర్ రింగ్ రోడ్డు లోపల వర్షా కాలంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా తీసుకుంటున్న జాగ్రత్త చర్యలు ,సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో కలిసి జిహెచ్ఎంసి, హైడ్రా, జలమండలి, ట్రాఫిక్ , విద్యుత్, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను దూరం చేసేందుకు చేపట్టిన మాన్సూన్ సంబంధిత పనులు, రోడ్లు, స్టార్మ్ వాటర్ డ్రైన్ వర్క్స్, డీ - సీలింగ్, రోడ్డు సేఫ్టీ డ్రైవ్ లో భాగంగా చేపట్టిన రోడ్డు మరమ్మతు, క్యాచ్ పిట్ పనులు, హైడ్రా సమన్వయంతో చేపడుతున్న పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్ మంత్రికి వివరించారు. సివరేజ్, స్టార్మ్ వాటర్ కలిసే ప్రదేశాలను గుర్తించి వాటిని వేరు చేసే ఓవర్ ఫ్లో సమస్యల పరిష్కారానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి మంత్రి కి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశంలో అధికారులకు పలు సూచనలు చేశారు. హైదరాబాద్ సహా ఓ ఆర్ ఆర్ లోపల ప్రజలకు ఇబ్బందులు దూరం చేసేందుకు జిహెచ్ఎంసి, హైడ్రా, జలమండలి, ట్రాఫిక్, విద్యుత్, ఇరిగేషన్, రెవెన్యూ, లేక్స్ విభాగం అధికారులు,సిబ్బంది మరింత సమన్వయం, మరింత ప్రభావంతంగా పనిచేయాలన్నారు. సమావేశంలో హైడ్రా కమిషనర్ ఎ వి రంగనాథ్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్,జోనల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# దేవాదుల ప్రాజెక్ట్ ద్వారా సాగునీరును అందిస్తాం

## రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క



ములుగు ప్రతినిధి/ కన్నాయిగూడెం, ఆగష్టు 10(జనంసాక్షి): దేవాదుల ప్రాజెక్ట్ ప్రభుత్వానికి అత్యంత ప్రాముఖ్యమైన ప్రాజెక్ట్ అని, ప్రాజెక్ట్ పరిధిలోని 17 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఆయకట్టుకు సాగునీరును అందిస్తామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం దేవాదుల ప్రాజెక్ట్ ప్రాంగణంలో జె. చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్ట్ పనుల పురోగతిపై దేవాదుల ప్రాజెక్ట్ అధికారులతో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దనసరి అనసూయ సీతక్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపి, ఎమ్మెల్యేలతో కలిసి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్ట్ అత్యంత ముఖ్యమైన ప్రాజెక్ట్17 నియోజకవర్గాల పరిధిలో ఆయకట్టుకు త్వరితగతిన పూర్తి చేయాలనే ఉద్దేశ్యం తో ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. 67 కోట్ల తో భూసేకరణ చేపట్టనున్నామని తెలిపారు. దశల వారిగా నిధులను విడుదల చేస్తామన్నారు. 71 మీటర్ల తో 17 నియోజకవర్గాలకు సాగునీరందిస్తామని అన్నారు. ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించి, పెండింగ్ బిల్లులు కలిపి మొత్తం వంద కోట్ల రూపాయలు ఉన్నాయని, విడతాలవారీగా విడుదల చేస్తామని, ఇందుకు సంభందించిన వివరాలను అధికారులు వెంటనే పంపాలని అధికారులను సూచించారు. రైతులకు ఇబ్బందులు రాకుండా ఏడాదిలో రెండు సీజన్లకు సాగు నీటిని ఈ ప్రాజెక్టు ద్వారా అందించాలని.. అందుకు తగినవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు మొదలు పెట్టినప్పుడు 5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా నిర్మాణం చేపట్టినా.. మరింత పెరిగి ప్రస్తుతం ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తోందని, సాగు నీటి ఆయకట్టు ఇంకా పెరిగే అవకాశం ఉందనీ అన్నారు. ఈ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి.. అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని..త్వరితగతిన పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే పెరిగిన ఆయకట్టుకు కూడా నీరు అందించేలా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. గతంలో ఇక్కడ 38 టీఎంసీల స్సామర్థ్యం ఉండగా ఇప్పుడు 78 నుంచి 80 టీఎంసీల అవసరం అవుతుందని, ఇరిగేషన్ మంత్రి ఆలోచన చేసి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాగునీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్ట్ అన్ని దశలను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఛత్తిస్ గడ్ ప్రభుత్వ సాగునీటి పారుదల శాఖ మంత్రి కశ్యప్ తో చర్చలు జరుపుతున్నామని, ఛత్తీస్ గడ్ పరిధిలోని ముంపు ప్రాంతాలకు పరిహారం చెల్లించేందుకు మాట్లాడినట్లు పేర్కొన్నారు. దేవాదుల ప్రాజెక్ట్ పరిధిలో ఇంకా భూసేకరణ పూర్తికాని చోట్లా ఆయా జిల్లాల కలెక్టర్లతో మాట్లాడాలని సాగునీటి పారుదల శాఖ సీఈ వెంకటేశ్వర్లు ను ఆదేశించారు. భూసేకరణ పూర్తయిన చోట్లా పరిహారం చెల్లింపులు చేసేందుకు, భూసేకరణ పనులు మొదలు పెట్టేందుకు నిధులు విడుదల చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. సమీక్షా సమావేశం లో చర్చించిన అన్ని విషయాలను దృష్టిలో ఉంచుకొని సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. నీటి పారుదల శాఖ అధికారులు చిత్త శుద్ధితో , నిజాయితీ తో పూర్తి సమర్ధత తో పని చేయాలనీ అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్ట్ పై ఇక్కడ సమీక్ష నిర్వహించడం రెండోసారి అని అన్నారు. పక్కనే గోదావరి ఉన్నా కన్నాయిగూడెం ప్రాంతంలో సాగునీరు అందడం లేదన్నారు. దేవాదుల ద్వారా రామప్ప చెరువు నిండితే ములుగులోని పలు ప్రాంతాలు ముంపునకు గురవుతాయాన్నారు. తుపాకులగూడెం బ్యారేజ్ దేవాదుల బ్యారేజ్ నిర్మాణం కొరకు భూమి కోల్పోయిన రైతులకు మానవీయ కోణంలో ఆలోచించి తగినంత నష్టపరిహారం అందించాలన్నారు. మంగపేట, కన్నాయిగూడెం, ఏటూరు నాగారంలలో కెనాల్స్ పై ఏర్పాటు చేసిన లిస్టులో సరిగా పనిచేయక తాగునీరు అందడం లేదన్నారు. పాకల ద్వారా నర్సంపేటకు నీరందిస్తూ కొత్తగూడెం కూడా సాగునీరు అందించేలా ప్రణాళిక చేయాలని కోరారు. పేదరికాన్ని తగ్గించడానికి సాగునీరు పెంచడమే పదమ కర్తవ్యమని అన్నారు. ములుగు జిల్లా కు సంపూర్ణంగా సాగునీరు అందించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ త్వరలోనే సీతక్క చెప్పిన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమీక్షా సమావేశం లో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర పశు సంవర్ధక, శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, వారి వారి నియోజకవర్గాల పరిధిలో ఆయకట్టు విస్తీర్ణం, సాగునీటిపారుదల అంశాలను డిప్యూటీ సీ ఎం, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దేవాదుల ప్రాజెక్ట్ కు సంబంధించిన వివిధ దశలు, ఇప్పటి వరకూ పూర్తయిన వివిధ దశల పనులు, భూసేకరణ, తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సాగునీటిపారుదల శాఖ సీఈ వెంకటేశ్వర్లు వివరించారు. ముందుగా మంత్రులు సమక్క సాగర్ ప్రాజెక్ట్ ను సందర్శించి, గంగారం లోని దేవాదుల ఇంటెక్ పంప్ హౌస్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దేవాదుల పంపు హౌజ్ వద్ద మల్లంపల్లి మండల కొడిశల కుంటలో రూ. 2.7కోట్లతో చేపట్టిన 33/11 కెవి విద్యుత్తు ఉప కేంద్రం ను శిలా ఫలకాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క ఇతర మంత్రులతో కలిసి ప్రారంభించారు. అదేవిధంగా ములుగు మండలంలోని గట్టమ్మ, బండారుపల్లి, జగ్గన్నపేట, లింగాల, నార్లపూర్, రొయ్యూరు, బుచ్చంపేట లలో రూ. 20.73 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కెవి విద్యుత్ ఉప కేంద్రాలకు శంకుస్థాపన చేశారు. ఈ సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, ములుగు కలెక్టర్ దివాకర టీఎస్ ములుగు ఇంచార్జీ భూపాలపల్లి ఎస్పీ కిరణ్ కారే, హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు వెంకట్ రెడ్డి, సంధ్యారాణి, ఆర్డీవో లు సత్యపాల్ రెడ్డి, వెంకటేష్, ఇరిగేషన్ అధికారులు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# దొంగలించిన సొత్తు స్వాధీనం

- భారీ చోరికి పాల్పడిన నిందితుడు అరెస్ట్
- 13 తులాల బంగారం రికవరీ




రామకృష్ణాపూర్, ఆగస్ట్ 10 (జనంసాక్షి): పోలీస్ స్టేషన్ పరిధిలోని గద్దరాగడి పద్మావతి కాలనీలో శుక్రవారం రాత్రి చోరికి పాల్పడిన నిందితుడిని పట్టణ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో బెల్లంపల్లి ఎసిపి రవికుమార్ వివరాలను వెల్లడించారు. పద్మావతి కాలనికి చెందిన మేకల రాజయ్య నిర్మించుకున్న నూతన గృహంలో వరలక్ష్మి వ్రతం జరుపుకున్న అనంతరం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తున్న సమయంలో, గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో దాచి ఉన్న 13 తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లినట్లు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ప్రత్యేక బృందాలుగా ఏర్పడిన మందమర్రి సర్కిల్ పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టారని తెలిపారు. పట్టణంలోని సిసి ఫుటేజీల ఆధారంగా అనుమాన స్పధంగ తిరుగుతున్న వ్యక్తిని గమనించి అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేయగా మంచిర్యాల రాజీవ్ నగర్ లో నివాసం ఉంటూ దొంగతనానికి పాల్పడినట్లు జాడి సురేష్ ఒప్పుకోవడంతో దొంగలించిన సొత్తును స్వాధీనం చేసుకొని నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

## నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు : ఏసీపీ రవికుమార్

రామకృష్ణాపూర్ పట్టణంలో ఎవరైనా దొంగతనాలు, నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎసిపి రవికుమార్ హెచ్చరించారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి గుర్తించడంలో సిసి కెమెరాలు ఉపయోగపడ్డాయని, ప్రతి ఇంటి ఆవరణలో సీసీ కెమెరాలను తప్పనిసరిగా అమర్చుకోవాలని సూచించారు. 24 గంటల్లో కేసుని చేధించిన సీఐ శశిధర్ రెడ్డి, ఎస్సై రాజశేఖర్, పోలీస్ బృందాన్ని ఎసిపి రవికుమార్ అభినందించారు.

# సీటు కావాలంటే.. చిన్నారులకూ ఫుల్ టికెట్

- ఐదేండ్లు నిండని వారికీ హాఫ్ ఛార్జీలు
- ఆఫీసర్లతో మాట్లాడుకోండి అంటూనే కదులుతున్న బస్సులు
- 3 కిలోమీటర్లు వెళ్లిన తర్వాత ఆపి, టికెట్లు తీసుకుంటున్న వైనం
- చేసేదేం లేక అదనపు డబ్బులు కడుతున్న ప్రయాణికులు
- స్పెషల్ బస్సుల్లో పేద, మధ్యతరగతి ప్రజల నిలువు దోపిడీ







హైదరాబాద్ బ్యూరో, ఆగస్ట్ 10 (జనంసాక్షి) : రాఖీ పండుగ పూట పేద, మధ్య తరగతి ప్రజలు లబోదిబోమంటున్నారు. ఆర్టీసీ చార్జీలతో విలవిల్లాడిపోతున్నారు. తమ గమ్యస్థానాలకు వెళ్లాలనే తప్పని పరిస్థితుల్లో నిట్టూరుస్తూనే బస్సుల్లో టికెట్లు తీసుకుంటున్నారు. మహాలక్ష్మీ పథకం కింద ఫ్రీగా వెళ్లొచ్చనే ఆలోచనతో బస్టాండ్లు వెళ్తున్నవారికి ఎక్స్‌ప్రెస్ బస్సులు కనిపించకపోవడం, గంటల తరబడి వేచిచూసే పరిస్థితి ఉండటంతో గత్యంతరం లేక ఏ డీలక్సో, రాజధానో, ఎలక్ట్రిక్ బస్సులో ఎక్కేస్తున్నారు. ఇక్కడే వారికి చుక్కలు కనిపిస్తున్నాయి. స్పెషల్ బస్సులంటూ స్టిక్కర్లు అతికించిన ఆర్టీసీ అధికారులు... వాటిలో వర్తించే ఇతర నిబంధనలేవీ పెట్టలేదు. తీరా బస్సు ఎక్కినవారికి టికెట్ల ధరలు చూసి గుండెలు గుభేల్‌మంటున్నాయి.

5 నుంచి 12 ఏండ్లలోపు పిల్లలకు కూడా ఫుట్ టికెట్ తీసుకోవాలని, ఒకవేళ హాఫ్ టికెట్ తీసుకుంటే సపరేట్ సీటు ఇవ్వడం కుదరదంటూ చెబుతున్నారు. 5 ఏండ్లలోపు చిన్నారులకూ హాఫ్ టికెట్ తప్పనిసరిగా తీసుకోవాల్సిందేనంటున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే అధికారులతో మాట్లాడుకోండి అంటూనే బస్సు నిండగానే బస్టాండ్ పాయింటు నుంచి స్టార్ట్ చేస్తున్నారు. అక్కడే స్పష్టంగా చెప్పకుండా టికెట్లు ఇవ్వని డ్రైవర్లు.. 3 కిలోమీటర్లు వెళ్లిన తర్వాత బస్సు ఆపి ప్రయాణికుల నుంచి టికెట్లు తీసుకుంటున్నారు. అంతదూరం ప్రయాణించిన తర్వాత రోడ్డుపై దిగలేక, చెప్పిన ధరలు చెల్లించక తప్పని పరిస్థితుల్లో ప్రయాణికులు అదనపు డబ్బులు కడుతున్నారు. నిజానికి 5 ఏండ్లలోపు పిల్లలకు ఏ బస్సులోనైనా టికెట్ ఉండదు. 12 ఏండ్ల వరకు హాఫ్ టికెట్ వర్తిస్తుంది. కానీ స్పెషల్ స్టిక్కర్లున్న బస్సుల్లో ఈ నిబంధనలను బేఖాతరు చేస్తూ టికెట్లు వసూలు చేస్తుండటంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇద్దరు పిల్లలతో సుదూర ప్రాంతాలకు ప్రయాణిస్తున్న తల్లులకు ఆర్టీసీ తాజా నిర్ణయంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. హాఫ్ టికెట్ తీసుకున్నవారికీ సీటు ఇవ్వబోమని డ్రైవర్లు (కండక్టర్లు) తెగేసి చెప్పడంతో ఇద్దరు పిల్లలున్న తల్లులు వారిని వందలాది కిలోమీటర్లు పైన కూర్చోబెట్టుకుని ప్రయాణించడం ప్రయాసగా మారుతోంది. ఇదేనా ప్రజాపాలనా అంటూ ప్రయాణికులు తిట్లపురాణం అందుకోవడం బస్టాండుల్లో, బస్సుల్లో పరిపాటిగా మారింది.

### జర్నలిస్టులకూ నో ఎంట్రీ..!

పండుగల వేళ స్పెషల్ బస్సుల్లో, కొన్ని రాజధాని బస్సుల్లోనూ జర్నలిస్టు 1/3 రాయితీ పాస్‌లు వర్తించవంటూ కొందరు డ్రైవర్లు చెబుతున్నారు. మరికొందరైతే 1/3 పాస్ మాకు ఎంట్రీ చేయడం రాదంటూ జర్నలిస్టులను బస్సు ఎక్కనివ్వకుండా సాకులు చెబుతున్నారు. చాలా సందర్భాల్లో పలువురు జర్నలిస్టులకు ఇదే పరిస్థితి ఎదురైంది. జర్నలిస్టులకు స్టేట్ బస్ పాస్ ఉంటే అన్ని ఏసీ బస్సుల్లోనూ వర్తిస్తుందని ప్రభుత్వమే ప్రకటించింది. ఇది అవగాహన లేని కొందరు డ్రైవర్లు అడ్డంగా వాదిస్తున్నారు. అర్థం చేయించినా వినకుండా తమకు ఆ పాస్ ఎంట్రీ చేయడం రాదని సులువుగా దాటవేస్తున్నారు. మరి ప్రత్యేక బస్సుల్లో ఆర్టీసీ అధికారులే డ్రైవర్లకు, కండక్టర్లకు ఇలాంటి ఉచిత ఆదేశాలిస్తున్నారా అన్నది ఉన్నతాధికారులే చెప్పాలి.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370